www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 206 | శనివారం 19-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

భళా..భారత్ ...!



ఆస్ట్రేలియాపై 2-1 తేడాతో వన్డే సిరీస్ కైవసం

ధోనీ, జాదవ్, చాహల్ మ్యాజిక్

ఆస్ట్రేలియాపై భారత్ విజయాల పరంపర పరిపూర్ణమైంది. టీ20లను 1-1తో సమం చేసినా, టెస్టు, వన్డే సిరీస్‌లను 2-1 తేడాతో ఆసీస్‌ను ఓడించి, టీమిండియా విజయాన్ని దక్కించుకుంది. ఓ పటిష్టమైన జట్టుపై భారత్ అన్ని సిరీస్‌లను కోహ్లి నేతృత్వంలో అందుకోవడం ఓ అద్భుతమనే చెప్పాలి. చాలా ఏళ్ల తర్వాత ధోనీ తన బ్యాట్‌కు పనిచెప్పాడు. మూడు మ్యాచ్‌లలో అర్థసెంచరీలతో హ్యాట్రిక్ సాధించి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకున్నాడు.

12లో

మార్చిలో నగారా

- రాష్ట్ర సీఈవోలతో సీఈసీ మంతనాలు
- భద్రతా ఏర్పాట్లపైనా సమీక్ష
- జమ్మూకాశ్మీర్‌కూ అప్పడే
- కేంద్ర ఎన్నికల కమిషన్ కసరత్తు
- ఏపీలో ఏర్పాట్లపై ద్వివేదీ అభిలపక్షం
- రాజుకున్న రాజకీయ వేడి

లోక్‌సభ, ఏపీ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు

న్యూఢిల్లీ / అమరావతి :
సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం అందుకు అవసరమైన కసరత్తు చేపట్టింది. మార్చి మొదటి వారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. 6 లేదా 7 దశల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఈసీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీరు అసెంబ్లీ రద్దు అయింది. అది తిరిగి ఆరు మాసాల్లో తిరిగి ఏర్పడాల్సిన అవసరం ఉంది. అందువల్ల జమ్మూకాశ్మీరుకు కూడా లోక్‌సభతో పాటు ఎన్నికలు నిర్వహించే అంశంపై కసరత్తు చేస్తోంది. ఆరు మాసాల్లోగా ఎన్నికలు నిర్వహించాలన్న కృతనిశ్చయంతో ఈసీ ఉంది. అయితే,

- మిగతా 2 లో



ఎన్టీఆర్ వైద్యసేవ పరిమితి

రూ.5 లక్షలకు పెంపు



- ఏప్రిల్ నుంచి అమలు
- సత్తెనపల్లిలో 36 అడుగుల ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- మోడీ, కేసీఆర్, జగన్‌పై చంద్రబాబు నిప్పులు

విశాలాంధ్ర-గుంటూరు :
ఎన్టీఆర్ వైద్యసేవ కింద ప్రస్తుతమున్న పరిమితిని రూ.2.50 లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ నిర్ణయం ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ 23వ వర్థంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సత్తెనపల్లిలోని 57 ఎకరాల చెరువులో ఏర్పాటు చేసిన తారకరామ సాగర్, ఎన్టీఆర్ గార్డెన్స్‌ను ప్రారంభించారు. 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని, వావిలాల ఘాట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ మహా నాయకుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రంపై కుట్రలు పన్నుతున్న వారిపై పోరాడతామని అన్నారు. సత్తెనపల్లికి వన్నె తెచ్చేలా ఎన్టీఆర్ విగ్రహాన్ని స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఏర్పాటు చేశారని అభినందించారు. తెలుగుజాతి చరిత్ర ఉన్నంత కాలం తెలుగు ప్రజల

- మిగతా 2 లో

ఆయేషా మీరా హత్యకేసులో

సీబీఐ దూకుడు

3లో

సత్యంబాబు, కోనేరు సతీష్‌ను విచారించిన అధికారులు

అమిత్‌షా తనయుడి ఇష్టారాజ్యం

రెండేళ్లుగా ఆర్థిక నివేదికలు ఇవ్వని సంస్థ

7లో

మామిడిపాలెం

రణరంగం

- పోలీసులు, గ్రామస్తుల మధ్య ఘర్షణ
- ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలు
- పోలీసు జీపు ధ్వంసం



విశాలాంధ్ర -అనకాపల్లి:
విశాఖ జిల్లా అనకాపల్లి మండలం మామిడిపాలెం మళ్లీ వార్తల్లోకి ఎక్కింది... రెండు వర్గాల మధ్య వైరం... గ్రామస్తులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.. 2013-14లో ఆ గ్రామంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేసి

- మిగతా 11 లో

లక్షకోట్ల తాయిలాలు

ఈసారి మోడీ హామీల సునామీ

- రైతుల ఖాతాల్లోకి నిధులు
- వడ్డీ లేని రుణాలు
- వీటి ప్రచారానికి భారీ వ్యయం



న్యూఢిల్లీ :
త్వరలో లోక్‌సభకు జరగనున్న ఎన్నికలు 2014లో జరిగిన ఎన్నికలలాగా ప్రధాని నరేంద్రమోడీకి తేలికగా ఉండవు. ప్రజలలో ఆయనకు ఆదరణ గణనీయంగా తగ్గిపోయిందని పలు సర్వేలు తెలియజేస్తున్న నేపథ్యంలో ఓట్లు రాబట్టుకునేందుకు అనేక చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే లక్ష కోట్లకు పైగా రకరకాల పథకాలకు ఖర్చు చేస్తారని విశ్వసనీయమైన రెండు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పూర్తి అవగాహన ఆ సంస్థలకు ఉన్నది. అదనంగా చేసే ఖర్చు లేదా ఆదాయంలో నష్టం ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పడే ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఓట్లకోసం చేసే ఈ ఖర్చంతా వివిధ రకాల ప్రణాళికలు జాప్యం కావడానికి లేదా వాటిని తగ్గించేందుకు దోహం చేస్తుంది. బడ్జెట్‌లో లోటు పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రధానమైన సూచిక. ఇటీవల జరిగిన మూడు ప్రధాన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి చెందడంతో ఆందోళనకు గురైన మోడీ ప్రభుత్వం.. కొత్త, కొత్త పథకాల గురించి ఆలోచిస్తున్నది. పంటకు గిట్టుబాటు ధర రాక, వ్యవసాయం ఖర్చు పెరగడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన కారణంగా మోడీ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. అందువల్లనే ఆయా రాష్ట్రాలలో బీజేపీ ఓటమి పాలైంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ఇతరుల కంటే ఎక్కువ జనాదరణ పొందే అవకాశం ఉంది.

ఫిబ్రవరి 1వ తేదీన తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రైతులనుద్దేశించి విరివిగా కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈ అంశాలు వెల్లడించిన వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ అధికార వర్గాలు కూడా ఇదే అంశాన్ని ధృవీకరిస్తున్నాయి. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. రైతుల బ్యాంకు అకౌంట్లలోకి నేరుగా నిధులు బదిలీ చేయడం, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లాంటి చర్యలను మోడీ తీసుకోనున్నారు. ఇప్పటికే జీఎస్టీ ద్వారా వసూలు చేస్తున్న పన్నులు తగ్గించారు. అగ్రవర్ణాలను ప్రధానంగా ఉద్దేశించి 10% ఉద్యోగాల రిజర్వేషన్‌ను ప్రభుత్వం ఆమోదించింది. స్థానిక

- మిగతా 2 లో

విశాఖ ఉక్కు కర్మాగారంలో పేలుడు

రూ.150 కోట్ల నష్టం?



- బ్లాస్ట్ ఫర్నేస్ 3లో ఘటన
- నిలిచిన ఉత్పత్తి, తప్పిన ప్రాణ నష్టం

విశాలాంధ్ర- గాజువాక:
విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఉక్కు కర్మాగారం బ్లాస్ట్ ఫర్నేస్-3లో ఉదయం 8:45 గంటలకు ఈ దుర్ఘటన జరిగినట్టు ప్రాథమిక సమాచారం. బ్లాస్ట్ ఫర్నేస్ మూడులో ఒక్కసారిగా పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. దీంతో కార్మికులు భయభ్రాంతులై పరుగులు తీశారు. కర్మాగారంలో ఈ విభాగం చేసే ఉత్పత్తి ప్రక్రియలో టీఆర్ వాల్వులు కీలకంగా ఉంటాయి. ఇవి అధిక ఉష్ణోగ్రత వాయువులను లోపలికి పంపుతాయి. ఈ క్రమంలో అక్కడ మండుతున్న కోకో ..అగ్నికీలలుగా బయటకు వెలువడ్డాయి. ఇవి పని చేసే ప్రక్రియలో ఉత్పత్తి సామర్థ్యానికి మించి లోడు పెరగడంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయని తెలుస్తోంది. ఈ కారణంగానే టీఆర్ ట్వంటీ పెద్ద శబ్దంతో పేలింది. ఈ ఘటన సంభవించిన ప్రాంతం నుంచి సుమారు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



నో ప్రాబ్లమ్...ఎంజాయ్..ఎంజాయ్..

శబరిమలను దర్శించుకున్న

51 మంది మహిళలు

- అంతా 10-50 ఏళ్లలోపు వారే
- కేరళ దేవస్థానం మంత్రి వెల్లడి
- సుప్రీంకోర్టుకు వివరాల సమర్పణ

9లో

ప్రజా మద్దతు మాకే..!

- ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్డీ కలిసే పోటీ
- ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టీకరణ

ఇక తెలుగు రాష్ట్రాల్లో సౌర విద్యుత్‌తో

రైళ్లు పరుగులు..!

- దేశవ్యాప్తంగా 4వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం
- ఏపీలో 680, తెలంగాణలో 300 మెగావాట్ల ఉత్పత్తి
- బొగ్గు ఆధారిత విద్యుత్ వినియోగానికి గుడ్‌బై
- సంప్రదాయ ఇంధన వనరులకు అధిక ప్రాధాన్యం
- రైల్వే మంత్రిత్వశాఖ ప్రణాళికలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
తెలుగు రాష్ట్రాల్లో సౌర విద్యుత్ రైళ్లు పరుగులు తీసే సమయం ఆసన్నమైంది. సౌర విద్యుత్ ద్వారా దేశవ్యాప్తంగా రైళ్లు నడపాలని రైల్వేశాఖ యోచిస్తోంది. మొత్తం పది రాష్ట్రాల్లో ఎంపిక చేసిన రైలు మార్గాలకు ఇరువైపులా సౌర ఫలకాలు అమర్చి తద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రైలింజన్లకు అందచేయనుంది. బొగ్గు నిక్షేపాలు గణనీయంగా తగ్గిపోయి, భవిష్యత్తులో విద్యుదుత్పత్తి ప్రశ్నార్థకంగా మారుతుందని నిపుణులు, పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరుల వైపు రైల్వేశాఖ దృష్టి సారించింది. సౌర విద్యుదుత్పాదన కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తోంది. తొలిదశలో 4000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా మొదటి ఏడాది ఇదే మొత్తంలో థర్మల్ విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. యూనిట్ ధరతో పోలిస్తే థర్మల్ విద్యుత్ కంటే సౌర విద్యుత్ తక్కువకు వస్తున్నందున భవిష్యత్తులో సౌర విద్యుత్ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. సరాసరి ఒక్కో యూనిట్ ఐదు రూపాయలు, అంతకంటే తక్కువ ధరకే లభిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమ

- మిగతా 2 లో

రాష్ట్రాల వారీగా ఉత్పత్తి చేయనున్న సౌర విద్యుత్, వినియోగించే రైలు మార్గం వివరాలు...

రాష్ట్రం	సామర్థ్యం (మెగావాట్లు)	మార్గం పొడవు (కి.మీ.)
పశ్చిమ బెంగాల్	930	1,000
ఆంధ్రప్రదేశ్	680	755
ఒడిశా	600	666
ఛత్తీస్‌గఢ్	475	527
తమిళనాడు	425	472
తెలంగాణ	300	333
రాజస్థాన్	180	200
హర్యానా	170	189
కేరళ	120	133
పంజాబ్	120	133
మొత్తం	4,000	4,444

పాక్ ప్రధాన న్యాయమూర్తి ఆసిఫ్



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆసిఫ్‌సయీద్‌ఖోసా శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడి నివాసగృహంలో సాదాసీదాగా జరిగిన కార్యక్రమంలో ఆసిఫ్ ప్రమాణస్వీకారం చేశారు. భారతదేశంతో సహా పలు దేశాల విదేశీ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధ్యక్షుడు ఆరిఫ్ అల్వి ప్రధాన న్యాయమూర్తిచేత ప్రమాణస్వీకారం చేయించారు. ప్రధాన న్యాయమూర్తిగా ఇంతవరకు పనిచేసిన సాఖిబ్‌నిసార్ పదవీ విరమణ చేయడంతో కొత్త ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేశారు. ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్, ఉన్నతకోర్టుల న్యాయమూర్తులు, మంత్రులు, దౌత్యవేత్తలు, పౌర, సైనిక అధికారులు, లాయర్లు, విదేశీ అతిథులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని డాన్ పత్రిక తెలిపింది. కొత్త ప్రధాన న్యాయమూర్తి ఆసిఫ్ 1954లో పంజాబ్ రాష్ట్రంలోని దేరాఘాజిఖాన్ ప్రాంతంలో జన్మించారు. పంజాబ్ యూనివర్శిటీలోను అనంతరం కేంబ్రిడ్జి యూనివర్శిటీలోను ఆయన ఉన్నత విద్యను అభ్యసించారు. 1977లో ఆయన లాయరు వృత్తిని ప్రారంభించారు. 1998లో హైకోర్టు జడ్జిగా ప్రమాణం చేశారు. 2010లో సుప్రీంకోర్టు జడ్జి అయ్యారు.

13 లక్షల కి.మీ. రోడ్లు నిర్మిస్తున్న చైనా



వాషింగ్టన్ : సైన్యం వేగంగా తమ గమ్యానికి చేరుకునేందుకు వీలుగా కొత్తగా 13 లక్షల కి.మీ. రోడ్లను నిర్మించనున్నదని అమెరికా కాంగ్రెస్‌కు సైనిక విభాగం పెంటగాన్ తెలియజేసింది. కొత్తగా నిర్మించనున్న రోడ్లలో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ హైవేలు ఉన్నాయని, ఇవన్నీ 2020 నాటికి పూర్తవుతాయని పెంటగాన్ వెల్లడించింది. చైనాలో రైల్వేలైన్ నెట్‌వర్క్ లక్ష కి.మీ. ఉన్నదని, ఇందులో 10వేల కి.మీ. పొడవునా హైస్పీడ్ ట్రాక్‌ను నిర్మించారని, ఈ రైళ్లు గంటకు 250 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయని పెంటగాన్ 2019 నివేదికలో తెలిపింది. చైనా సైనికశక్తి పేరుతో పెంటగాన్ నివేదిక రూపొందించింది. మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు చైనా ప్రాధాన్యతనిస్తూ వాటికి నిధులను విడుదల చేస్తున్నదని ఆ నివేదిక పేర్కొన్నది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ప్రపంచంలోనే అతి పెద్ద సైనిక వ్యవస్థ. అలాగే ప్రస్తుతమున్న విమానాశ్రయాలను అభివృద్ధిపరుస్తున్నదని ఔట్‌పోస్టులను మెరుగుపరుస్తున్నదని నివేదిక పేర్కొంది.

విశాలాంధ్ర ప్రపంచం

కొలంబియాలో పేలిన కారుబాంబు

21 మంది మృతి, 68 మందికి గాయాలు



బొగొట : బొగొట నగరం పోలీసుల శిక్షణా అకాడమీవద్ద కారుబాంబుపేలి 21 మంది చనిపోగా, 68మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన గురువారం జరిగింది. మృతులకు సంతాప సూచికంగా 3 రోజులపాటు ప్రభుత్వం సంతాపదినాలను ప్రకటించింది. 16 ఏళ్లకాలంలో ఇంత తీవ్రమైన బాంబుదాడి జరగలేదని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. 80 కిలోల బరువుగల పేలుడు వస్తువులను ఉంచిన వాహనాన్ని టెర్రరిస్టులు పేల్చివేశారని రక్షణమంత్రిత్వశాఖ తెలియజేసింది. కారుబాంబును పేల్చిన వ్యక్తితో సహా 21 మంది చనిపోయారని ప్రాథమిక సమాచారం అందిందని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గాయపడిన 58 మందికి చికిత్సచేసి ఇంటికి పంపినట్టుగా ఆ ప్రకటన తెలిపింది. మొదట ఈ పేలుడులో 11 మంది చనిపోయారని, 65 మంది గాయపడ్డారని రక్షణమంత్రిత్వశాఖ తెలిపింది. కొలంబియా ప్రజలు టెర్రరిజాన్ని తిరస్కరిస్తారని, దానిపై పోరాడేందుకు సమైక్యంగా నిలుస్తారని అధ్యక్షుడు ఇవాన్‌డ్యూక్ ఒక ట్వీట్‌లో తెలియజేశారు. దేశ సరిహద్దులు, అలాగే అన్ని ఇతర రవాణా మార్గాలలో, నగర శివార్లలో భద్రతను పెంచినట్టు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ బాంబుపేలుడుకు కారకులైనవారి కోసం దర్యాప్తు జరుగుతుందని అధ్యక్షుడు తెలిపారు. అయితే బాంబుపేల్చిన వ్యక్తి కూడా చనిపోయాడని అధికారులు ధృవీకరిస్తున్నారు. ఇంతవరకు బాంబుపేలుడుకు తామే కారకులమని ఎవరూ ప్రకటించలేదు.

2,737 కాదు..

మరిన్నివేల మంది పిల్లల నిర్బంధం

వాషింగ్టన్ : సరిహద్దులనుదాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన తల్లిదండ్రుల నుండి వేరుచేసిన పిల్లల సంఖ్య ట్రంప్ ప్రభుత్వం చెప్పినట్టుగా 2737 కాదని, మరిన్ని వేలమంది అధికంగావున్నారని, అమెరికా ఆరోగ్య మానవసేవల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ తెలియజేశారు. అమెరికా, మెక్సికో సరిహద్దుల మీదుగా దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన తల్లిదండ్రులనుంచి వేలాదిమంది పిల్లలను అక్రమంగా నిర్బంధించడంపై జాతీయంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 2017-18 సంవత్సరానికి సంబంధించిన ఈ గణాంకాలను ట్రంప్ ప్రభుత్వం తక్కువగా ప్రకటించిందని ఆరోగ్య శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ తెలిపారు. నిర్బంధించిన పిల్లల బాధ్యతను ఆరోగ్య శాఖకు అప్పగించారు. జీరో టాలరెన్స్ (సహనశీలతలేమి) విధానాన్ని ప్రకటించిన తరువాత అక్రమ వలసలను నిరోధించేందుకు 3వేల మందికిపైగా పిల్లలను తల్లిదండ్రులనుండి వేరుచేసిన నిర్బంధ శిబిరాలలో ఉంచారు. ట్రంప్ ప్రభుత్వం 2018 మేనెలలో ఒక విధానాన్ని ప్రకటించిన తరువాతనే పిల్లలను నిర్బంధించడం పెరిగింది. 2018 మొదటి ఆరునెలల కాలంలో అక్రమ వలసలు పెరగడంతో వైట్‌హౌస్ విసిగిపోయిందని, దాంతో సరిహద్దుల్లో పిల్లలను తల్లిదండ్రుల నుండి వేరుచేయాలని సరిహద్దు అధికారులకు ఆదేశించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన తల్లిదండ్రులను అరెస్టు చేశారు. ఆ తరువాత తమ పిల్లలకోసం అనేక నెలలపాటు తల్లిదండ్రులు ఆందోళనతో వెదికినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ప్రభుత్వం ప్రకటించిన విధానంపై వలసదారులు, వారి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం ప్రకటించారు. ఇలా పిల్లలను నిర్బంధించడం నేరమని అంతర్జాతీయ మానవహక్కుల కార్యకర్తలు విమర్శించారు. 2018 జూన్ తరువాతనే అక్రమ వలసదారుల పిల్లలు ఎంతమందిని నిర్బంధించారన్న గణాంకాలపై శ్రద్ధ పెట్టారు. 2017 ప్రారంభంలో మాత్రం తల్లిదండ్రుల నుంచి వేరుచేసిన పిల్లల సంఖ్య ప్రభుత్వం చెప్పినదానికంటే అనేకవేలు ఎక్కువగావుందని ఆరోగ్యశాఖ అధికారి వెల్లడించారు.

చైనా వస్తువులపై పన్ను ఉపసంహరణ?



వాషింగ్టన్ : చైనా వస్తువులపై పెంచిన పన్నును ఉపసంహరించే అంశాన్ని అమెరికా అధికారులు పరిశీలిస్తున్నారు. స్టాక్‌మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనుకావడంవల్ల అధికారులు పెంచిన పన్నును ఉపసంహరించడానికి సిద్ధంగా ఉన్నారు. అమెరికాతో జరిగే వాణిజ్య చర్చలలో పాల్గొంటున్న చైనా ప్రతినిధి బృందానికి అమెరికా వైఖరి మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధాన్ని పరిష్కరించుకునేందుకు 90 రోజులు గడువు పెట్టుకున్నారు. మార్చి 1వ తేదీలోపు అమెరికా, చైనా అధికారులు కలిసి వాణిజ్య వివాదాలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

చైనా వస్తువులపైన 200 బిలియన్ డాలర్ల విలువ మేరకు అమెరికా పన్నులను పెంచింది. చైనా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై పన్ను ఉపసంహరణ ప్రతిపాదనను ఆర్థికమంత్రి స్టీవ్ నుచిన్ చేసినట్టు తెలుస్తోంది. చైనా వస్తువులపైన 250 బిలియన్ డాలర్లమేరకు రెండు దఫాలుగా అమెరికా పన్నులను విధించింది. అయితే ఈ మొత్తం పన్నులను ఉపసంహరించుకుంటుందా? లేక పాక్షికంగా ఉపసంహరించుకోవాలని నిర్ణయిస్తుందా? అనేది స్పష్టం కావలసివుంది. అయితే ఈ అంశాన్ని వైట్‌హౌస్ ఇంకా పూర్తిగా చర్చించలేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఈ వార్త వెలువడిన తరువాత అమెరికా స్టాక్ మార్కెట్లు సానుకూలంగా స్పందించాయి. చైనా ప్రతినిధులతో జరుగుతున్న చర్చలలో అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్‌లిగ్‌థింజర్ పాల్గొన్నారు. చైనాతో జరుపుతున్న చర్చలు ఇంకా పూర్తికాలేదని ఆర్థికమంత్రిత్వశాఖ తెలియజేసింది. అయితే పన్నుల ఉపసంహరణ విషయం ఆర్థికమంత్రిగాని, రాయబారిగాని సిఫారసు చేయలేదని అమెరికా వాణిజ్యబృందం ప్రతినిధి ఇమెయిల్‌ద్వారా తెలియజేశారు. చైనా బృందంతో చర్చలు చక్కగా జరుగుతున్నాయని, వారం క్రితమే ట్రంప్ ట్వీట్ చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్యయుద్ధం అనేక నెలలుగా స్టాక్‌మార్కెట్లను తీవ్ర ఒడిదుడుకులకు లోనుచేసింది.

బ్రిటన్‌లో పెరిగిన భారత విద్యార్థులు



లండన్ : భారతదేశంనుండి లండన్‌లో చదువుకునేందుకు వస్తున్న విద్యార్థుల సంఖ్య ఇటీవలకాలంలో మొదటిసారిగా పెరిగిందని ఉన్నత విద్య గణాంకాల ఏజెన్సీ తెలియజేసింది. గతంలో వీరిసంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2010-11లో 39,090 మంది భారత విద్యార్థులుండగా 2016-17 నాటికి వారి సంఖ్య 16,550కి తగ్గిపోయింది. అయితే 2017-18లో ఈ సంఖ్య 19,750కి పెరిగిందని ఉన్నతవిద్యా గణాంకాల ఏజెన్సీ తెలియజేసింది. అయితే ఇప్పటికీ బ్రిటన్ చేరుకుంటున్న విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉన్నదని గణాంకాలు తెలియజేస్తున్నాయి. బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలకు చెందిన విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజులకంటే భారత్, యూరోపియన్ యూనియన్‌యేతర దేశాలనుండి వస్తున్న విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజులు 3 రెట్లు అధికంగా ఉన్నాయి. విదేశాలనుండి వస్తున్న విద్యార్థులమూలంగా లభించే ఆదాయాన్ని ఇటీవల ఒక అధ్యయన విభాగం ప్రకటించింది. ఇతర అన్ని దేశాలకంటే చైనానుండి ఎక్కువగా విద్యార్థులు బ్రిటన్‌కు వస్తున్నారు. 2017-18లో 1,06,530 మంది చైనా విద్యార్థులు బ్రిటన్ చేరుకున్నారు. వీరితో పోల్చినపుడు భారత విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది.

ట్రంప్ దావోస్ పర్యటన రద్దు



వాషింగ్టన్ : దావోస్‌లో జరగనున్న ఆర్థికవేదిక అంతర్జాతీయ వార్షిక సదస్సు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినిధివర్గం పర్యటన రద్దయింది. ఈ పర్యటనను ట్రంప్ రద్దుచేసినట్టు వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారాశాండర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి ట్రంప్ 5.7 బిలియన్ డాలర్లు మంజూరు చేయాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేశారు. ప్రభుత్వం మూతపడి దాదాపు 28 రోజులయ్యింది. కొన్ని ప్రభుత్వ శాఖలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రతినిధుల సభకు ట్రంప్‌కు మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన కొనసాగుతూనేవుంది. 8 లక్షలమంది సిబ్బంది, కార్మికులకు ఇంతవరకు వేతనాలు అందలేదు. ఈ సమస్య పరిష్కారమయ్యేంతవరకు ట్రంప్ దేశంలోనే ఉంటారని, అందువల్ల స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరానికి తన పర్యటనను రద్దు చేసుకున్నారని ఆ ప్రకటన తెలిపింది. ఆర్థికమంత్రి స్టీవ్‌నుచిన్ ఆధ్వర్యంలో 5గురితో కూడిన బృందం దావోస్‌కు వెళ్లవలసివుంది. ఈ బృందంలో విదేశాంగమంత్రి మైక్‌పాంపియో, వాణిజ్యమంత్రి విల్‌బర్‌రాస్, అమెరికా వాణిజ్యవిభాగం ప్రతినిధి రాబర్ట్ లిగ్‌థింజర్, అధ్యక్షుడి సహాయకుడు క్రిస్‌లిడ్డెల్ ఉన్నారు. డెమోక్రాట్లు మెజార్టీ ఉన్నందునే ప్రతినిధుల సభ ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించిందని ప్రభుత్వం భావిస్తోంది.

రూ.150 కోట్ల నష్టం?



(మొదటిపేజీ తరువాయి)

100 మీటర్లు మేరకు మండుతున్న బొగ్గు కణికలు వెలువడ్డాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో ఉన్న మోటారు వాహనాలు, యంత్ర పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనతో వారం రోజులపాటు బీఎఫ్ త్రీలో అంతరాయం వాటిల్లిందని, యాజమాన్యం ప్రకటించింది. దీంతో రూ.150 కోట్లు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పరిశ్రమ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. పేలుడు జరిగిన ప్రాంతంలో కార్మికుల రెస్ట్ రూమ్, ఆఫీసు, కంట్రోల్ రూమ్‌లు ఉన్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఆ గదుల్లో శ్రామికులు లేకపోవడంతో ఏ ఇబ్బందులు తలెత్తలేదు.

నిర్వహణ లోపంతోనే ప్రమాదం
- ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు ఆదినారాయణ

నిర్వహణ లోపాలతోనే విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ అన్నారు. శుక్రవారం విశాఖ ఉక్కు కర్మాగారంలో బ్లాస్ట్ ఫర్నేస్ మూడులో సంభవించిన పేలుడుపై ఆయన స్పందించారు. స్టీల్‌ప్లాంట్‌లో తరచూ జరుగుతున్న ప్రమాదాలను ఉటంకిస్తూ యాజమాన్యం భద్రతాపరమైన ప్రమాణాలు అందిపుచ్చుకోవడంతో పాటు, ప్రమాదాల నివారణకు శ్రద్ధ చూపాలన్నారు. ఉత్పత్తి ప్రక్రియలో ఆయా విభాగాల్లోని యంత్ర పరికరాలకు సంబంధించి సామర్థ్యాలను తరచూ బేరీజు వేసుకుంటూ ముందుకు సాగాలే తప్ప వాటిపై ఒత్తిడి పెంచేలా పనులు చేపట్టడం సరికాదన్నారు. యాజమాన్యం ఇకనైనా ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల నేపథ్యంలో యాజమాన్యం పాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉందని ఆదినారాయణ వ్యాఖ్యానించారు.

ఇది బాధ్యతారాహిత్యం
- ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు డాక్టర్ వెంకట్రావు

ఇది బాధ్యతారాహిత్యమని ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు డాక్టర్ బి. వెంకట్రావు విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యానికి పట్టక పోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు. భద్రతా ప్రమాణాలు దృష్టిలో పెట్టుకోకుండా చేపట్టిన ఉత్పత్తి ప్రక్రియలో జరిగిన పేలుడులో అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఉందని, ఇప్పటికైనా యాజమాన్యం నిర్వహణ లోపాలు సవరించుకోవాలని ఆయన సూచించారు.

లక్షకోట్ల తాయిలాలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారులకు అనుకూలమైన విధానాలను ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీలను ప్రకటించే ముందు ఎక్కువ పథకాలను ప్రవేశపెట్టనున్నారు. బహుశా మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికల తేదీలను ప్రకటించవచ్చు. తేదీలను ప్రకటించిన తరువాత పథకాలు ప్రవేశపెట్టడానికి విధానాలను వెల్లడించడానికి వీలుకాదు. ఈ అంశాలపై వ్యాఖ్యల కోసం ఆర్థిక శాఖకు ఈ-మెయిల్ చేయగా, ఆ శాఖ స్పందించలేదు. ఈ ఏడాది ఏప్రిల్-మార్చి ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్య లోటు 3.3 శాతం ఉండేలా చూడాలని ఆర్థిక శాఖ రూపొందించిన ప్రణాళికను బీజేపీ అంగీకరించడం లేదని ఆ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన నాటి నుంచి మోడీ అనేక పథకాలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. వ్యక్తిగత పన్నులను కూడా తగ్గించే యోచనలో ఆయన ఉన్నారని ఆ వర్గాలు తెలిపాయి. కాలేజీలు, యూనివర్శిటీలలో కొత్తగా సీట్లను పెంచేందుకు పదులకోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ప్రభుత్వం భయాందోళనలకు గురికావడం వల్లనే వడ్డీలేని రుణాలు, రైతుల ఆదాయం పెంచే పథకాలను ఎన్నికల ముందు ప్రవేశపెట్టి ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ వల్లభ్ వ్యాఖ్యానించారు. అనేక ఇతర పథకాలవలనే ఈ పథకాలు కూడా హడావుడిగా ప్రకటిస్తే వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో 20 ఏళ్ల కాలంలో ఏనాడూ లేనంతగా వ్యవసాయ సంక్షోభం నెలకొని ఉంది. 2016లో పెద్దనోట్ల రద్దుతో ప్రజలకు మోడీ షాక్ ఇచ్చారు. 2017లో జీఎస్టీని ప్రకటించి కల్లోలం సృష్టించారు. వడ్డీలేని రుణాలను ఇచ్చినట్లయితే ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఏడాదికి రూ.12వేల కోట్లు పరిహారంగా ఇవ్వవలసి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు రాయిటర్స్ వార్తా సంస్థకు తెలియజేశాయి. అలాగే ప్రధానమైన పథకాల కోసమే రూ.40 నుంచి రూ.50వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. వాణిజ్య పన్నుల్లోనూ, వ్యక్తిగత పన్నుల్లోనూ రాయితీలు ఇచ్చినట్లయితే, ఏడాదికి రూ.25వేల కోట్లు నష్టం వస్తుంది. సిమెంటుపై పన్నును 28 నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల రూ.13వేల కోట్లు నష్టం రావచ్చునని ఆ వర్గాలు తెలియజేశాయి. రైతులకు హెక్టారుకు రూ.2 నుంచి రూ.4వేల రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేసినట్లయితే ప్రభుత్వానికి పెద్ద భారం అవుతుంది. అయితే దీని వల్ల మోడీకి ప్రయోజనం కలగవచ్చు. ఈ ఒక్క పథకానికి రూ.లక్ష కోట్లు ఖర్చు కావచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ పథకం అమలైతే వడ్డీ లేని రుణాల పంపిణీని చేపట్టకపోవచ్చు. రిజర్వ్ బ్యాంకు ప్రభుత్వానికి మార్చిలోపు రూ.40వేల కోట్లు డివిడెండుగా ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు రాయిటర్స్‌కు తెలిపాయి. భారతదేశంలో ద్రవ్య లోటు జీడీపీలో 3.4శాతానికి పెరగవచ్చునని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ తెలియజేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ద్రవ్యలోటు 6.6 శాతం ఉండవచ్చునని ఆ సంస్థ వెల్లడించింది. రైతు రుణాల రద్దు, సబ్సిడీలు తదితరాలు ప్రభుత్వానికి మరింత భారంగా తయారవుతాయని మూడీస్ ఉపాధ్యక్షుడు విలియమ్ ఫాస్టర్ వ్యాఖ్యానించారు. 2020నాటికి ద్రవ్యలోటు 3.1 శాతానికి, 2021 మార్చి 3 శాతానికి తగ్గించాలన్న లక్ష్యం మరింత జాప్యమవుతుంది. ఇంత భారీగా ఎన్నికల కోసం ఖర్చు చేసినట్లయితే వచ్చే ఏడాది ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్యలోటును తగ్గించాలన్న లక్ష్యం కూడా నెరవేరే అవకాశం ఉండదు.

మంచులో కూరుకున్న మృతదేహాలు వెలికితీత

లేహ్ : లడఖ్‌లోని ఖర్దుంగ్ లాపాస్‌లో అకస్మాత్తుగా మంచు చరియలు విరిగిపడిన ఘటనలో ఐదు మృత దేహాలను శుక్రవారం వెలికి తీశారు. మరో ఐదుగురి కోసం సహాయచర్యలు కొనసాగుతున్నాయి. వాహనాలు సైతం మంచులో కూరుకు పోయాయి. కొద్ది రోజులుగా జమ్మూకాశ్మీర్‌లో మంచు విపరీతంగా కురుస్తున్న విషయం తెలిసిందే. కాశ్మీర్‌లోని అనంతనాగ్, బుద్గాం, బారాముల్లా, గండెర్‌బాల్, కార్గిల్, కుల్గాం, కుప్వారా, లేహ్‌ల్లో మంచుచరియలు విరిగిపడతాయని వాతావరణ శాఖ గురువారం హెచ్చరించింది. అత్యంత ఎత్తులో ఉండే మోటారు వాహనాల రోడ్డు ఖర్దుంగ్‌లా లేహ్- షెయూక్- నుబ్రా లోయలను కలుపుతుంది.

మార్చిలో నగారా

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భద్రతా ఏర్పాట్లను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తిస్తోంది. జమ్మూకాశ్మీరు అసెంబ్లీ పదవీకాలం 2021 మార్చి 16 దాకా ఉంది. అయితే, గతేడాది నవంబరులో ఆ అసెంబ్లీని రద్దు చేశారు. దీంతో తాజాగా ఎన్నికలు నిర్వహించాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే.. 16వ లోక్‌సభ పదవీకాలం జూన్ 3తో ముగియనుంది. ఈ లోపే ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి కావాల్సి ఉంది. దీంతో వేగం పెంచిన ఎన్నికల కమిషన్ మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఆయా రాష్ట్రాలకు సంబంధించిన సీఈవోలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించిన ఈసీ అంతిమంగా మార్చి మొదటివారంలో షెడ్యూల్ విడుదల చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సీఈవోలకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇటీవల జరిపిన చర్చల్లో సమస్యలన్నీ ఓ కొలిక్కి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం ఎంతమంది భద్రతా సిబ్బంది ఉన్నారు? వారిని వినియోగించుకుంటూ ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించవచ్చు? అధికారుల మార్పులు, చేర్పులతో పాటు పలు అంశాలపై సమావేశంలో ఎన్నికల కమిషన్ చర్చించినట్లుగా తెలుస్తోంది. వాస్తవంగా భద్రతా దళాల లభ్యత ఆధారంగా ఎన్నికలు ఎన్ని దశల్లో నిర్వహించాలో నిర్ణయిస్తారు.

రాష్ట్రాల వారీగా చూస్తే..

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కాలం జూన్ 18న ముగుస్తుంది. ఒడిశా అసెంబ్లీ కాలం జూన్ 11న, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ కాలం జూన్ 1న, సిక్కిం అసెంబ్లీ కాలం మే 27 తో ముగియనుంది. ఏపీ విషయానికొస్తే..2019లోకి అడుగుపెట్టడంతో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత రాజుకుంది. ఏపీలోని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. 2014లో ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 5న ప్రకటించారు. ఏప్రిల్, మే నెలల్లో 9 దశల్లో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే.

అప్పటి దాకా ఓట్ల నమోదు, తొలగింపు : ద్వివేది

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసే వరకూ కొత్త ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. అమరావతి సచివాలయంలోని అయిదో బ్లాక్‌లో అఖిలపక్ష నాయకులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ నెల 11వ తేదీన ఎన్నికల సంఘం రూపొందించిన తుది ఓటర్ల జాబితాను హార్డ్ డిస్క్ రూపంలో ఆయా పార్టీల నేతలకు గోపాలకృష్ణ ద్వివేది అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాతో పాటు ఇతర ఏ సమస్యలైనా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సంఘం నిర్ణయాల గురించి ఎప్పటికప్పుడు అన్ని పార్టీలకూ సమాచారమందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని ద్వివేది స్పష్టం చేశారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని ఆయా పార్టీల నాయకులు కోరారు. ఈ విషయమై ఆయన స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు వర్ల రామయ్య, వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నేత టి.సూరిబాబు, బీజేపీ నాయకుడు జూపూడి రంగరాజు, సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గగన్‌యాన్‌లో

పైలెట్లే వ్యోమగాములు : ఇస్రో



న్యూఢిల్లీ : గగన్‌యాన్‌లో అంతరిక్ష వ్యోమగాములుగా పైలెట్లనే ఎంపిక చేస్తున్నట్లు భారతీయ అంతరిక్షా పరిశోధనా సంస్థ (ఇస్రో) శనివారం వెల్లడించింది. విమాన చోదక అనుభవం ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తామని ఆ సంస్థ తెలిపింది. ఈ ప్రయోగంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్, డీఆర్‌డీవో ప్రధాన భూమికలు పోషిస్తాయని, కె. శివన్ వివరించారు. 2020 డిసెంబరు నాటికి మానవరహిత గగన్‌యాన్ చేపడతామని, తర్వాతి ఏడాదికి రెండో మిషన్, 2021 డిసెంబరు నాటికి మూడవ గగన్‌యాన్ చేపట్టి, 2022 నాటికి ముగ్గురు రోదసీ యాత్రికులను పంపుతామని ప్రధాని మోడీ వెల్లడించిన విషయం తెలిసిందే..

రైళ్ల పరుగులు..!

(మొదటిపేజీ తరువాయి)

బెంగాల్‌లో 930 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వెయ్యి కిలోమీటర్ల పొడవైన మార్గంలో రైళ్లు నడిపేందుకు వినియోగించాలని చూస్తోంది. తెలుగు రాష్ట్రాల పరంగా ఏపీలో 680 మెగావాట్లతో 755 కి.మీ., తెలంగాణలో 300 మెగావాట్లతో 333 కి.మీ. మార్గాల్లో విద్యుత్ రైలింజన్లు నడపాలని నిర్ణయించింది. పది రాష్ట్రాల్లో మొత్తం 4,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి...4,444 కిలోమీటర్ల మార్గానికి వినియోగించుకోవాలని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చింది. ఎంపిక చేసిన రైలు మార్గాలకు ఇరువైపులా ఉన్న రైల్వే స్థలాల్లో సౌర ఫలకాలు అమర్చి వాటన్నింటినీ అనుసంధానం చేసి ట్రాన్స్‌ఫార్మర్ల సహాయంతో 25వేల మెగావాట్ల విద్యుత్‌ను మెయిన్‌లైన్‌కు సరఫరా చేయనుంది. రైల్వే స్థలాలను సౌర విద్యుదుత్పాదనకు ఉపయోగించడం వల్ల ఆక్రమణల బెడద ఉండదని భావిస్తోంది. ఇప్పటికే రైల్వేస్టేషన్లతోపాటు డీఆర్‌ఎం మొదలుకొని వివిధ స్థాయిల్లోని కార్యాలయాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. 2017లో ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మకంగా రైలు బోగీల పైభాగంలో సౌర ఫలకాలు అమర్చి బోగీలలో ఫ్యాన్లు, లైట్లకు వినియోగిస్తున్న విషయం తెలిసిందే.

రూ.16వేల కోట్లతో 1,200 మెగావాట్ల ఉత్పత్తి

'మేకిన్ ఇండియా' నినాదంతో రూ.16వేల కోట్ల పెట్టుబడితో 1,200 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఈసీఐ) ద్వారా త్వరలో బిడ్లను ఆహ్వానించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దేశంలో 2030 నాటికి కర్బన ఉద్గారాల రహితంగా పూర్తి పర్యావరణహితమైన రైలు ప్రయాణం ఉండాలనే కృతనిశ్చయంతో ముందుకు వెళుతున్నట్లు రైల్వే సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సౌర విద్యుదుత్పాదన ప్రారంభమైన తర్వాత మొదటి సంవత్సరంలో 20 శాతం, రెండో సంవత్సరంలో 40 శాతం విద్యుత్ బిల్లుల్లో ఆదా కాగలదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. దేశంలో ఏటా 18.5 బిలియన్ యూనిట్ల వినియోగం ద్వారా రూ.10,036 కోట్ల మొత్తాన్ని రైల్వే ఖర్చు చేస్తోందన్నారు. సౌర విద్యుత్ వల్ల చాలా వరకూ ఖర్చు తగ్గుతుందని, తద్వారా ఈ మొత్తాన్ని ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించే అవకాశం కలుగుతుందన్నారు. ఒకవేళ రైల్వే వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను ఆయా రాష్ట్రాల అవసరాల కోసం పంపిణీ చేయడంపైనా అధ్యయనం సాగుతోందన్నారు.

రూ.5 లక్షలకు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

గుండెల్లో ఎన్టీఆర్ ఉంటారన్నారు. 12 కోట్లు ఖర్చు పెట్టి ఎన్టీఆర్ విగ్రహాన్ని, రెండు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సత్తెనపల్లి వాసులు ఉదయాన్నే చెరువు చుట్టూ రెండు రౌండ్లు వేసి, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఒకసారి చూసుకొనిపోతే తిరుగు లేని విజయాలు లభిస్తాయని చంద్రబాబు సూచించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వావిలాల గోపాలకృష్ణయ్య పేరుతో ఘాట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఉత్తమ విద్యార్థిగా, ఆదర్శ ఉద్యోగిగా, గొప్ప కళాకారుడిగా, నిస్వార్థ ప్రజానాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆయన విధానాలు ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోతాయని చెప్పారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాలని రాజకీయాల్లోకి వచ్చారన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, నియంతృత్వ పోకడలపై ఎన్టీఆర్ పోరాటం చేశారని, రాష్ట్రాలపై పెత్తనం కుదరదని ఖరాఖండీగా చెప్పారని తెలిపారు. ఆత్మ గౌరవంతోపాటు, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం సహకరించకపోయినా రూ. 2వేల పింఛన్ ఇస్తున్నామన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజనాన్ని ఐదు రూపాయలకే అందిస్తున్నామన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ గురించి మాట్లాడుతూ, ఏపీలో కులచిచ్చు పెట్టడానికి నరేంద్రమోడీ, తెలంగాణ మోడీ, ఏపీ మోడీలు కలసి కుట్రలు చేస్తున్నారని కేసీఆర్, జగన్‌కు చురకలంటించారు. కోడికత్తి కేసులో కేంద్రం జోక్యాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రహక్కులను హరించే అధికారం కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. మన పిల్లల భవిష్యత్ కోసం ఇంటికో మనిషి తెలుగుదేశం పార్టీకి అండగా ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ వారసుడిగా తెలుగు వారి స్థైర్యాన్ని ప్రపంచానికి చాటిన నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. రూ.1200 కోట్లతో 24 వేల వ్యక్తిగత మరుగుదొడ్లు, 400 శ్మశాన వాటికలు నిర్మించి ప్రపంచ మన్ననలను పొందామన్నారు. రాష్ట్రంపై రాబందులు కన్నేశాయని, ఐదుకోట్ల ప్రజానీకం చంద్రబాబు వెంట ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ రాయపాటి సాంబశివరావు, కలెక్టర్ కోన శశిధర్, పార్టీ రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పుష్పరాజ్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కోటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సీఆర్డీఏ కమిషనర్ శ్రీధర్, ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, తెనాలి శ్రావణ్ కుమార్, కోడెల శివరామ్, రాయపాటి రంగబాబు పాల్గొన్నారు.



సచివాలయం ముందు రైతు ఆందోళన

ఆన్‌లైన్లో రికార్డులు మాయం చేశారని ఆవేదన

విశాలాంధ్ర - అమరావతి : అధికారుల అక్రమాలతో ఆన్ లైన్లో తన భూమి లేకుండా చేసారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ రైతు వెలగపూడి సచివాలయం గేటు ముందు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. బాధితుడైన రైతు కొమ్మినేని శివ కోటేశ్వరరావుకు తెలిపిన వివరాలు ప్రకారం తుళ్లూరు మండలం హరిశ్చంద్రపురంకు చెందిన తనకు కృష్ణా జిల్లా వీరుల్లపాడు మండలం పరిధిలో తన భార్య పద్మజ పేరిట ఉన్న 0.56 సెంట్ల భూమి ఉందని చెప్పారు. అయితే గతంలో తహసీల్దార్ గా పనిచేసిన వి.రాజకుమారి తన భూమికి సంబంధించిన రికార్డులు తారు మారు చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు ఉన్నప్పటికి ఆన్ లైన్ లో రికార్డులు మాయం చేసి తమ యాభై ఆరు సెంట్ల భూమిని వేరే వ్యక్తులకు తహసీల్దార్ కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమికి సంబంధించిన అన్నీ రికార్డులు తమవద్ద ఉన్నాయని, ఇప్పటికీ తామే సాగు చేస్తున్నామని, రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం భూమి తమదే అని అంగీకరించారని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ రాజకుమారిని సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు. తనకు వెంటనే పాసుపుస్తకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తన ఇబ్బందిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లాలని ఈ విధంగా ఆందోళన చేశానని పేర్కొన్నారు. అయితే సీఎం చంద్రబాబు సచివాలయంలో లేకపోవడంతో భద్రతా సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి రైతును అక్కడ నుంచి పంపించారు.

ఆయేషా మీరా హత్యకేసులో

సీబీఐ దూకుడు

సత్యంబాబును విచారించిన అధికారులు



విశాలాంధ్ర - నందిగామ: ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన 19ఏళ్ల విద్యార్థిని అయేషా మీరా హత్యకేసు విచారణలో కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) దూకుడు పెంచింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి ఆపై కోర్టు నుంచి ఊరట పొందిన సత్యంబాబును సీబీఐ అధికారులు శుక్రవారం విచారించారు. సత్యం బాబుతో పాటు అతని కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను సేకరించారు. విజయవాడ నందిగామ సమీపంలోని అనగమసాగరం గ్రామంలోని సత్యం బాబు ఇంట్లోనే అధికారులు అతనిని విచారించారు. ఉదయం 8 గంటల నుంచి సత్యం బాబును అనేక కోణాల్లో రకరకాల ప్రశ్నలు అడిగారు. అధికారులు తమ భోజనాలు కూడా అక్కడికే తెప్పించుకొని మరీ సత్యంబాబుపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించారు. గతంలో అతనిపై ఉన్న 11 కేసులకు సంబంధించిన విచారణకు మరో నాలుగు రోజుల సమయం పట్టవచ్చునని తెలుస్తోంది. అయేషా మీరా హత్య జరిగిన హాస్టల్ ఎక్కడ ఉందో తెలుసా అని అధికారులు ప్రశ్నించగా తనకు తెలియదని సత్యంబాబు సమాధానం ఇచ్చాడు. హత్యకు 15 రోజుల ముందు ఆ భవనంలో పెయింటింగ్ పని చేసినట్టు తెలిపాడు. నేరాన్ని ఒప్పుకోకపోతే తన తల్లిని, చెల్లిని చంపుతామని పోలీసులు బెదిరించారని, అందుకే అయేషా మీరాను హత్య చేసినట్టు ఒప్పుకున్నట్టు సత్యంబాబు తెలిపినట్లు సమాచారం. సత్యంబాబు అకౌంట్‌లో డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని అధికారులు ప్రశ్నించగా తాను జైలులో చేసిన పనులకు ఇచ్చిన డబ్బులని.. ఆ డబ్బుతో గ్రామంలో ఉన్న అప్పులు తీర్చానని సత్యంబాబు చెప్పాడు. సత్యంబాబు కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలను కూడా అధికారులు పరిశీలించారు. తాను ఏ తప్పు చేయలేదని, జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చినప్పుడు గ్రామస్తులు భారీ ర్యాలీతో ఇంటికి తీసుకొచ్చారని సత్యంబాబు తెలిపాడు. నిర్భయ కేసులో న్యాయం జరిగింది కాని, అయేషా మీరా కేసులో ఎందుకు జరగలేదని అధికారులను ప్రశ్నించాడు. తనను అరెస్టు చేసినప్పుడు ఎందుకో తెలియలేదని, రిమాండుకు పంపాక తెల్లవారుజామున అయేషా మీరా కేసులో అరెస్టు చేసినట్టు పత్రికలో వచ్చిన వార్తను చూశాక అసలు సంగతి తెలిసిందని అధికారుల ముందు సత్యంబాబు వాపోయాడు. విచారణ సమయంలో సత్యంబాబును మాత్రమే ఉంచి మిగతా వారిని ఎవ్వరినీ అధికారులు లోనికి రానివ్వలేదు. అతని విచారణ నిరాటంగానే సాగింది. అయేషా మీరా హత్య జరిగిన ఇబ్రహీంపట్నంలోని శ్రీ దుర్గా హాస్టల్ నిర్వాహకులను సీబీఐ అధికారులు విచారించినట్టు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే విజయవాడ కోర్టు సిబ్బంది ముగ్గురిపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసుకు సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలు ధ్వంసమైన అంశంపై పి.కుమారి, పి. వెంకటకుమార్, వై సుబ్బారెడ్డిలపై కేసులు నమోదయ్యాయి. అయేషా మీరా నిందితులను పట్టుకోవటంలో ఏపీ పోలీసులు విఫలమైన కారణంగా హైకోర్టు ఈ కేసును సీబీఐకి బదిలీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

కోనేరు సతీష్ నుంచి వివరాల సేకరణ


అయేషా మీరా కేసుకు సంబంధించి మాజీ మంత్రి కోనేరు రంగారావు మనమడు కోనేరు సతీష్‌ను కూడా సీబీఐ అధికారులు శుక్రవారం విచారించారు. గూడవల్లిలోని సతీష్ ఇంటికి వెళ్లిన అధికారులు అతని వద్ద నుంచి పలు వివరాలను సేకరించినట్టు తెలిసింది.

ఓపెన్ వర్సిటీ అభ్యర్థులూ అర్హులే.. : ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగాల భర్తీకిగాను ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న అన్ని పరీక్షలకు ఓపెన్‌వర్సిటీ, దూరవిద్యా విధానంలో డిగ్రీ చేసిన అభ్యర్థులు సైతం 'ఓటీపీఆర్'లో నమోదు చేసుకోవాలని కమిషన్ కార్యాలయం వెల్లడించింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో శుక్రవారం ఈ విషయాన్ని తెలిపింది. అభ్యర్థులకు చెందిన అన్ని అర్హతలను ఏకకాలంలో ఒకే ఆన్‌లైన్ ఫార్మెట్‌లో నమోదు చేసుకునేందుకు గాను 2016 నుంచి ఒన్‌టైమ్ ఓటీపీఆర్ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఓపెన్ స్కూల్, ఓపెన్‌వర్సిటీ, దూరవిద్య(డిస్టెన్స్ ఎడ్యుకేషన్)లో డిగ్రీలు చదివిన వారంతా ఏపీపీఎస్సీ ప్రవేశపెట్టిన ఓటీపీఆర్‌లో నమోదు చేసుకోవచ్చుని కమిషన్ స్పష్టం చేసింది. ఈ ఓటీపీఆర్ నమోదులో అభ్యర్థులు టెన్త్ తర్వాత నేరుగా ఓపెన్ వర్సిటీలో డిగ్రీ చేసినప్పుడు మధ్యలో ఇంటర్‌మీడియట్ కాలమ్ వస్తోంది. వారంతా టెన్త్, డిగ్రీ వివరాలనే(ఇంటర్మీడియట్ లేకుండా) ఓటీపీఆర్‌లో పొందుపరుస్తున్నారు. ఓపెన్‌వర్సిటీ ద్వారా చదివిన అభ్యర్థులు సైతం ఓటీపీఆర్‌లో నమోదు చేసుకోవచ్చని కమిషన్ స్పష్టం చేసింది.

మీ రుణం..పేదలకు వరం

గృహ నిర్మాణాలకు సహకరించాలని బ్యాంకర్లను కోరిన సీఎం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదలకు పెద్దఎత్తున గృహ నిర్మాణం చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని, దీనిని విజయవంతంగా పూర్తి చేసేందుకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి సహకరించాలని సీఎం చంద్రబాబు బ్యాంకర్లను కోరారు. పట్టణ పేదల గృహ నిర్మాణంపై శుక్రవారం సచివాలయంలో టిడ్కో మెప్మా పట్టణాభివృద్ధి శాఖ అధికారులు, బ్యాంకర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రుణాల మంజూరును వేగవంతం చేసేందుకు రాష్ట్రంలోని 44 బ్యాంకులు ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించుకోవాలని సీఎం సూచించారు. గృహ రుణాల మంజూరుపై బ్యాంకులు ప్రతి రోజూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇప్పటివరకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాని బ్యాంకులు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఫిబ్రవరి నెలాఖరులోగా 1,75,000 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనేది తమ లక్ష్యమని, దీనికి అనుగుణంగా సహకరించాలని చెప్పారు. రుణాల మంజూరులో కఠినంగా వ్యవహరించకుండా, పేదల కోసం నిబంధనలు సరళీకరించుకోవాలని సూచించారు. సిబిల్ స్కోర్ విషయంలో పరిపాలనాపరమైన అనుమతులు సంబంధిత బ్రాంచ్ స్థాయిలోనే ఉండాలన్నారు. రాష్ట్రంలో 4,82,597 మంది పట్టణ గృహ లబ్దిదారులకు రుణాలు ఇవ్వాలని ఎస్ఎల్‌బీసీ లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఇప్పటివరకు కేవలం 5,988 మందికి రూ.199.62 కోట్లు బ్యాంకులు రుణంగా అందించాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం పట్టణ గృహ నిర్మాణ లబ్దిదారులకు ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్‌కు చెందిన 20 బ్యాంకులు మాత్రమే రుణాలు ఇస్తున్నాయని తెలిపారు.పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్ (ఏహెచ్‌పీ) పథకం కింద 5,29,786 ఇళ్లు మంజూరు చేశామని, 4,60,492 ఇళ్లకు టెండర్లు ఖరారయ్యాయని, వీటిలో 3,60,365 ఇళ్ల నిర్మాణం ప్రారంభించినట్టు తెలిపారు. వీటిలో 1,42,061 శ్లాబుల నిర్మాణం పూర్తి కాగా, 75,284 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని చెప్పారు.అలాగే ఎన్టీఆర్ పట్టణ గృహనిర్మాణం (బీఎల్‌సీ) కింద 4,28,444 మంజూరు కాగా, 1,11,613 ఇళ్ల నిర్మాణం ప్రారంభమై, వాటిలో 73,752 ఇళ్ల నిర్మాణం పూర్తి అయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం సిద్ధం


- పీవీని అవమానించిన కాంగ్రెస్
- విభజన హామీలు 80 శాతం అమలు చేశాం
- కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



విశాలాంధ్ర బ్యూరో - కడప : కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని, ఇందుకు టాస్క్ ఫోర్స్ కూడ ఏర్పాటు చేసిందని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీకి అవసరమైన సమాచారం ఇవ్వడంలో రాష్ట్ర పభుత్వం జాప్యం చేసిందన్నారు. తెలుగుబిడ్డ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మృతి చెందిన తర్వాత ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీ పార్టీ కార్యాలయంలోనికి అనుమతి ఇవ్వకుండా కాంగ్రెస్ ఘోరంగా అవమానించిందని, ఈ విషయాన్ని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీతో జతకట్టిన పార్టీలు బ్రతికి బట్టకట్టిన దాఖలాలు లేవని, దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ గమనించాలన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన 80 శాతం హామీలను ప్రధాని మోడీ అమలు చేశారని, మిగిలిన హామీలను 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. నగరంలోని కందుల ఎస్టేట్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ రాయలసీమ పార్లమెంట్ నియోజకవర్గాల శక్తి కేంద్రాల ప్రముఖుల సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీవీ నరసింహారావు 1991లో ఆర్థిక సంస్కరణలు తెచ్చాక నూతన ఆర్థిక విప్లవం ప్రారంభమైందని అదే దిశలో బీజేపీ ముందుకు పోతోందన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని నివాళులర్పిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఆత్మగౌరవ నినాదంతో ఆయన పోరాడారన్నారు. భారతీయ జనతపార్టీ ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీ అన్నారు. 12 కోట్ల మంది సభ్యులున్నారని, 16 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్, కార్యదర్శి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అద్యక్షులు కన్నా లక్ష్మీ నారాయణ, పార్టీ నాయకులు సోము వీర్రాజు, పురందేశ్వరి, కందుల రాజమోహన్ రెడ్డి, కపిలేశ్వరయ్య, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

తక్కువ ఆదాయం ఉన్న ఆలయాల బాధ్యత అర్చకులకు

త్వరలో ఉత్తర్వుల జారీ: కేఈ



విశాలాంధ్ర అమరావతి :రాష్ట్రంలో తక్కువ ఆదాయం కలిగిన దేవాలయాల యాజమాన్యపు బాధ్యతలను ఆయా ఆలయాల అర్చకులకు అప్పగించేందుకు ప్రభుత్వంగా సానుకూలంగా వుందని, దీనిపై త్వరలోనే ఉత్తర్వులు వెలుపడేలా సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.ఈ.కృష్ణమూర్తి హామీ ఇచ్చారు. వెలగపూడిలోని సచివాలయంలో దేవదాయ శాఖ, అనుబంధ సంస్థ లతో ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ క్రమంలో పేద బ్రాహ్మణులు, అర్చ కులను ఆదుకొనేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పేద బ్రాహ్మణులతో పాటు విద్యార్థులను ఆదుకొనేందుకు బ్రాహ్మణ కార్పోరేషన్ ద్వారా వివిధ పథకాలు రూపొందించామని బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య వెల్ల డించారు. అనుబంధ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలు సుకున్నారు. వృద్ధ బ్రాహ్మణులకు, వితంతువులకు బ్రాహ్మణ కార్పోరేషన్ ద్వారా ప్రస్తుతం వెయ్యి రూపాయల ఫించన్ అందజేస్తున్నామని, వీరికి కూడా రూ. 2 వేలు చేయాల్సిన అవసరం ప్రభుత్వం యోచి స్తుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామన్నారు. వంశపారం పర్య అర్చకత్వంపై ప్రభుత్వం సానుకూలంగా వుం దని, విధివిధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం కమిటీ నియమించిందని, సాధ్యమైనంత త్వరలో జీవోనెం.76ను విడుదల చేస్తామని ఉప ముఖ్య మంత్రి చెప్పారు. తక్కువ ఆదాయం గల దేవాలయాల బాధ్యతను అర్చకులకే ఇచ్చే ఆలోచన ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఎంత మేర ఆదా యం వున్న దేవాలయాలు దీని పరిధిలోకి తీసుకురావాలనే విషయంపై చర్చిస్తున్నామని తెలిపారు. దీని వల్ల అర్చకుల సమస్యలు వంద శాతం తీరుతాయని భావిస్తున్నామన్నారు. దేవాదాయశాఖ- అనుబంధ సంస్థల ద్వారా చేసే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసు కెళ్లేందుకు శంఖారావం పేరుతో మ్యాగజైన్ తీసుకొ స్తున్నామని హిందూ ధార్మిక పరిషత్ ట్రస్ట్ ఛైర్మన్ ప్రసాద్ ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హిందూ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హిందూ మతాన్ని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు త్వరలో విజయవాడలో 46 మంది పీఠాధిపతులతో సమావేశం నిర్వహిస్తున్నామ న్నారు. వేదిక్ విశ్వవిద్యాలయం అనుబంధంగా రాజ ధాని ప్రాంతంలో మరియు ఇతర ప్రాంతాలలో వేద విశ్వవిద్యాలయాల శాఖలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వేదిక్ యునివర్సిటీ ప్రిన్సిపల్ సుదర్శన శర్మ కోరారు.

ఎస్జీటీ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పరీక్షలు ప్రారంభమయ్యాయి. డీఎస్సీ-2018లో భాగంగా రెండో విడత నిర్వహిస్తున్న ఎస్జీటీ పరీక్షల కోసం 123 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 3,45,114మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ నెల 31వరకూ 8 రోజులపాటు రోజుకు రెండు సెషన్ల చొప్పున కొనసాగుతాయి. విజయవాడలోని కండ్రిక, పటమట పంట కాల్వరోడ్డులోని ఆన్‌లైన్ కేంద్రాల వద్ద ఎస్జీటీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులతో హడావుడీ నెలకొంది. అభ్యర్థులంతా పరీక్షా కేంద్రానికి హాల్‌టిక్కెట్‌తోపాటు ఏదైనా ప్రభుత్వ ఐడీ కార్డును తీసుకెళ్లాలనే నిబంధన్ని విధించారు. పాఠశాలవిద్య కమిషన్ కె.సంధ్యారాణి పర్యవేక్షణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.

దరఖాస్తుదారులంతా 'హజ్‌యాత్ర'కు అర్హులే

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హజ్‌యాత్ర-2019కు దరఖాస్తు చేసిన వారందర్నీ ఎంపిక చేసినట్లు కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది ఏపీ నుంచి మొత్తంగా 2,138మంది హజ్‌యాత్రకు దరఖాస్తు చేశారని, వారిలో 2,135 మంది పెద్దలు, రెండేళ్లలోపు ముగ్గురు చిన్నారులున్నారని తెలిపారు. ఇందులో 40మంది 70 ఏళ్లపైబడిన వారున్నారని వివరించారు. అనంతపురం జిల్లా నుంచి 298, చిత్తూరు-206, ఈస్ట్‌గోదావరి-39, గుంటూరు-326, కడప-241, కృష్ణా-230, కర్నూలు-473, నెల్లూరు-121, ప్రకాశం-43, శ్రీకాకుళం-7, విశాఖపట్నం-90, విజయనగరం-24, వెస్ట్‌గోదావరి-37మంది యాత్రికులను డ్రాతో నిమిత్తం లేకుండా దరఖాస్తు చేసిన వారందర్నీ ఎంపిక చేశామని తెలిపారు. ఈ యాత్రకు ఎంపికైన వారంతా ఫిబ్రవరి 5వ తేదీలోగా రూ.81వేలు చెల్లించాలని పేర్కొన్నారు. చలానా దరఖాస్తును 'ఏపీస్టేట్ హజ్ కమిటీ.కామ్' నుంచి డౌన్‌లోడ్ చేసుకుని బ్యాంక్‌లో జమ చేయాలని హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం విజయవాడలోని ఏపీ స్టేట్ హౌజ్ కమిటీని సంప్రదించాలని తెలిపారు.

జీవితాంతం ఒకటే కుల ధ్రువీకరణ పత్రం

కార్యదర్శుల సమావేశంలో సీఎస్ పునేఠా నిర్ణయం




విశాలాంధ్ర అమరావతి : ఒక్కసారి ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రం జీవితాంతం ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. సచివాలయంలో 5 వ బ్లాక్ లోని కలెక్టర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉదయం జరిగిన కార్యదర్శుల సమావేశంలో సీఎస్ ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎస్ పునేఠా మాట్లాడుతూ కుల, పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు కోసం ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులను, నిరుద్యోగులను, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను రెవెన్యూ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకసారి ఇచ్చిన సర్టిఫికెట్ జీవితాంతం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఆదాయంలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందని, ఆ సర్టిఫికెట్ కుడా 4 ఏళ్ల వరకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సర్టిఫికెట్ల విషయంలో అన్ని శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని, విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఇ-గవర్నెన్స్, ఐటీ సలహాదారు జె.సత్యనారాయణతో చర్చించి సీనియర్ అధికారుల సలహాలు తీసుకొని 15 రోజుల్లోగా జీఓని రూపొందించమని ఆర్టీజీ సీఈఓ అహ్మద్ బాబుకు సూచించారు. అవసరం లేని పోలీస్ వెరిఫికేషన్, ఇతర సర్టిఫికెట్లను ఆయా శాఖలతో సంప్రదించి తీసివేయాలన్నారు. సర్టిఫికెట్ల విషయంలో ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండాలని సీఎస్ చెప్పారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యదర్శి రామాంజనేయులు సీఎస్ కు ధన్యవాదాలు తెలిపారు. 60 ఏళ్లుగా ఈ సర్టిఫికెట్ల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, ఇది చాలా మంచి నిర్ణయంగా కొనియాడారు. ఈ నెల 21వ తేదీకి మంత్రి మండలి ఆమోదించవలసిన అన్ని ఫైల్స్ సిద్ధం చేయాలని సీఎస్ కార్యదర్శులకు, హెచ్ఓడీలకు సీఎస్ సూచించారు. కేంద్రం నుంచి రావలసిన నిధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఏపీ భవన్ రెసిడెన్స్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ కేంద్రం నుంచి రావలసిన నిధులు, యుసీలు, నరేగా నిధులు, భారత్ నెట్ వర్క్, గ్రామీణ సడక్ యోజన, సాగరమాల పనులు, స్వచ్ఛభారత్ అర్బన్ నిధులు, కేంద్ర ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అవకాశం ఉన్నమేరకు రాష్ట్రానికి రావలసిన వాటా నిధులు రాబట్టడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఇ-ప్రగతి, ఇ- ఆఫీస్ ద్వారా సమయం చాలా ఆదా అవుతున్నట్లు అధికారులు తెలియ చేశారు. ప్రజలకు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పిందన్నారు. ఇ-ఆఫీస్ నిర్వహణలో కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్, సంబంధిత శాఖల కార్యదర్శుల కృషిని అందరూ ప్రశంసించారు.

పడవ ప్రమాదాల నివారణా చర్యలు తీసుకోండి: సీఎస్

విశాలాంధ్ర అమరావతి :

పడవ ప్రమాదాల నివారణపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. పడవ ప్రమాదాల నివారించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సీఎస్, పలు శాఖల ఉన్నత అధికారులతో సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ పునేఠా మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదులు దాటేందుకు ప్రమాద రహిత బోట్లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. గడచిన మూడు సంవత్సరాల్లో జరిగిన పడవ ప్రమాదాల్లో దాదాపు 67 మందికి పైగా చనిపోయారని అధికారులు సీఎస్ కు వివరించారు. ఇకపై పడవ ప్రమాదాలు జరగకుండా రక్షణ ఉండే అధునాతన పడవలు కొనుగోలు చేసుకోవాలని సీఎస్ అధికారులకు సూచించారు. పడవలకు లైసెన్సులు ఇవ్వడం, శిక్షణ కలిగిన చోధకులను నియమించడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రయాణికులను చేరవేసే పడవలకు అనుమతులు తప్పనిసరి చేసి,గడువులోగా లైసెన్సులు ఇవ్వాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే జలవనరుల శాఖ అధికారులకు కొన్ని బాధ్యతలు అప్పగించాలని సూచించారు. జలవనరులు, పోలీస్, ఫైర్, పంచాయతీ రాజ్, పర్యాటక శాఖ ఉన్నత అధికారులు రెండు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించుకుని పడవ ప్రమాదాల నివారణపై చర్చించుకోవాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు 23వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు ఆయనకు నివాళులర్పించారు. నటుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన భార్య నారా భువనేశ్వరి, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, మంత్రి లోకేష్, భార్య నారా బ్రాహ్మణి, సుహాసిని, సినీ దర్శకుడు క్రిష్ తదితరులు ఎన్టీఆర్ సమాధివద్ద పుష్పాంజలి ఘటించారు. బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ చిరస్మరణీయులని, తెలుగువారి గుండెల్లో నిలిచి ఉంటారని అన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నిలిపేందుకు, గెలిపించేందకు ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారనీ కొనియాడారు. ఆయన అడుగు జాడల్లోనే నడుస్తామని తెలిపారు. ఎన్ని సంక్షేమ పథకాలు వచ్చినా అవన్నీ ఎన్టీఆర్ స్ఫూర్తితో వచ్చినవేనన్నారు. లంచగొండితనం ఇష్టం లేక ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేశారని, సినిమాల్లో ఎదురులేకుండా నిలిచారని, రాజకీయాల్లోనూ వెలుగొందారని గుర్తుచేసుకున్నారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన ఆయనకు ఆయనే సాటి అని బాలకృష్ణ అన్నారు.

నా గుండెల్లో మంట చల్లారలేదు.. : లక్ష్మీపార్వతి

ఎన్టీఆర్ ఎప్పటికీ తెలుగువారి గుండెల్లో ఆరాధ్యుడని ఆయన సతీమణి, వైసీపీ నాయకులు లక్ష్మీ పార్వతి తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మ శాంతించలేదని..ఘోషిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు. 'నా గుండెల్లో మంట చల్లారలేదు. కళ్లలో నీరు ఆగలేదు. ఎన్టీఆర్ మహిళలను ఎంతగానో గౌరవించేవారు. కానీ నేటి టీడీపీ నేతలు మహిళలతో అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు' అని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ ఘాట్‌ను పట్టించుకోవడం లేదని, పెచ్చులూడుతున్నాయని, ఇది ఎన్టీఆర్‌కు అవమానమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విషయాన్ని గమనించి ఘాట్‌కు మరమ్మతులు చేయించాలని ఆమె కోరారు.

ఫిబ్రవరి 19న చలో ఢిల్లీ

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విద్యారంగ పరిరక్షణ కోసం ఫిబ్రవరి 19న చలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి వెల్లడించారు. విజయవాడ ఐఎంఏ హాలులో శుక్రవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 72వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. దీనికి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు అధ్యక్షత వహించారు. కత్తి నరసింహారెడ్డి ప్రసంగిస్తూ..విద్య, వైద్య రంగాలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే నిజమైన సంక్షేమం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్య, వైద్యం సామాన్యుడికి అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణను నిరసిస్తూ ఫిబ్రవరి 19న ఢిల్లీలో 'సేవ్ ఎడ్యుకేషన్-సేవ్ కంట్రీ' నినాదంతో జరగబోయే మహాప్రదర్శనలో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై శాసన మండలిలో రాజీలేని పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ కీలక తీర్మానం..

కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం(సీపీఎస్) రద్దు కోసం పతాకస్థాయిలో ఉద్యమించాలని, ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోకుంటే సమ్మెకైనా సిద్ధపడాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ తీర్మానించింది. సమావేశంలో విద్యారంగ సమస్యలపై క్షుణ్ణంగా చర్చించారు. సీపీఎస్ రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానించాలని, స్పెషల్ టీచర్లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని సమావేశం డిమాండు చేసింది. జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ..35శాతం మధ్యంతర భృతిని మంజూరు చేసి...2018 జూలై ఒకటి నుంచి అమలు చేయాలని కోరారు. హెల్త్‌కార్డుల ద్వారా ఉద్యోగులకు వైద్యచికిత్సలు అందట్లేదని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ సంస్థల యాజమాన్యాల ఆధారంగా ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు అప్పగించొద్దని, పాఠశాలలకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందజేయాలని పేర్కొన్నారు. మున్సిపల్, ఎయిడెడ్, గురుకుల, ఆదర్శపాఠశాలల టీచర్ల సమస్యలపై..గతంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండు చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు తీర్మానాలను ప్రవేశపెట్టగా..వాటిని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అకాల మరణానికి గురైన పదిమంది ఎస్టీయూ నాయకులు, కార్యకర్తలకు చెందిన కుటుంబాలకు...ఎస్టీయూ ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని కత్తి నరసింహారెడ్డి అందజేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.సుబ్బరాజు, ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకులు ఎంవీఎస్ఎన్ ప్రసాద్, నాయకులు గౌరీశంకర్, గంటా మోహన్, ఎండీ షఫీ, ఎం.రఘునాథరెడ్డి, కె.సన్యాసిరావు, ఎంవీ రమణప్ప, వెంకట రమణయ్య, 13 జిల్లాల ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపాదకీయం

డొల్ల చదువుల పుణ్యఫలం!

అక్షరగంధం దక్కని, నైపుణ్యాలు ఒంటపట్టని ఏ పౌరుడైనా జాతినిర్మాణ యజ్ఞంలో కేవలం వట్టి ముడిసరకే. విద్యార్జనతో పదును తేలి, సరైన జీవికకు బాటలు నిర్మించుకోగలవారే సమర్థ మానవ వనరులుగా, భావి నిర్ణేతలుగా వన్నెకెక్కుతారు. దేశంలోని 596 జిల్లాల్లోని పదహారేళ్ల లోపు వయస్సున్న అయిదున్నర లక్షలమంది విద్యార్థులపై విద్యాప్రమాణాల విషయంలో చేసిన అధ్యయనం పునాది చదువులు గుల్లబారుతున్నాయని వెల్లడించింది. స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ తాజాగా వెలువరించిన వార్షిక విద్యాస్థాయి నివేదిక(అసర్-2018) వెలుగులోకి తెచ్చిన వాస్తవాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో సగం మందికిపైగా భాగహారాలు చేతకావు. మూడోతరగతిలో చేరిన వారిలో దాదాపు 70శాతం మంది రెండో తరగతి పాఠ్య పుస్తకాన్ని సరిగ్గా చదవలేరు. పదాలు, వాక్యాలు చదవగలిగే విద్యార్థుల సంఖ్య గతంలో కన్నా మరింత తగ్గిందని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు(అసర్) వెల్లడించింది. 2007తో పోలిస్తే బడిలో చేరని పిల్లల సంఖ్య మూడుశాతం తగ్గింది. కానీ విద్యా ప్రమాణాల్లో మాత్రం 2.8శాతం పడిపోవడం ఆందోళన వరుస్తోంది. దశాబ్దం కిందట మదింపువేసిన జాతీయ సగటు ప్రకారం, అయిదో తరగతి విద్యార్థుల్లో 53శాతం రెండో తరగతి పుస్తకం చదివే స్థితిలో ఉంటే, నేడు ఆ సంఖ్య 44.2శాతానికి పడిపోవడం మన విద్యావ్యవస్థ దురవస్థను చాటుతోంది. ఈ శాతం ఏటికేడాది తగ్గడమే దిగ్భ్రాంతికరం. 2016లో 47.1శాతం ఉంటే, 2017లో 43.6శాతానికి పడిపోయింది. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో చదివే సామర్థ్యం ఉన్నవారి సంఖ్య 76.1శాతం నుంచి 69.5శాతానికి పడిపోవడం మరింత విస్మయానికి గురిచేస్తోంది. తెలంగాణలో 31శాతం ఎనిమిదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్యపుస్తకాల్ని చదవలేకపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 77శాతానికిపైగా మూడో తరగతి విద్యార్థులు గత ఏడాది నేర్చిన పాఠ్యాంశాల్ని ఉచ్చరించలేకపోతున్నారు. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జమ్మూకశ్మీర్, కర్నాటక వంటిచోట్ల 60-69శాతం దాకా ఎనిమిదో తరగతి విద్యార్థులు లెక్కల్లో చతికిలపడుతున్నారు. దేశార్థిక ప్రగతికి చోదకశక్తిగా ఈ మిడిమిడి జ్ఞానం సరకు ఎలా అక్కరకొస్తుంది? దేశవ్యాప్తంగా తరతమ భేదాలతో చదువుల పునాదులు గుల్లబారి, విద్యారంగం అధ్వాన్నంగా తయారైందనడానికి దాఖలాలివి. పాఠ్యాంశాల ఎంపిక, విద్యాప్రణాళికల కూర్పు, బోధన సిబ్బంది పనిపోకడలు, అభ్యసన విధివిధానాలు... అన్నింటా కంతల్ని ప్రస్ఫుటీకరిస్తున్న చేదునిజాలివి. ప్రాథమిక విద్యాబోధనకు విశేష ప్రాధాన్యం సమకూరితే బాల్యంలో గట్టిపునాది ఏర్పడి అనంతర చదువుల్లో అవకాశాలు ఒడిసిపట్టడంలో విద్యార్థులు మెరుగ్గా రాణించగలుగుతారు. దశాబ్దాల దారుణ అలక్ష్యం కారణంగా సమకాలీన యువభారతంలో అసంఖ్యాకులు అటువంటి సౌభాగ్యానికి నోచడంలేదని వార్షిక విద్యాస్థాయి నివేదిక (అసర్) ఎలుగెత్తుతోంది. తెలుగు రాష్ట్రాల్లో గణితం, సైన్స్, సోషల్‌తోపాటు లాంగ్వేజీస్‌లో విద్యార్థుల వెనుకబాటుకు బోధన సిబ్బంది కొరతే ప్రధాన కారణమని ప్రథమ్ సంస్థ ఏటా వెలువరిస్తున్న నివేదికలు ధ్రువీకరిస్తున్నాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి కూడా వెంటాడుతోంది. ఎనిమిదో తరగతి లోపు పిల్లల అభ్యసన స్థాయి ఇలా అఘోరిస్తుండబట్టే- వివిధ పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో సింహభాగం తప్పొతాలుగా వడపోతకు గురవుతుండటం చూస్తున్నాం. పదో తరగతి విద్యార్హతతో నిర్వహించే ఉద్యోగ పరీక్షల కోసం పట్టభద్రులు, స్నాతకోత్తర పట్టభద్రులు సైతం మళ్లీ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న బాగోతాలకు మూలాలు 'ప్రాథమిక' అవ్యవస్థలోనే ఉన్నాయి! ఐక్యరాజ్య సమితి తీర్మానించినట్లు 'యువత సాధికారతను, ఆత్మగౌరవాన్ని పెంపొందింపజేయడంలో నైపుణ్యాభివృద్ధి పాత్ర ఎనలేనిది'. కానీ సరైన పునాదిలేని చదువులతో యువత నైపుణ్యాల సాధనలో ఎలా నెగ్గుకొస్తోంది? కనుకనే వృథావనరులుగా భ్రష్టుపట్టి తమకు తామే బరువై, జాతికి గుదిబండలుగా తయారవుతున్నవాళ్ల సంఖ్య చిలవలు పలవలు వేసుకుపోతోంది. సర్ కెన్ రాబిన్‌సన్ అనే బ్రిటిష్ విద్యావేత్త లోగడ అభిప్రాయపడినట్లు- 'ప్రకృతి వనరుల్లాగే మానవ వనరులూ ఎక్కడో దాగి ఉంటాయి... వాటంతట అవి వెలుగులోకి వచ్చే పరిస్థితుల్ని ప్రభుత్వాలే కల్పించాల్సి ఉంటుంది'. మానవ వనరులపై పెట్టుబడులు పెంచితేనే జాతి ఉత్పాదకత ఇనుమడిస్తుందంటూ- సుశిక్షిత, వృత్తి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులెంత కీలకమో 2016 కేంద్ర ఆర్థిక సర్వే విశదీకరించింది. మెరుగైన విద్యా ప్రమాణాలకు ఉపాధ్యాయులు నియామకమే కీలకం. ఈ విషయంలో పాలకులు పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 13లక్షల పాఠశాలల్లో 10.3లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లక్ష వరకు ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల్లో అయిదు తరగతులకూ ఒక్కరే మొత్తం అన్ని సబ్జెక్టులు బోధించాల్సిన దురవస్థ. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన ఎనిమిదేళ్ల తర్వాత ఆరు లక్షలమందికిపైగా బోధన సిబ్బంది ప్రామాణిక అర్హతలు, శిక్షణలేనివారేనంటే.. విద్యా ప్రమాణాలు దెబ్బతినడానికి ప్రధాన లోపం మొత్తం ప్రభుత్వ ధోరణిలోనే ఉందని స్పష్టమవుతోంది.

అందరికీ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలంటే, అందరికీ ఒకే బడి విధానం అవసరమని కొఠారీ కమిషన్ ఏనాడో సూచించింది. కామన్‌స్కూల్ విధానంతోనే విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంటుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అలహాబాద్ హైకోర్టు నిర్దేశాన్ని కచ్చితంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాలి. దేశంలో డొల్ల చదువులకు స్వస్తి పలికేందుకూ, తొలి చదువుల దశలోనే ప్రతిభా వికాసానికి అనుసరణీయ మార్గమేమిటో ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, బెల్జియం, సింగపూర్, నెదర్లాండ్స్ తదితర దేశాలు సోదాహరణంగా నిలుస్తున్నాయి. ఇక్కడి ప్రాథమిక చదువులు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ప్రశంసలందు కోవడానికి పాఠ్యప్రణాళికలు, బోధన సిబ్బంది ఎంపిక శిక్షణల్లో తీసుకుంటున్న జాగ్రత్తలదే కీలకంగా ఉంది. విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఉన్నప్పుడే ఆ దేశాలు సృజనాత్మక మానవ వనరుల నిర్మాణంలో ధీమాగా పురోగమిస్తాయి. అట్టడుగు నుంచి పైదాకా విద్యావ్యవస్థను పరిపుష్టీకరించి, సమధిక కేటాయింపులు ప్రసాదించి, నాణ్యమైన బోధన సిబ్బందిని కొలువు తీర్చాలి. సుదృఢ విద్యాసౌధ నిర్మాణం పునాది స్థాయి నుంచీ సవ్యంగా పట్టాలకు ఎక్కితేనే మానవాభివృద్ధి సూచీల్లో భారత్ తేరుకొంటుంది.. పురోగామి దేశాలతో పోటీపడగలుగుతుంది!

చురక

తెరాస వైకాపాల
తెర చాటున బంధం
బట్టబయలు అయ్యిందని
బాబు విప్పె గ్రంథం

మోడీ గారి ఎజెండాను
మోస్తూనే ఇరు నేతలు
పెడుతారట ఆంధ్రరాష్ట్ర
ప్రగతికింక వాతలు

- వేల్పుల నారాయణ

సందర్భం

హెచ్‌ఏఎల్ పణంగా దసాల్ట్‌కు ఫలహారం

నిత్యా చక్రవర్తి

మోడీ ప్రభుత్వం చేసిన నిర్వాకం స్వదేశీ కంపెనీని నష్టాల అంచులోకి నెట్టివేయగా విదేశీ కంపెనీని లాభాల బాట పట్టించింది. 2016లో జరిగిన వివాదాస్పద రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. 36 రాఫెల్ విమానాల తయారీకి సంబంధించి ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ కంపెనీతో మోడీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మరోవైపు దశాబ్దాల అనుభవం ఉన్న ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ (హెచ్‌ఏఎల్)ను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ఆఫ్‌సెట్ భాగస్వామ్యాన్ని నిరాకరిస్తూ ఆర్థికంగా చితికిపోయేలా చేసి, ఆర్థిక సంక్షోభంలో ఉన్న దసాల్ట్‌కు పెద్ద ఆర్డర్ ఇచ్చి, దాన్ని లాభాలు గడించేలా చేసింది. ఇదే విషయాన్ని అమెరికా పత్రిక 'డిఫెన్స్ న్యూస్' ప్రచురించింది.

ఫ్రాన్స్ కంపెనీ దశ మార్చేసిన రాఫెల్ ఒప్పందం కారణంగా భారతీయ కంపెనీ తీవ్రంగా నష్టపోయింది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అయినప్పటికీ దసాల్ట్‌తో పోల్చుకుంటే మెరుగైన స్థానంలో ఉంది. భారత్‌లోని టాప్ డిఫెన్స్ కంపెనీల జాబితాలో హెచ్‌ఏఎల్.. ఫ్రాన్స్ కంపెనీ కన్నా మెరుగైన ర్యాంకులో నిలిచింది. ప్రపంచ డిఫెన్స్ మార్కెట్‌లో ఈ రెండు కంపెనీల 2017- డిఫెన్స్ రెవెన్యూ ఆధారిత ర్యాంకులను 'డిఫెన్స్ న్యూస్' వెల్లడించింది.

2018 సర్వే ప్రకారం ప్రపంచంలోని టాప్ 100 డిఫెన్స్ కంపెనీల్లో హెచ్‌ఏఎల్ 38వ ర్యాంకును కలిగి ఉండగా దసాల్ట్ ఏవియేషన్ 44వ స్థానంలో ఉంది. గతంలో 55వ స్థానంలో ఉన్న ఈ ఫ్రెంచ్ కంపెనీ.. భారత్ నుంచి పెద్దపెద్ద ఆర్డర్లను పొందడం ద్వారా తన ర్యాంకును మెరుగుపర్చుకోగలిగింది. మరోవైపు అదే కారణంగా 35వ స్థానంలో ఉన్న హెచ్‌ఏఎల్ 38వ స్థానానికి పడిపోయింది. దేశంలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ కంపెనీని ఆర్థిక చిక్కుల్లో నెట్టివేస్తూ... ఓ విదేశీ కంపెనీని మోడీ ప్రభుత్వం ఆదుకుంది. అనుభవం లేని ఒక ప్రైవేటు కంపెనీకి ఆఫ్‌సెట్ భాగస్వామ్యం కల్పిస్తూ దశాబ్దాల అనుభవంగల హెచ్‌ఏఎల్‌ను తుంగలో తొక్కింది.

2016లో హెచ్‌ఏఎల్ డిఫెన్స్ రెవెన్యూ 2518.60 మిలియన్ డాలర్లు కాగా 2017లో అది 8శాతం తగ్గి 2720 మిలియన్ డాలర్లకు పడిపోయింది. 2017లో హెచ్‌ఏఎల్ మొత్తం రెవెన్యూ 2830 మిలియన్ డాలర్లు కాగా ఇందులో అత్యధికంగా అంటే దాదాపు 96శాతం డిఫెన్స్ ద్వారానే సమకూరింది. ఆ విధంగా హెచ్‌ఏఎల్ ప్రధాన రక్షణ ఉత్పత్తి కంపెనీ. 2017లో దసాల్ట్ కంపెనీ రెవెన్యూ 2124 మిలియన్ డాలర్లు.. 2016తో పోల్చిచూస్తే దాదాపు 57శాతం వృద్ధిని ఆ కంపెనీ నమోదు చేసుకుంది. ఇందులో ఎక్కువ శాతం మోడీ ప్రభుత్వం ద్వారానే సమకూరింది.

> మోడీ ప్రభుత్వ 'రాఫెల్' నిర్వాకాన్ని వెల్లడించిన అమెరికా పత్రిక 'డిఫెన్స్ న్యూస్'

మోడీ ప్రభుత్వం 2016లో 36 రాఫెల్ యుద్ధ విమానాల తయారీ కోసం రూ.58వేల కోట్లతో దసాల్ట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌తో పాటు ఈజిప్టు, ఖతార్ నుంచీ ఆర్డర్లు రావడంతో ఈ ఫ్రెంచ్ కంపెనీ ఆర్థికంగా పుంజుకుంది. 2017లో లాభాల బాట పట్టింది.

భారతీయ రక్షణ శాఖ 2016 నుంచి ఇప్పటివరకు దసాల్ట్ కంపెనీకి మూడు దఫాలుగా రూ.20వేల కోట్లను చెల్లించింది. మరోవైపు ఎప్పుడో చేసిన పనికిగాను హెచ్‌ఏఎల్‌కు ఇప్పటివరకు చెల్లింపులు జరగలేదు. భారతీయ వైమానికదళం రూ.14వేల కోట్లను హెచ్‌ఏఎల్‌కు బాకీపడింది. దీనిని బట్టి ఆ ఫ్రెంచ్ కంపెనీని ఆదుకోవడానికి మోడీ ప్రభుత్వం ఎంతలా ఉబలాటపడిందో స్పష్టమవుతోంది.

సొంత బ్లూచిప్ కంపెనీ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతుంటే లెక్కచేయకుండా ఫ్రెంచ్ కంపెనీకి ఎక్కువ మొత్తంలో చెల్లించేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో కుదిరిన అవగాహనకు భిన్నంగా రాఫెల్ యుద్ధ విమానాలకు ఎక్కువ ధరను చెల్లించేందుకు సిద్ధపడుతూ కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకుంది. చెల్లింపుల ప్రక్రియను కూడా వేగవంతం చేసింది. తద్వారా విదేశీ కంపెనీ వైపు మోడీ ప్రభుత్వం ఎంతలా మొగ్గు చూపిందన్న విషయం అర్థమవుతోంది. డిఫెన్స్ మోడరనైజేషన్ ప్రోగ్రామ్ ప్రకారం ఇవ్వాల్సిన ఆర్డర్లను ఇవ్వకుండా హెచ్‌ఏఎల్‌ను మోడీ ప్రభుత్వం ఆర్థికంగా చిదిమేస్తోందన్న విషయం ఆ కంపెనీ మేనేజ్‌మెంట్ వర్గాల సమాచారంతో వెల్లడవుతోంది. పార్లమెంటు సమావేశాల్లో జరిగిన చర్చల్లో భాగంగా రూ.లక్షకోట్ల విలువైన ఆర్డర్లను హెచ్‌ఏఎల్‌కు ఇచ్చామంటూ.... ఆ కంపెనీ ఆర్థిక సంక్షోభంలో ఉన్నదన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వాస్తవానికి రూ.26వేల కోట్ల విలువైన ఆర్డర్లు మాత్రమే హెచ్‌ఏఎల్‌కు ఖరారు కాగా మిగతా రూ.74వేల కోట్ల విలువ చేసే ఆర్డర్లు వివిధ స్థాయిల్లో టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. వాటిలో చాలా వరకు ఖరారయ్యే పరిస్థితి లేదు. దీనినిబట్టి హెల్‌ఏఎల్‌కు ఇచ్చిన ఆర్డర్లకు సంబంధించి రక్షణ మంత్రి వక్రీకరించిన దృశ్యాన్ని చూపారన్న విషయాన్ని రక్షణ నిపుణులు, హెచ్‌ఏఎల్ వర్గాలు ధ్రువీకరించాయి.

> 'డిఫెన్స్ మోడరనైజేషన్ ప్రోగ్రామ్ ప్రకారం ఇవ్వాల్సిన ఆర్డర్లను ఇవ్వకుండా హెచ్‌ఏఎల్‌ను మోడీ ప్రభుత్వం ఆర్థికంగా చిదిమేస్తోందన్న విషయం ఆ కంపెనీ మేనేజ్‌మెంట్ వర్గాల సమాచారంతో వెల్లడవుతోంది. పార్లమెంటు సమావేశాల్లో జరిగిన చర్చల్లో భాగంగా రూ.లక్షకోట్ల విలువైన ఆర్డర్లను హెచ్‌ఏఎల్‌కు ఇచ్చామంటూ.... ఆ కంపెనీ ఆర్థిక సంక్షోభంలో ఉన్నదన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వాస్తవానికి రూ.26వేల కోట్ల విలువైన ఆర్డర్లు మాత్రమే హెచ్‌ఏఎల్‌కు ఖరారు కాగా మిగతా రూ.74వేల కోట్ల విలువ చేసే ఆర్డర్లు వివిధ స్థాయిల్లో టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. వాటిలో చాలా వరకు ఖరారయ్యే పరిస్థితి లేదు. దీనినిబట్టి హెల్‌ఏఎల్‌కు ఇచ్చిన ఆర్డర్లకు సంబంధించి రక్షణ మంత్రి వక్రీకరించిన దృశ్యాన్ని చూపారన్న విషయాన్ని రక్షణ నిపుణులు, హెచ్‌ఏఎల్ వర్గాలు ధ్రువీకరించాయి.'

తాజా పరిణామాలను బట్టి హెచ్‌ఏఎల్‌తో మోడీ సర్కార్ దోబూచులాడుతోందన్న విషయం తేటతెల్లమవుతోంది. ఈ క్రమంలో ప్రపంచ మార్కెట్‌లో హెచ్‌ఏఎల్ ప్రతిష్టను దిగజార్చడమే కాకుండా భారత్‌లోని ప్రభుత్వ రంగ కంపెనీల ఉన్నత ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీసే పనిని బీజేపీ నాయకులు చేశారు. రాఫెల్ యుద్ధ విమానాలను తయారుచేయగల సామర్థ్యం హెచ్‌ఏఎల్‌కు లేదంటూ రక్షణ మంత్రి బహిరంగానే చెబుతుంటే ఆ కంపెనీ విదేశీ ప్రత్యర్థులను ఏ విధంగా ఎదుర్కోగలదు? మోడీ హయాంలో హెచ్‌ఏఎల్‌కు తీరని నష్టం జరిగింది. దీనిని భర్తీ చేయడం ఇప్పట్లో సాధ్యంకాకపోవచ్చు.

కమ్యూనిస్టులపై విషంకక్కిన నరేంద్రమోడీ



వి. శంకరయ్య

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేరళ పర్యటన సందర్భంగా కమ్యూనిస్టులపై మత దురహంకార ఫాసిస్ట్ పదజాలమే కాకుండా దూషణలకు కూడా తలపడ్డారు. బీజేపీ సహజ స్వభావాని సంఘ్ పరివార్ శక్తుల మనుస్మృతి వారసత్వాన్ని పచ్చిగా బహిర్గతం చేశారు. కమ్యూనిస్టుల ఎడల ఆయన ప్రయోగించిన పదజాలం అత్యంత హేయమైనది. ఒకదేశ ప్రధాని హోదాకు ఏమాత్రం సరిపోనిది. ప్రధానమంత్రి ప్రసంగపాఠం కొన్ని కీలకాంశాలను తెరమీదకు తెచ్చింది. లౌకిక రాజ్యాంగ వ్యవస్థను చట్టబద్ధ రాజ్యాంగ సంస్థల వునికిని నేలకూల్చే విధంగావుంది.

> కేరళలో బీజేపీ సంఘ్‌పరివార్ గూండాల దాడులు ముమ్మందు రానున్న ఫాసిస్టు దోరణులను ప్రతిబింబిస్తోంది. కేవలం వ్యక్తిగతమైన భక్తి ప్రపత్తులతో తీవ్ర ప్రతి ఘటన ఎదుర్కొని అయ్యప్పను దర్శనం చేసుకు వచ్చిన మహిళలపై కూడా పైశాచిక దాడులు సాగు తున్నాయి. జనాభాలో 50 శాతం గల మహిళల ప్రాథమిక హక్కుల పరిరక్షణకోసమని తలాక్ బిల్లు తీసుకు వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదే సమయంలో హిందూ మతానికి చెందిన మహిళలు అయ్యప్పను సందర్శించు కోవడం జీర్ణించుకోలేక భౌతిక దాడులకు తలపడుతున్నారంటే వీరి మాటలు నేతి బీరకాయను పోలి వున్నాయి.

1) రాజ్యాంగం పై ప్రమాణంచేసి ప్రధాని పదవి చేపట్టిన నరేంద్రమోడీ రాజ్యాంగబద్ధ సంస్థ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి పైగా తీర్పును అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఖండించడమంటే ఇంతకన్నా రాజద్రోహం మరొకటి వుండదు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఎడల తన పార్టీ పరంగా భిన్నాభిప్రాయాలు వుంటే న్యాయస్థానం ముందు సవాలు చేయవచ్చు. కానీ ప్రధాని ఆపని చేయకపోగా మతం, దేవుని పేర ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించారు.

2) సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తూ తన రాజ్యాంగబద్ధ వ్యతిరేక చర్యను సమర్థించుకునేందుకు అయ్యప్పను తెరమీదకు తీసుకు రావడమంటే ఇంతకన్నా మించిన కరుడు కట్టిన మత తత్వం మరొకటి వుండదు. దేవుళ్ళు, మత విశ్వాసాలను వ్యక్తిగత స్వేచ్ఛగా పేర్కొనే రాజ్యాంగాన్ని దాని ప్రాతిపదికను ప్రధాని తన ప్రసంగంలో కూలదోసేందుకు తలపడ్డారు. కేరళ సంస్కృతి పరిరక్షణ పేర సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను లెక్క చేయకుండా వీధుల్లోకి వచ్చి తన పార్టీ కార్యకర్తలు వీధి రౌడీలుగా చేస్తున్న అల్లరిని అరికట్టే రాష్ట్ర ప్రభుత్వ చర్యను రాజకీయ హింసగా అభివర్ణించారంటే బూర్జువా సమాజంలో పోలీసు దమనకాండను నక్సలైట్లు పేర్కొనే రాజ్యహింసకు ఏమైనా తేడా వుందా? కేరళలో ప్రధాని నరేంద్రమోడీ వ్యవహరించిన తీరు చూస్తే ఇకమీదట దేశంలో ఎక్కడైనా సర్వోన్నత న్యాయస్థానాల తీర్పులు ఎవరికైనా రుచించకపోతే తిరిగి న్యాయస్థానాలను తలుపు తట్టడంమాని వీధులు కెక్కడాన్ని పురికొల్పే విధంగావుంది.

3) ఆలయాల్లో మహిళల ప్రవేశంపై కేరళలోని శబరిమలై మహారాష్ట్రలోని శనిసింగనాపూర్ ఆలయాల ప్రవేశంపై సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేరళలో మహిళల ప్రవేశం పై శాంతి భద్రతల సమస్యలను సృష్టిస్తున్న బిజెపి తను అధికారంలో వున్న మహారాష్ట్రలోని శనిసింగనాపూర్ అంశంలో ఎందుకునోరు మెదపడంలేదు? అసలు సమస్య అది కాదు. కేరళలో అధికారంలో వున్న వామపక్ష ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు శాంతి భద్రతల ప్రమాదం పొంచి వున్నదని తెలియజెప్పేందుకు ప్రధానిమోడీ కేరళ పర్యటనను ఉపయోగించుకున్నారు.

ఎన్నికలు సమీపించేకొద్దీ ఓటమి పెనుభూతంలా వెన్నాడుతూ వుండగా రాజ్యాంగం, రాజ్యాంగబద్ధ సంస్థలను తుంగలో తొక్కి మతోన్మాదం రెచ్చగొట్టి దేవుళ్ళ పేరుతో హిందువుల ఓట్లను రాబట్టేందుకు కేరళలో అయ్యప్పలాంటి దేవుళ్ళు బిజెపికి తుదకు గతి అయ్యారు. చరిత్రలో అత్యంత హేయమైన సిగ్గుమాలిన చర్యగా కేరళ సంఘటనను అభివర్ణించిన ప్రధానిమోడీ తను ముఖ్యమంత్రిగా వుండగా గుజరాత్‌లో సంభవించిన మారణ హోమాన్ని ఏ పదజాలంతో వివరించదలిచారో తెలియజెప్పితే బాగుంటుంది. అంతేకాదు ప్రధాని పదవి చేపట్టిన తర్వాత బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులు మైనారిటీలపై జరిగిన దాడులు. మారణకాండ కేరళ సంఘటనలతో పోల్చుకుంటే ఎవరికైనా సరే ఒళ్ళు గగుర్పొడ్చక మానదు. మనుస్మృతి పేర దేశ పౌరులు ఏలాంటి బట్టలు ధరించాలో ఏలాంటి ఆహారం తీసుకోవాలనో శాసించి పశుమాంసం తిన్నారని తుదకు చనిపోయిన పశువులను తొలిగించలేదని సంఘ్పరివార్ శక్తులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సాగించిన అతిక్రూరమైన దాడులు సిగ్గుమాలిన ప్రవర్తనగా ప్రధాని నరేంద్రమోడీకి గుర్తుకు రానందుననే మొన్న జరిగిన ఎన్నికల్లో ఈ రాష్ట్రాల ప్రజలు చక్కటి గుణపాఠం నేర్పారు.

మతం దైవం వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుంటాయి. మనది లౌకిక వ్యవస్థగల దేశం. కానీ గత నాలుగున్నరేళ్ళుగా బీజేపీ ప్రభుత్వం అవలంభించిన మత దురహంకాలకు తోడు దేశ ఆర్థిక వ్యవస్థను కుదుపులకు గురిచేసింది. జీయస్టీ వున్నపలాన అమలు జరపడం పెద్దనోట్ల రద్దు లాంటి చర్యలతో వేలాది పరిశ్రమలు మూతబడ్డాయి. లక్షలాదిమంది ఉపాధికోల్పోయి రోడ్డున పడ్డారు. ఫలితంగా ప్రజలలో మూటగట్టుకున్న వ్యతిరేకతనుండి బయటపడేందుకు కేరళలో అయ్యప్ప ఆలయం' యూపిలో రామ మందిర నిర్మాణం తెరమీదకు తీసుకురావల్సి వచ్చింది. దేవుళ్ళు, గుళ్ళు మాటున అధికారం కైవశం చేసుకునే భాగంలోనే కేరళ పర్యటనలో ప్రధానమోడీ కమ్యూనిష్టులపై దూషణలకు దిగారు. దేవుళ్ళ పేరు చెప్పి ప్రజలను రెచ్చగొట్టేందుకు సిద్ధమైనారు. కమ్యూనిష్టులు ఓటు బ్యాంక్ రాజకీయాలతో వ్యవహరిస్తున్నారని ఆరోపించిన నరేంద్రమోడీ తను, తమపార్టీ మతోన్మాదం 'దేవుళ్ళ' మనుస్మృతి సంప్రదాయాల మాటున దాగుకొని పిల్లి కళ్ళుమూసుకొని పాలు తాగుతూ తనను ఎవ్వరూ చూడలేదనే ధోరణినిలో వ్యవహరిస్తున్నారు.

'2014 ఎన్నికల తర్వాత ప్రధానిగా మోడీ అధికారం చేపట్టిన తదుపరి ముమ్మందు రానున్న ప్రమాదాన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తులు' మేధావులు, కళాకారులు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ప్రగతిశీల భావాలు గల విద్యార్థులు తొలుత పసిగట్టి అసహనం పేర పెద్ద ఉద్యమమే ప్రారంభించారు. చాపకింద నీరులా పాకిన ఈ ఉద్యమం బీజేపీ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసింది. అందుకే వామపక్ష ప్రగతిశీల శక్తులపై బీజేపీ ప్రధాని నరేంద్రమోడీ నిత్యం కత్తులు నూరుతుంటారు. వాస్తవం చెప్పాలంటే ప్రధానమోడీని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించిన పద్ధతిలో ఏ వామపక్షనేత మాట్లాడివుండరు. వామపక్ష నేతలు బీజేపీ మతోన్మాద విధానాలపై సూత్రబద్ధంగా విమర్శలు గుప్పిస్తారు. అసంబద్ధమైన ఆర్థిక విధానాలను ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తారు. కానీ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా మరొక బూర్జువా పార్టీ నేతలను విమర్శించే సమయంలో హాస్యంతో కూడిన ప్రసంగాలను ప్రధాని చేస్తుంటారు. కానీ కేరళకు వచ్చే సరికి వామపక్షాల ఎడల అతి హేయమైన భాష వాడారు. బీజేపీ దాని సంఘ్పరివార్ శక్తులను సూత్రబద్ధంగా వ్యతిరేకించే వామపక్ష శక్తుల ఎడల ఒక రకంగానూ వ్యక్తిగతంగా విమర్శలు చేసిన ఇతర బూర్జువా పార్టీ నేతల ఎడల మరొక రకంగానూ ప్రధాని వ్యవహరిస్తున్నారంటే దీని పరమార్థం వివరించనక్కర్లేదు. ఎందుకంటే వీరంతా ఒకఆకులో చింపుళ్ళే. అదే సమయంలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని దేశాన్ని రక్షించుకోవాల్సిన తరుణం ఆసన్నమైనదని గొంతు చించుకునే పలువురు నేతలు ప్రధానమోడీ కేరళలో ప్రయోగించిన వీధిరౌడీ పరిభాషను తప్పుపట్టలేదంటే ఏమని భావించాలి.

ఇందులో మరోకోణముంది. కేరళలో బీజేపీ సంఘ్‌పరివార్ గూండాల దాడులు ముమ్మందు రానున్న ఫాసిస్టు దోరణులను ప్రతిబింబిస్తోంది. కేవలం వ్యక్తిగతమైన భక్తి ప్రపత్తులతో తీవ్ర ప్రతి ఘటన ఎదుర్కొని అయ్యప్పను దర్శనం చేసుకు వచ్చిన మహిళలపై కూడా పైశాచిక దాడులు సాగుతున్నాయి. జనాభాలో 50 శాతం గల మహిళల ప్రాథమిక హక్కుల పరిరక్షణకోసమని తలాక్ బిల్లు తీసుకు వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదే సమయంలో హిందూ మతానికి చెందిన మహిళలు అయ్యప్పను సందర్శించుకోవడం జీర్ణించుకోలేక భౌతిక దాడులకు తలపడుతున్నారంటే వీరి మాటలు నేతి బీరకాయను పోలి వున్నాయి.

వ్యాసరచయిత : విశ్రాంతపాత్రికేయుడు
9848394013

వృద్ధులకు ప్రభుత్వ భరోసా

శిరందాసు నాగార్జున

పట్టణీకరణ, సాంకేతిక, జీవన శైలిలో మార్పులతో మానవసంబంధాలు, కుటుంబ సంబంధాలలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. కుటుంబ వ్యవస్థకు, ముఖ్యంగా ఉమ్మడి కుటుంబానికి ప్రాధాన్యత తగ్గిపోతోంది. దాంతో రానురాను వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా ఏ ఆధారంలేని వృద్ధుల జీవనం దుర్భరమైంది. ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధులకు ప్రతి నెలా ఇచ్చే పెన్షన్ ను రూ.1000ల నుంచి ఒక్కసారిగా రెట్టింపు చేసి రూ.2వేలకు పెంచింది. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పండుగ రోజు ఈ ప్రకటన చేయడంతో పండుటాకుల కళ్లలో ఆనందం తాండవించింది. వారి కళ్లలో నిజమైన పండుగ కళ కనిపించింది. చివరిదశలో వివిధ కారణాల వల్ల కుటుంబ సభ్యులు సరిగా చూసిచూడక, గ్రామాలలో ఒక్కరినే వదిలివేసి పట్టణాలకు వెళ్లడం, ఆర్థికంగా ఏమాత్రం ఆధారంలేని వారికి కావలసింది ఆ కాస్త భరోసానే. ఎన్టీఆర్ హయాంలో కడుపు నిండా అన్నం తినని పేదలు ఉన్నారని తెలుసుకొని కిలో రూ.2 లకు బియ్యం పథకం ప్రవేశపెట్టారు. ఆయన ప్రవేశపెట్టినవాటిలో ఇప్పటికీ అత్యంత ప్రజాధరణ పొందిన పథకం అదే. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం కిలో రూపాయికి తగ్గించినా ఇప్పటికీ జనంలో అది అన్న పథకంగానే గుర్తింపు పొందింది. బియ్యం పథకం అంటే ఆంధ్రులకు అన్నే గుర్తుకు వస్తారు. ఆయన ఆలోచనలు, ఆయన భావాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ఈ పెన్షన్ పథకానికి 'ఎన్టీఆర్ భరోసా' అని పేరు పెట్టింది. గతంలో రూ.200లు మాత్రమే ఇచ్చే పెన్షన్‌ను 2014 అక్టోబర్ 2 నుంచి ఎన్టీఆర్ భరోసా' పేరుతో రూ.1000లకు పెంచింది. ఈ పథకాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తోంది. మళ్లీ ఇప్పుడు దానిని రూ.2వేలకు పెంచారు. నెల మధ్యలో పెన్షన్ రెట్టింపు ప్రకటించినప్పటికీ జనవరి నెల నుంచే ఇది అమలవుతుంది. ఈ నెలలో ఇప్పటికే లబ్ధిదారులు పెన్షన్ అందుకున్నారు. అందువల్ల ఈ నెలకు మిగిలిన రూ.1000లు, ఫిబ్రవరి నెల పెన్షన్ రూ.2వేలు కలిపి మొత్తం రూ.3వేలు వచ్చే నెలలో లబ్ధిదారులకు అందజేస్తారు. ఆ తరువాత ప్రతి నెల రూ.2వేలు అందజేస్తారు. దివ్యాంగులకు, హిజ్రాలకు ఇచ్చే పెన్షన్ ను రూ.1500ల నుంచి రూ.3వేలకు పెంచారు. రెండు చేతులు లేని, సంపాదనకు ఎటువంటి అవకాశంలేని దివ్యాంగు లకు నెలకు రూ.10 వేలు ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ప్రస్తుతం రాష్ట్రంలో 22,46,947 మంది వృద్ధులు, 19,07,307 మంది వితంతువులు, 6,18,699 మంది దివ్యాంగులు, 95,415 మంది చేనేత కార్మికులు, 22,701 మంది కల్లు గీత కార్మికులు, 32,070 మంది కళాకారులు, 1645 మంది హిజ్రాలు, 39,967 మంది మత్స్యకారులు, 88,202 మంది ఒంటరి మహిళలు, దయాలసిస్ రోగులు ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందేవారు 3,373 మంది, అనుమతి పొందిన ఆస్పత్రులలో చికిత్స పొందేవారు 4,671 మంది సామాజిక భద్రత పెన్షన్లు అందుకుంటున్నారు. మొత్తం 50,61,906 మందికి ప్రభుత్వం 10 రకాల పెన్షన్లు అందజేస్తోంది. తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 5,54,934 మంది, అతి తక్కువగా విజయనగరం జిల్లాలో 2,84,045 మంది ఉన్నారు. పెన్షన్ అందుకునేవారిలో ఎయిడ్స్ రోగులు కూడా ఉన్నారు. 2018 డిసెంబరు నెలలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 50,62,008 మందికి పెన్షన్ రూపంలో రూ. 560,79,49,000 అందజేసింది. 2019 జన వరి 17వ తేదీ వరకు 46,59,530 మంది లబ్ధిదారులకు రూ.514 కోట్ల ముప్పైమూడు లక్షల డెబ్బైఆరువేల ఐదువందలు అందజేసింది. ఇటీవల జరిగిన జన్మభూమి గ్రామ సభలలో సామాజిక భద్రత పెన్షన్ కోసం దాదాపు 1.5 లక్షల మంది దరఖాస్తు చేసుకు న్నారు. వాటిని కూడా పరిశీలించి అర్హులకు పెన్షన్ మంజూరు చేసే అవకాశం ఉంది. వృద్ధులకు భద్రత, భరోసా కల్పించడం అభినందనీయం.

వ్యాసరచయిత : సీనియర్ జర్నలిస్ట్
9440222914

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
19 జనవరి 2019



జానపదం

జానపద నృత్యాలకు ఆదరణ పెరుగతుందనడానికి నిదర్శనం ఈ దృశ్యం. పశ్చిమ బెంగాల్ విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా జానపద నృత్యాన్ని నేర్పుతున్న చిత్రం

ఐ లవ్ యువర్ సన్ !

కాబోయే అత్తగారికి ఓ పెళ్ళికూతురు లేఖ



ప్రియమైన అత్తగార్కి---

రేపు నా జీవితంలో చాలా ప్రాముఖ్యతమైన రోజు. జీవితకాలం గుర్తుంచుకోదగిన రోజు. నేను చాలా ఆనందంగా, సంతోషంగా ఉన్నా. అదే సమయంలో ఆందోళనలోనూ, గందరగోళంగానూ ఉన్నా. భార్యగా బాధ్యతలను ఎలా నెరవేర్చాలి? ఏ విషయానికైనా ఎలా స్పందించాలి, ప్రతిస్పందించాలి అనేది అందరూ నాకు చెబుతూనే ఉన్నారు. ఇవేమీ నా నుంచి మీ అబ్బాయి కోరుకోవడం లేదని నాకు తెలుసు. అయినా నేను తెలుసుకుంటున్నాను. అవును, మీ అబ్బాయిని నేను ప్రేమిస్తున్నాను. ఎలాంటి అరమరికలూ లేకుండా **మీరు ప్రేమించే మీ కొడుకుని నేనూ ప్రేమిస్తున్నా.**

ఎవరికోసమైతే మీరు ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటారో అతనే మీకు ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతిని కలిగించాడు...నన్ను మీ ఇంటికి తీసుకువచ్చి. ఇకపై అతనే నా ప్రపంచం, నా సమస్తం.

ఈ లేఖలో నేను మీకు ఒక విషయం చెప్పదలుచుకున్నాను. నిజాయితీగా, దయగా, ప్రేమగా, అర్థం చేసుకునే మనస్థత్వం ఉన్న ప్రేమికుడు, జీవిత భాగస్వామి దొరికినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నా. అందుకు ముందుగా మీకు కృతజ్ఞతలు. రేపు మా పెళ్ళైన తర్వాత....నేను, అతను మాత్రమే కాదు...మా ఇద్దరికి పడే ముడి రెండు కుటుంబాలకీ సంబంధించినది. మీకు, నాకు సంబంధించిన విషయం కూడా.

మూస పద్దతులకు స్వస్తి చెబుతూ మహిళలు ఎన్నెన్నో ఘనకార్యాలు సాధిస్తున్న ప్రపంచంలో మనం ఉన్నాం. 21వ శతాబ్దంలో మన మధ్య సంబంధం శ్రీకారం చుట్టుకోనుంది. అందరు అత్తాకోడళ్ళ మాదిరిగా మనం ఉండకూడదు. ఇవి మన జీవితాలు. మనకు నచ్చినట్టుగా, అద్భుతంగా తీర్చిదిద్దుకునే అవకాశం మనకు ఉంది.


మీతో పోటీ పడేందుకు నేను ఇక్కడకు రావడం లేదు. అతని గురించి మీరు ఏం చెబుతారో నాకు తెలుసు. అలాగే, మీ గురించి ఆయన ఏం చెబుతారో కూడా నాకు తెలుసు. ప్రేమ, సహృదయత, సత్యత, నిష్కల్మషత ఉన్న కుటుంబంలో పెరిగాను. ఆది నుంచీ నాలో ప్రగతిశీల ఆలోచనలనే పాదుకొల్పారు మావాళ్ళు. ఈ లక్షణాలన్నింటినీ మన ఇంటికీ తీసుకొస్తాననీ, వాటిని ఎప్పటికీ ఆచరిస్తానని హామీనిస్తున్నాను. ఈ ఇంట్లో ఎవరి స్థానాన్నీ తీసుకోవాలని నేను కోరుకోవడం లేదు. నా స్థానం నాకు ఉంటుందని ఆశిస్తున్నాను. మీరు ఆయనకు తల్లి. ఇకపై నాకు కూడా. మీ మాటల్ని, మీ అనుభవాన్ని, మీ సూత్రాల్ని నేను గౌరవిస్తాను.

మనం స్నేహితులుగా ఉందాం. మరే ఇతర బంధమూ వద్దు. అంతిమంగా మనం స్వతంత్ర వ్యక్తిత్వం గల మహిళలుగా ఉందాం. మనం ఒకే కేటగిరీకి చెందిన మహిళలుగా మిగిలిపోవద్దు. అలాంటి సంబంధాలను మన మధ్య పొడచూపనీయవద్దు. మనమధ్య ఇప్పటికే చాలా సాధారణ అంశాలు ఉండిఉంటాయి. ఒకే వ్యక్తిని ప్రేమిస్తున్న మనుషులం మనం. అందుకే మనం స్నేహితులుగా ఉందాం. మన జీవితాలను, జీవిత కథలను, మన ఇష్టాలను, ప్రణాళికలను, ఆలోచలనలను పంచుకుందాం. మనం తల్లీకూతుళ్ళ మాదిరిగా ఉందాం. సుఖమైనా, దు:ఖమైనా, నవ్వు అయినా, ఏడుపు అయినా కలిసే పంచుకుందాం. మీ ఇష్టాఇష్టాలేమిటో ఒక సోదరిలా నాకు చెప్పండి. అందమైన గృహాన్ని మీరు ఎలా తీర్చిదిద్దారో చెప్పండి. అత్యంత సున్నితంగా, నిజాయితీగా, స్మార్ట్‌గా మీరు మీ పిల్లలను ఎలా పెంచారో చెప్పండి.

మీ అబ్బాయి జీవితాన్ని ఎవరో ఒక కొత్త వ్యక్తి వచ్చి పంచుకోవడం అనే ఆలోచన మిమ్మల్ని భయపెడుతుందని నాకు తెలుసు. కానీ మీరు నన్ను నమ్మండి. ఆయనకు కేవలం ఆనందాన్ని పంచేందుకు నేను నా శాయశక్తులా కృషి చేస్తా. కారణం...నేను ఆయన్ని ప్రేమిస్తున్నాను. ఆ ప్రేమ కూడా మీలాగానే...బేషరతుగా...ఎలాంటి అరమరికలు లేకుండా!. నేను తప్పు చెప్పడం లేదు, నేను బాధ్యతగా ఉంటాను, ఆయనను జాగ్రత్తగా చూసుకుంటాను, ఆయనే నా ప్రపంచం, నా సమస్తం కనుక ఈ ప్రపంచం అంతమయ్యేవరకూ నేను మీ కుమారుడిని ప్రేమిస్తూనే ఉంటాను...నన్ను నమ్మండి. ఈ హామీతో కొత్త జీవితాలను ప్రారంభిద్దాం. ఆ కొత్త జీవితం మీ అబ్బాయితో మాత్రమే కాదు...మీ అందరితో కలిసి...! సొంత వ్యక్తిత్వం ఉన్న మహిళలుగా....ఎవరి మధ్యా లేనంత ప్రేమానుబంధాలతో...రక్త సంబంధాలకు అతీతంగా....మనం మన కొత్త జీవితాలకు శ్రీకారం చుడదాం...కొనసాగిద్దాం.

ఇట్లు
మీ ప్రియమైన కోడలు

సరాగాల... అలంకరణ!



ఇంటి అలంకరణ రకరకాలు. ఇందుకోసం రకరకాలు ఉపయోగిస్తుంటారు. ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అక్కరకొచ్చిన వస్తువులన్నీ వాడేస్తుంటారు. వాల్ పెయింటిగ్స్ నుంచి టేబుల్ డెకోరేట్స్ వరకూ ఏవేవో ప్రయోగాలు చేసేస్తుంటారు. మరి ఎప్పుడైనా రాగాలు, సరాగాలు ఉపయోగించారా? అదెలా అంటారా? అవును వీటితోనూ ఇంటిని అలంకరించుకోవచ్చు. సంగీత వాయిద్య పరికరాలతో అలంకరణ ఇంటికే ఒక కొతదనాన్ని, నిండుదనాన్ని, కొంగొత్త కళను తీసుకొస్తుంది. ఈసారి మీరూ ఇలాంటి అలంకరణ చేసిచూడండి. మీ ఇంటి శోభను మరింత పెంచుకోండి. ఇందుకోసం ఉపయోగించుకోదగ్గ కొన్ని సంగీత వాయిద్య పరికరాలు ఏమిటో ఓ లుక్కేద్దాం.



వయోలిన్

ఇంట్లో గిటార్ లేదా వయోలిన్ ఉందా. అయితే దానిని ముందు గదిలో లేదా హాలులో అలా గోడకు తగిలించి చూడండి. అ లుక్కే వేరుగా ఉంటుంది. అక్కడ ఉన్నంత అందచందాలు ఇంకెక్కడా కనిపించవేమో అన్నంతగా మార్పు కనిపిస్తుంది.



పాత సాక్సోఫోన్

సాక్సోఫోన్‌ను ఇప్పుడు వినియోగించడమూ తక్కువగానే ఉంది. ఎక్కడో తప్ప అంతగా కనిపించడం లేదు. మీ ముందు తరాల వాళ్ళు ఎవరో దాచిపెట్టిన సాక్సోఫోన్ ఉంటే, అది నిరుపయోగంగా పడి ఉంటే దానిని మీరు ల్యాంప్‌గా మార్చేయండి. పాత కాలపు సాక్సోఫోన్ తెచ్చే అందం ఏ పాటిదో మీ ఊహకు కూడా అందదు. ఆ ఏర్పాటు చేసి చూడండి. ఇది నిజమేనని మీరే ఒప్పుకుంటారు.

మ్యూజికల్ పెయింటింగ్స్

సంగీత వాయిద్య పరికరాలేవీ లేవా? అయినా డీలాపడిపోనక్కర్లేదు. సంగీత వాయిద్య పరికరాలతో కూడిన పెయింటింగ్స్ లేదా చిత్రాలను తీసుకొచ్చి గోడలకు అలంకరించండి చాలు. మీకున్న ఆసక్తి ఇట్టే తెలిసిపోతుంది. ఇలా మొత్తంగా మ్యూజికల్ థీమ్‌తో మీ ఇంటి లుక్ ఎంతగా మారుతుందనేది మీకే అర్థమవుతుంది.



తబల, హార్మోనియం

తబల, హార్మోనియం లాంటి సంగీత వాయిద్య పరికరాలను గోడకు తగిలించడం కుదరదు ఇలాంటి వాటిని షోకేస్‌ల్లో, గ్లాస్ కప్‌బోర్డులో ఉంచితే బాగుంటాయి. చిన్నసైజు పియానోలూ అంతే. పెద్ద సైజు పియానోలు ఎలాగూ గది మధ్యలో ఉంచక తప్పదు.

ఫ్లూట్

ఇంటికి లేదా గదికి క్లాసికల్ లుక్ రావాలంటే మీరు గోడకు ఫ్లూట్ తగిలించండి చాలు. సింపుల్‌గా కనిపిస్తూనే గదికి నిండుదనం తెస్తుంది ఫ్లూట్. ఫ్లూట్‌తో రాగాలు ఎంత కమ్మగా ఉంటాయో గది అందం అంతకు రెట్టింపు కమ్మగా కనిపిస్తుంది.





గ్రామోఫోన్

గ్రామోఫోన్ చాలా పాత సంగీత పరికరం. అవడానికి పాతకాలపు పరికరమే కానీ ఇంటి అలంకరణలో మాత్రం కొత్త అందాన్ని మూటగట్టుకొస్తుంది. మంచి మ్యూజికల్ లుక్‌ని తీసుకొస్తుంది.





మౌత్‌వాష్‌లూ తయారుచేసేయవచ్చు !



ఈ రోజుల్లో మౌత్‌వాష్‌ల వాడకమూ మామూలైపోయింది. రోజువారీ దినచర్యలో ఇప్పుడు మౌత్‌వాష్‌లూ కనిపిస్తున్నాయి. ఈ మౌత్‌వాష్‌లు కావిటీలనే కాదు గమ్ డిసీజ్‌లనూ తగ్గిస్తాయి. శ్వాసను తాజాగా ఉంచుతాయి. అలాగని కృత్రిమంగా ఉండేవి, బయట మార్కెట్ నుంచి కొని తెచ్చుకునేవి వాడడం మంచిది కాదు. ఇవి మంచి కంటే చెడు ఎక్కువ చేస్తాయి. వీటిల్లో ఆల్కహాల్‌తో పాటు ఇతర రసాయన పదార్థాలూ ఉంటాయి. ఇవి ఏదో రూపంలో హాని చేస్తాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే వీటిని కూడా ఇంట్లోనే తయారు చేసుకోవాలి. ఇదేమీ అంత క్లిష్టమైన పనికాదు. రోజువారీ ఇంట్లో ఉండే పదార్థాలతోనే వీటిని తయారుచేసేసుకోవచ్చు. ఇందుకు ఉపయోగపడే పదార్థాలు, వాటి తయారీ విధానాలు చూద్దాం.

- రెండు టేబుల్ స్పూన్‌ల బేకింగ్ సోడా, రెండు చుక్కలు పెప్పర్‌మింట్ ఎసెన్షియల్ ఆయిల్, రెండు చుక్కల టీ ట్రీ ఆయిల్, అరకప్పు ఫిల్టర్ వాటర్ తీసుకోండి. ఇవన్నీ కలిపి ఒక బాటిల్‌లో పోసుకోండి. అంతే యాంటీ బాక్టీరియల్ మౌత్‌వాష్ రెడీ. రోజూ బ్రష్ చేసిన తర్వాత వాడుకోవచ్చు. వాడే ముందు దీనిని బాగా షేక్ చేయడం మాత్రం మర్చిపోవద్దు. బాటిల్ బాగా కదిపి వాడుకోకపోతే బేకింగ్ సోడా సీసా అడుగుభాగంలోనే ఉండిపోతుంది. ఇందులో పెప్పర్‌మెంట్ ఆయిల్ కూలింగ్‌నిస్తే, టీ ట్రీ ఆయిల్ ఇలాంటి ప్రయోజనాలు ఎన్నింటినో అందిస్తుంది.
- యాపిల్ సిడర్ వెనిగర్ ఒక అద్భుతమైన ద్రవం. ఇది అనేక అనారోగ్యాలను పరిష్కరిస్తుంది. బరువు తగ్గించడం నుంచి మౌత్‌వాష్ వరకూ ఎన్నో రకాలుగా పనిచేస్తుంది. రెండు టేబుల్ స్పూన్‌ల యాపిల్ సిడర్ వెనిగర్, ఒక కప్పు నీళ్ళు తీసుకోండి. రెండూ కలపండి. మౌత్‌వాష్ తయారవుతుంది. యాపిల్ సిడర్ వెనిగర్‌లో నీళ్ళు కలవడం వల్ల అది దంతాలకు ఎలాంటి చేటు చేయదు.
- సహజసిద్ధమైన మౌత్‌వాష్‌ని తయారుచేసేందుకు మూలికలను ఉపయోగించడం ఉత్తమమైన పద్ధతి. వీటితో అసలుసిసలైన మౌత్‌వాష్ తయారవుతుంది, మంచి ఫలితాలు వస్తాయి. ఆ ఫలితాలు ఎక్కువ రోజులు ఉంటాయి. రెండు కప్పుల నీళ్ళు మరిగించండి. ఇందులో 28 గ్రాములు రోజ్‌మేరీ, మరో 28 గ్రాములు ఒరేగాన్ గ్రేప్ రూట్, కొన్ని లవంగం మొగ్గలు వేసి నీళ్ళను మరిగించండి. బాగా మరిగిన తర్వాత ఆ నీళ్ళను వడకట్టి చల్లారనివ్వండి. అంతే మౌత్‌వాష్ రెడీ. ఇది నోట్లో చెడు వాసనను దూరం చేస్తుంది.
- అర టేబుల్ స్పూన్ దాల్చిన చెక్క పొడి తీసుకుని సీసాలో లేదా జార్‌లో వేయండి. రెండు తాజా నిమ్మకాయలు తీసుకుని రసం పిండి దాన్ని ఆ సీసాలో పోయండి. ఇందులో ఒకటిన్నర టీ స్పూన్ తేనె వేయండి. చివరగా ఒక కప్పు వేడినీళ్ళు పోయండి. తేనె బాగా కరిగేవరకూ బాగా కదుపుతూ ఉండండి. మౌత్‌వాష్ రెడీ అయినట్టే. రోజూ బ్రష్ చేసుకున్నాక ఉపయోగించుకోవచ్చు.

గురకకు యాలకుల మందు



గురక సమస్య వారినే కాదు ఇంట్లో ఉన్న వారందరినీ ఇబ్బందిపెడుతుంది. గురక తీసేటప్పుడు నోరు తెరిచి ఉంచడం, బోర్లా పడుకుని గురక తీయడం వంటివి మరిన్ని అనారోగ్యాలకు దారితీస్తాయి. గురకకు చెక్ చెప్పాలంటే మంచి మందు యాలకులే. అర టీ స్పూన్ యాలకుల పొడిని గ్లాసు వేడినీటిలో కలిపి రాత్రి నిద్రపోయే ముందు తాగి పడుకోండి. రెండు చెంచాల పసుపును కప్పు వేడిపాలల్లో కలిపి రాత్రి పూట పడుకునే ముందు తాగినా మంచి ఫలితం ఉంటుంది. ఆవు నెయ్యిని రోజూ వేడిచేసి కరిగించి రెండేసి చుక్కల చొప్పున ముక్కు రెండు రంధ్రాలలో వేసి పీల్చినా గురక దూరమవుతుంది. అర స్పూన్ ఆలివ్ ఆయిల్, అర టీ స్పూన్ తేనె కలిపి రాత్రి నిద్రపోయే ముందు తాగితే గురక తగ్గుతుంది. శ్వాస వ్యాయామాలు క్రమం తప్పకుండా చేసినా మంచి ఫలితం ఉంటుంది.

నేను - మిడిగుండం (నవల) 19

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి



ఇంతకుముందు వెన్నెల నాకు యిచ్చిన డబ్బులు నా దగ్గరే వున్నాయి. ఎందుకో అవి ఖర్చు చేయాలనిపించ లేదు. ఇప్పుడూ అంతే. బలవంతంగా నెట్టుకు వచ్చాను. అమిత గుర్తొచ్చింది గాని డబ్బులు ఎవరో ఒకరి దగ్గర తీసుకోవటానికి అలవాటు పడకూడదు అనుకున్నాను.

రెండో తారీఖున శ్రీనివాస్‌ను డబ్బులు అడిగాను. బిల్లులు రావాలి. ప్రస్తుతానికి వాడుకో అంటూ రెండు వేలు యిచ్చాడు. అమ్మకి వెయ్యి రూపాయలు పంపించాను. మావయ్యకే నేరుగా పంపాలనుకున్నాను. ధైర్యం చాలలేదు. ఏం చేయాలో అమ్మ నిర్ణయించుకుంటుంది.

తర్వాత రెండు వారాలు చూసాను. శ్రీనివాస్ మాట్లాడటం లేదు. మళ్లీ గుర్తు చేయాల్సి వచ్చింది.

రాజు సహాయంతో పది రోజుల్లో డ్రైవింగ్ వచ్చింది. ఆ తర్వాత ఎప్పుడో శ్రీనివాస్ డ్రైవింగ్ లైసెన్స్ యిప్పించాడు. తొలి ఉద్యోగంలో నేను గుర్తుంచుకోదగ్గ అంశం అది.

శ్రీనివాస్ ఒకటి రెండుసార్లు అడగందే జీతం యిచ్చేవాడు కాదు. అదో తరహా మనిషి.

ఏమైనా ఇలాంటి ఉద్యోగం చేస్తూ చదవటం అసాధ్యం అని అర్థం అయింది. ఏమాత్రం తీరిక వుండేది కాదు. ఇన్ని గంటల పని అని లేదు. లైబ్రరీ కూడా దగ్గర్లో లేదు.

ఇంత పని చేస్తున్నా ఇలాంటి చిన్న చిన్న విషయాలు తప్ప నేను చాలా విషయాలు నేర్చుకుంటున్నాను.

****

సంవత్సరం వరకు ఇంటికి వెళ్లటం కుదరలేదు. ఆరు నెలలయినాక ఇంటికి వెళ్లొస్తాను అన్నాను. ముఖం అదోలా పెట్టాడు. నేను చెబుతా. అప్పుడు వెళ్తువు గాని అన్నాడు. అలా సమయాన్ని గడిపేసాడు. ఇప్పుడూ రెండు రోజుల్లో వచ్చేయ్ అని చెప్పాడు.

ఓసారి వెనక్కి తిరిగి చూసుకుంటే నేను కూడా ఓ యంత్రాన్ని. పేపర్ ఎప్పుడన్నా చదివానంటే బయటకు వెళ్లినప్పుడు. అదీ ఆదరా బాదరాగా చదవటం. బావిలో కప్పలా వున్నాను. ఈ ఉద్యోగం కూడా లేకపోతే ఎలా వుండేద నేది వేరే విషయం.

అమిత రాస్తున్న ఉత్తరాల్లో సర్వీస్ కమిషన్ ఎగ్జామ్స్ రాస్తే బాగుంటుందని సూచిస్తోంది. మళ్లీ అదో ప్రపంచం. అలాంటి పరీక్షలు రాయాలంటే ఇంక వేరే పని వుండకూడదు. కోచింగ్ తీసుకోవాలి. ప్రిపేరవ్వాలి.

నేను అనుకున్నది వేరు. బతుకు పోరాటంలో కూరుకుపోతున్నాను అనే నిరాశ మొదలయింది.

అమ్మకు వెయ్యి, పన్నెండు వందల వరకు పంపిస్తున్నాను. ఇంటికి వెళ్లాక మావయ్య పరిస్థితి బాగా దిగజారి పోయిందని తెలిసింది.

నాన్న జబ్బు పడినప్పుడు ఎంత ఖర్చయిందో అమ్మకు ఏ రోజూ మావయ్య చెప్పలేదు. ఇప్పుడు ఓ ఎకరం అమ్మాడని తెలిసి బాధపడ్డాను.

"నువ్వు పొలం అమ్మకుండా వుండాల్సింది" అన్నాను.

"వడ్డీలు పెరిగిపోతున్నాయి. అయినా ఇంకా రెండుకరాల భూమి వుంది" అన్నాడు.

నాకు తెలిసినంతలో ఎకరంతో బాకీలు తీరలేదు. ఒత్తిడి వున్న వాటిని తీర్చాడు.

"అర్చనకి, వెన్నెలకి చెరో ఎకరం యిస్తాను వాటిని అమ్మను" అన్నాడు.

"మరి మీకు" అన్నాను.

"నాకింకా ఓపిక వుంది అల్లుడూ. అయినా నేను చెప్పిన మాట నువ్వు వినలేదు. ఇప్పటికి ఓ సంవత్సరం పూర్తి అయ్యేది నువ్వు చదువుకునుంటే"

అంటే నేను ఒప్పుకునుంటే రెండెకరాలు అమ్మేవాడు. ఏ రైతయినా యింకో రెండెకరాలు కొనుక్కోవాలనుకుంటాడు. వెన్నెల చదవటం మానేసింది. అర్చన ఫర్వాలేదు. నన్ను బలవంతం చేసినట్లు వెన్నెలని ఎందుకు ఒత్తిడి చేయలేదు.

నేను బయటి వాడిని. వాళ్లు స్వంత పిల్లలు ఇది ప్రేమా... బంధమా... అసలు ఇతను మనిషేనా!

మావయ్య పాదాలకు నమస్కరించాలి.

ఇప్పుడు నేను చేయాల్సింది ఎంతో వుంది. అదేమిటో ఎలానో తెలియదు. ఈ ఉద్యోగంలో వుండి నేను ఎంతవరకు చేయగలను!

"అమ్మా - ఇంకా ఎక్కువ డబ్బులు పంపాలని నాకు వుంది. కుదరటం లేదు" అన్నాను. నేను పంపిన డబ్బులు మావయ్యకు ఇస్తుందా... ఆయన అందుకు ఒప్పుకుంటాడా? ఇవన్నీ తెలుసుకోవటం వలన సంతోషం వుండదు.

చూస్తుండగానే ఇంకో సంవత్సరం గడిచిపోయింది.

ఈసారి మావయ్య ఇల్లు అమ్మేసాడు. అది తెలిసి షాక్ అయ్యాను. అప్పటికప్పుడు ఇంటికి వెళ్లాను.

"ఏంటి మావయ్యా ఇదంతా!"

"నేను ఇల్లు అమ్మానంటే అర్థం చేసుకో, ఎవరూ ఇల్లూ - పొలం అమ్మాలనుకోరు. అయినా తప్పదు" అన్నాడు.



"అమ్మా నువ్వయినా చెప్పలేదా అని అడిగాను.

"అన్నయ్య అంతా అయిపోయేదాకా వదినకి కూడా చెప్పడు. నన్ను ఏం చెప్పమంటావు. ఇదంతా చూడటానికి నేను బతుకుతున్నానా" అంది బాధగా..

మావయ్య ఇంటి నుండి మారారు. మావయ్య చిన్నప్పుడు కట్టుకున్న ఇల్లు.

అందరినీ హైదరాబాద్ తీసుకు వస్తేనో అనిపించింది.

"అక్కడ బతకటం కష్టం అల్లుడూ. సంపాదనంతా ఇళ్ల అద్దెలకు. సరుకులు కొనటానికి సరిపోతాయి. వ్యాపారాలు చేసే వాళ్లకి, స్థలాలు కొనేవారికి లాభం తప్ప మనలాంటి వారికి కాదు. అయినా నాకు రెండకరాలున్నాయి. ఇప్పుడు అప్పులు లేవు. అవసరం అనుకుంటే కూలి పనులకి పోతాను. అక్కడికి వచ్చినా నేను చేసే పనుండదు. ఉన్న వూర్లో పడుంటే అవసరానికి నలుగురు మనుషులు పలుకుతారు" అన్నాడు.

మావయ్య డీలా పడ్డాడని కాదు. అది ఆయన స్వభావం కాదు. ఇంక ఉపేక్షించటానికి వీలు లేదు. నేను రెండు నెలలు ఖాళీగా వున్నా ఫర్వాలేదు. ఏదొక గట్టి నిర్ణయం తీసుకోవాలి అనుకున్నాను.

జయదేవ్ మాస్టారు ఓ సందర్భంలో అన్న మాటలు గుర్తొచ్చాయ్.

"ఉద్యమాల్లో పని చేసేవారికి కూడా కాస్త ఆర్థిక దన్ను వుండాలి. కేవలం వారికి యిచ్చే ఎలవెన్సులతో బతకటం సాధ్యం కాదు. అయినా కొంతమంది వీటికి అతీతంగా త్యాగాలు చేస్తారు. అందుకే పిల్లల్ని పట్టించుకోరు. అలాంటి కుటుంబాలు ఎప్పుడూ పైకి రావు"

ఇంతకీ మావయ్య మనసులో ఏముంది?

****

హైదరాబాద్ వచ్చాను.

ఇప్పటికిప్పుడు నేను బయటకి వెళ్లిపోతాను అంటే శ్రీనివాస్ యిబ్బంది పడతాడు. ఇంకో మనిషిని చూసుకో అని చెప్పాలి. అంతకుముందు అమితకి చెప్పాలి. శ్రీనివాస్ దగ్గరకి రావటానికి కారణం తను. వాళ్ల నాన్న..

విశాఖ వెళ్లి నా పరిస్థితి గురించి చెప్పాలనుకున్నాను.

అది కుదిరే పని కాదు. అందుకే దీర్ఘంగా ఉత్తరం రాయాలనుకున్నాను. కొంతవరకు రాసాను. మళ్లీ ఏదో పని... ఆపేసాను. ఉదయం బయటకు వెళ్తుంటే...

అమిత వస్తూ కనిపించింది. నాలో ఎంత ఉద్వేగం కలిగిందో! స్కూటర్ మీద ఎక్కించుకుని ఇంటికి తీసుకు వెళ్లాను.

పీ.జీ. పూర్తయింది తనకి. ఈసారి మరింత ఒత్తిడి మొదలయిందంట.

"నేను సీరియస్‌గా చెప్పాను రామూ... పెళ్లి అయ్యాక కూడా నేను చదవటానికి ఇష్టపడేవారుంటే నేను ఆలోచిస్తాను అన్నాను"

"అదేంటి అమితా. రేపు అందుకు ఒప్పుకుంటాం అంటారు. తర్వాత వద్దు అంటారు. అయినా పరిచయం లేని వ్యక్తుల్ని అమిత పెళ్లి చేసుకుంటుందా!"

చిన్నగా నవ్వింది.

"ప్రేమ ఎప్పుడు పుడుతుందో ఎవరికి తెలుసు అంటారు. పెళ్లి అంతే. అది ఎప్పుడు జరుగుతుందో ఎవరికి తెలుసు"

"అంటే పెళ్లిళ్లు స్వర్గంలో నిర్ణయించటం జరుగుతుందని నువ్వు నమ్ముతున్నావా?"

"మనం నమ్మం. కొంతమంది విషయంలో పెళ్లి కూడా ఓ యాదృచ్ఛిక సంఘటన అవుతోంది కదూ" అంది

నేను నవ్వాను.

"మా బంధువుల్లోనే కొంతమంది అమ్మాయిలు నాకు తెలుసు. వారికి ఎలాంటి సంబంధం నచ్చేది కాదు. ఏవో వంకలు పెట్టేవారు. వారికి అందమైన వాడు కావాలి. ఆస్థి వుండాలి. చెడు అలవాట్లు వుండకూడదు. వున్నా తమ చుట్టూ తిరుగుతుండాలి. తమకు మించిన ప్రపంచం ఏదీ వుండకూడదు. ఇలాంటివి చాలా వుంటాయి. వయసు ముదిరాక కొంతమంది రాజీ పడ్డారు. ఇంకొందరు ఎదురు చూస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే ఈ వ్యక్తితో జీవితం పంచుకోవచ్చు అనుకునే వారు నాకు తారసపడలేదు"

"అదే విషయం చెప్పాల్సింది."

"ముందు వాళ్లని కంగారు పడకుండా చూడాలి. ఎప్పటికప్పుడు నా ఆలోచనలను చెబుతున్నాను. తొందర వద్దు అంటున్నాను. వాళ్లు కూడా ఏదో ఒక సంబంధం తేవాలనుకోరు. చూద్దాం" అంది.

(ఇంకా ఉంది)

డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక ప్రకారం అత్యంత చురుకైన ప్రజలున్న దేశం ఏది ?

కరెంట్ ఎఫైర్స్ ప్రాక్టీస్ బిట్స్



1. 2018 సంవత్సరానికిగాను యుకె, ఆసియా ఇన్‌స్పిరేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డు ఎవరికి దక్కింది ?
1. ప్రతాప్ సి.రెడ్డి 2. గురునాథ్‌రెడ్డి
3. నిరంజన్ హీరా నందాని 4. మజుందార్ షా

2. జీవితకాలాన్ని పొడిగించబడిన భారతదేశ మొట్టమొదటి క్షిపణి ఏది ?
1. అగ్ని-5 2. పృథ్వీ-3 3. బ్రహ్మోస్ 4. ధనుష్

3. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన మౌంట్ ఎవరెస్ట్‌ను తన ఎనిమిదవ ప్రయత్నంలో అధిరోహిస్తూ ప్రాణాలు కోల్పోయిన జపాన్ పర్వతారోహకుడి పేరేమి ?
1. నోబుకాజు కురికి 2. యుచిరొామియుర
3. తెన్‌జింగ్ 4. జున్‌కొతాచె

4. 2017-18 సంవత్సరానికి గాను ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) జీవన సాఫల్య పురస్కారం ఎవరికి దక్కింది ?
1.గురునాథ్‌రెడ్డి 2. టి.హెచ్.చౌదరి
3. డాక్టర్ ప్రకాశ్ చంద్ జైన్ 4. సంజయ్ ప్రతిహార్

5. 2018 సంవత్సరానికి గాను అమెరికా వెలుపల 50 మంది శక్తిమంత మహిళా వ్యాపారులతో ఫార్చ్యూన్ మ్యాగజైన్ రూపొందించిన జాబితాలో భారత్ నుంచి ఒకే ఒక్కరికి స్థానం దక్కింది. ఆమె ఎవరు ?
1. స్వాతి పిరమాల్ 2. నైనా లాల్ కిద్వాయ్
3. అలైస్ వైద్యన్ 4. అర్చనా భార్గవ

6. ఆసియాకప్-2018 క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
1. బంగ్లాదేశ్ 2. భారత్ 3. పాకిస్థాన్ 4. ఆఫ్ఘనిస్థాన్

7. కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన లోక్‌పాల్ అన్వేషణ కమిటీకి ఎవరు నేతృత్వం వహిస్తున్నారు ?
1. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి విక్రమజిత్ సేన్
2. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్
3. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డి.ఎ.దేశాయ్
4. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దల్వీర్ భండారీ

8. ఏ దేశం సెప్టెంబర్‌లో హైస్పీడ్ రైలు ప్రాజెక్టును ప్రారంభించింది ?
1. సౌదీ అరేబియా 2. ఉజ్బెకిస్థాన్
3. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 4. ఇండోనేషియా

9. రంపం పొట్టునుంచి పెట్రోల్‌ను తయారు చేసే ఓ నూతన విధానాన్ని ఏ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు ?
1. వాటికన్ సిటీ 2. మాసిడోనియా
3. బెల్జియం 4. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్

10. కేంద్రప్రభుత్వం ప్రకటించిన జాతీయ క్రీడా పురస్కారాల్లో దేశ అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు ఈసారి ఎవరిని వరించింది ?
1. విరాట్ కోహ్లి, మీరాబాయి చాను 2. స్మృతి మంధాన, మనికా బత్రా
3. రాహి సర్నోబత్, అంకుర్ మిట్టల్ 4. సిక్కిరెడ్డి, సతీశ్‌కుమార్

11. దేశ అత్యున్నత న్యాయస్థానం నుంచి కింది కోర్టుల వరకు న్యాయమూర్తుల కొరత నెలకొంది. ప్రతి 10 లక్షల మంది పౌరులకు కేవలం ఎంతమందే జడ్జిలున్నట్లు లా కమిషన్ నివేదిక పేర్కొంది ?
1. 19.40 మంది 2. 20.49 మంది
3. 21.49 మంది 4. 22.49 మంది

12. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మొత్తం 27 పతకాల (11 స్వర్ణం, 9 రజతం, 7 కాంస్యం)తో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది ?
1. మొదటి స్థానం 2. రెండవ స్థానం
3. మూడవ స్థానం 4. నాలుగవ స్థానం

13. క్రెడిట్ సూయిజ్ పరిశోధనా సంస్థ వెల్లడించిన నివేదికలో కుటుంబ కంపెనీలు అత్యధికంగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో నిలిచిన దేశం ఏది ?
1. మలేషియా
2. చైనా
3. ఫిలిప్పీన్స్
4. ఇండోనేషియా



14. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)లో ఏ దేశానికి అగ్రస్థానం దక్కింది ?
1. స్విట్జర్లాండ్ 2. నార్వే
3. దక్షిణ కొరియా 4. థాయ్‌లాండ్

15. అమెజాన్ వ్యవస్థాపకుడు, ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన జెఫ్ బెజోస్ ఎన్ని బిలియన్ డాలర్లతో దాతృత్వ నిధి నెలకొల్పారు ?
1. 1 బిలియన్ డాలర్లు 2. 2 బిలియన్ డాలర్లు
3. 3 బిలియన్ డాలర్లు 4. 4 బిలియన్ డాలర్లు

16. స్వచ్ఛ సర్వేక్షన్‌లో తెలంగాణలోని ఏ జిల్లా దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది ?
1. కరీంనగర్ 2. పెద్దపల్లి
3. జగిత్యాల 4. వరంగల్

17. యూఎస్ ఓపెన్ - 2018 గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ?
1. నయోమి ఒసాకా (జపాన్) 2. డొమినికా సిబుల్‌కోవా (స్లోవేకియా)
3. సెరెనా విలియమ్స్ (అమెరికా) 4. విక్టోరియా అజరెంకా (బెలారస్)

18. 2018 సెప్టెంబర్‌లో జపాన్‌ను కుదిపేసిన తుపాను ఏది ?
1. ఐకే తుపాను 2. జేబీ తుపాను
3. జీఎస్ తుపాను 4. ఎల్‌కే తుపాను

19. బహుముఖ సాహితీవేత్త బలివాడ కాంతారావు స్మారక జీవన సాహితీ పురస్కారానికి ఈ ఏదాదది (2018 ఎవరు ఎంపికయ్యారు ?
1. ఎస్వీ సత్యనారాయణ 2. ఆచార్య కొలకలూరి ఇనాక్
3. ఎ.ఎస్.జగన్నాథ శర్మ 4. సతీష్‌చందర్

20. రసాయనశాస్త్రంలో విశిష్ట పరిశోధనలు చేసినందుకు కెమికల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఆర్ఐ) ఎవరికి కాంస్య పతకాన్ని బహూకరించింది ?
1. డాక్టర్ చంద్రశేఖరం
2. అల్లోల దివ్యారెడ్డి
3. అన్నవరపు రామస్వామి
4. వీణా సహజ్‌వాలా

21. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) రూపొందించిన నివేదిక ప్రకారం అత్యంత చురుకైన ప్రజలున్న దేశం ఏది ?
1. ఉగాండా 2. సౌదీ అరేబియా 3. టర్కీ 4. ఇరాన్

22. వియత్నాం దేశ అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికయ్యారు ?
1. లీ మిన్హ్ హంగ్ 2. గుయెన్ ఫూ ట్రాంగ్
3. చు ఎగోక్ అన్హ్ 4. ట్రాన్హ్ హోవబిన్హ్

23. ఉత్తమ విశ్వవిద్యాలయాలకు సంబంధించి బ్రిటిష్ సంస్థ క్యూఎస్ నిర్వహించిన ఆసియా ర్యాంకింగ్ సర్వేలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఈ దఫా ఏ స్థానం దక్కింది ?
1. 104వ ర్యాంకు
2. 105వ ర్యాంకు
3. 106వ ర్యాంకు
4. 110వ ర్యాంకు

24. పర్యావరణ మార్పుల ప్రభావాలపై పోరాడేందుకు భారత్‌లోని తీర ప్రాంతాల వారికి ఎన్ని కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని ఐరాస అనుబంధ హరిత పర్యావరణ నిధి (జీసీఎఫ్) ప్రకటించింది ?
1. రూ.319 కోట్లు 2. రూ.329 కోట్లు
3. రూ.419 కోట్లు 4. రూ.429 కోట్లు

25. దేశంలో మత్స్య సంపద దిగుబడిని పెంపొందించడానికి ఎన్ని కోట్ల రూపాయలతో ప్రత్యేక 'మత్స్య, సముద్ర ఉత్పత్తుల మౌలిక వసతుల అభివృద్ధి నిధి'ని ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది ?
1. రూ.7,322 కోట్లు 2. రూ.7,422 కోట్లు
3. రూ.7,522 కోట్లు 4. రూ. 7,622 కోట్లు

26. ప్రపంచంలోనే అతిపెద్ద మానవరహిత ట్రాన్స్‌పోర్ట్ డ్రోన్‌ను చైనా విజయవంతంగా పరీక్షించింది. ఒకేసారి 1.5 టన్నుల మేరకు వస్తువులను రవాణా చేయగల దీని పేరేమి ?
1. 'ఫైహాంగ్-97' (ఎఫ్‌హెచ్-97) 2. 'ఫైహాంగ్-98' (ఎఫ్‌హెచ్-98)
2. 'ఫైహాంగ్-99' (ఎఫ్‌హెచ్-98) 4. 'ఫైహాంగ్-99' (ఎఫ్‌హెచ్-99)

27. ఫార్ములావన్ స్టార్, మెర్సిడెస్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ విశ్వవిజేతగా అవతరించాడు. హామిల్టన్ విశ్వవిజేతగా నిలవడం ఇది ఎన్నవసారి ?
1. ఐదోసారి 2. ఆరోసారి 3. ఏడోసారి 4. ఎనిమిదోసారి

28. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) బోర్డులో అదనపు స్వతంత్ర డైరెక్టరుగా ఎవరు నియమితులయ్యారు ?
1. అరుంధతి భట్టాచార్య 2. చందాకొచ్చర్
3. ఇంద్రానూయి 4. ప్రణీతరెడ్డి

29. క్షిపణుల అభివృద్ధిలో కీలకమైన హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) సంచాలకులుగా ఎవరు నియమితులయ్యారు ?
1. డాక్టర్ దశరథరామ్ 2. డాక్టర్ రిషద్ ప్రేమ్‌జీ
3. డాక్టర్ విజయ్ గోఖలే 4. డాక్టర్ భానుప్రతాప్ శర్మ

30. మానవుల అక్రమ రవాణాపై చేసిన పోరాటానికిగానూ ప్రవాస భారతీయురాలికి అమెరికా అధ్యక్షుడి పురస్కారం వరించింది. ఆమె పేరేమి ?
1. ఆర్.కె.అగర్వాల్ 2. ముకేశ్‌కుమార్
3. మినల్ పటేల్ దవీస్ 4. నీల్ ఛటర్జీ

31. ప్రపంచ టెన్నిస్ సమాఖ్య మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో వరుసగా రెండో ఏడాదిని అగ్రస్థానంతో ముగించింది ఎవరు ?
1. సెరెనా విలియమ్స్ 2. సిమోనా హలెప్
3. కరోలినా వోజ్నియాకి 4. వీనస్ విలియమ్స్

32. ది ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ సర్వే చేసి రూపొందించిన జాబితాలో ఆన్‌లైన్ (ఇ) చెల్లింపులు జరపడంలో ప్రభుత్వ పాత్రకు సంబంధించి భారతదేశానికి ఎన్నవ స్థానం దక్కింది ?
1. 27వ స్థానం 2. 28వ స్థానం
3. 29వ స్థానం 4. 30వ స్థానం

33. బ్రిటన్‌కు చెందిన 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్' సంస్థ విడుదల చేసిన సూచీలో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్ ఏ దేశానిదని తేలింది ?
1. సింగపూర్ 2. దక్షిణ కొరియా
3. జపాన్ 4. ఫిన్లాండ్

34. 250 సంస్థలతో ఫోర్బ్స్ రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత నమ్మదగిన కంపెనీల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది ఏది ?
1. మారియట్ ఇంటర్నేషనల్ 2. వాల్ డిస్నీ
3. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ 4. హిల్టన్

35. ప్రపంచంలోనే తొలిసారిగా పూర్తిస్థాయి హైపర్‌లూప్ రవాణా బోగీని అమెరికా సంస్థ 'హైపర్‌లూప్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీస్ (హైపర్‌లూప్ టీటీ)' అక్టోబర్‌లో ఎక్కడ ఆవిష్కరించింది ?
1. స్పెయిన్ 2. డొమినిక్ రిపబ్లిక్
3. మార్షల్ ఐలండ్స్ 4. న్యూజిలాండ్

36. ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ వ్యవసాయ విధాన నాయకత్వ పురస్కారం-2018 (గ్లోబల్ అగ్రికల్చర్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు 2018)కు ఎవరు ఎంపికయ్యారు ?
1. కె.చంద్రశేఖరరావు 2. చంద్రబాబునాయుడు
3. నితీశ్ కుమార్ 4. వసుంధర రాజె సింధియా

సమాధానాలు

1.2	2. 3	3. 1	4. 2	5. 3	6. 2
7. 2	8. 1	9. 3	10. 1	11. 1	12. 3
13. 2	14. 2	15. 2	16. 2	17. 1	18. 2
19. 3	20. 1	21. 1	22. 2	23. 3	24. 1
25. 3	26. 2	27. 1	28. 1	29. 1	30. 3
31. 2	32. 2	33. 3	34. 2	35. 1	36. 2

వైమానిక దళంలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

భారత వైమానిక దళం (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్)లో చేరేందుకు ఇంటర్/డిప్లొమా పూర్తిచేసిన అవివాహిత పురుష అభ్యర్థులకు సువర్ణావకాశం. ఎయిర్‌మెన్ హోదాలో గ్రూప్-ఎక్స్ ట్రేడ్, గ్రూప్-వై ట్రేడ్ ఉద్యోగాల భర్తీకి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఎంపికైన ఉద్యోగార్థులు ఆయా విభాగాల్లో కెరీర్ ప్రారంభించి మాస్టర్ వారంట్ ఆఫీసర్(ఎండబ్ల్యూఓ) ర్యాంకు పొందేందుకు వీలుంది. సర్వీసులో చేరిన అనంతరం నిర్దేశిత పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే కమిషన్డ్ ఆఫీసర్ అవకాశం అందుకోవచ్చు. ఎయిర్‌ఫోర్స్‌లో క్షేత్ర స్థాయి సాంకేతిక విధులు నిర్వర్తించడానికి గ్రూప్-ఎక్స్ ట్రేడ్ పోస్టులు, పాలన సంబంధిత పనుల్లో పాలు పంచుకునే సిబ్బందిని గ్రూప్-వై పోస్టులుగా పరిగణిస్తారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వీరి పాత్ర కీలకమైంది.

అర్హతలు..

గ్రూప్-ఎక్స్ పోస్టులు:

మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కలిపి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ చదివిన విద్యార్థులు అర్హులు. ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. (లేదా)

50 శాతం మార్కులతో మూడేళ్ల ఏదైనా ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు. ఇంగ్లిష్ సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు పొంది ఉండాలి. డిప్లొమాలో ఇంగ్లిష్ సబ్జెక్టు లేకపోతే ఇంటర్ లేదా పదోతరగతి ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి.

గ్రూప్-వై ట్రేడ్ :

కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులు. ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

గ్రూప్-వై మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ :

ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో 50 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులు. ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

గ్రూప్-ఎక్స్, గ్రూప్-వై రెండు ఉద్యోగాలకూ అర్హులైన విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపునకు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండూ గ్రూపులకు దరఖాస్తు చేసుకొని ఒకే పరీక్ష రాసే అవకాశముంది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఈ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

వయసు :

1999, జనవరి 19-2003, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. ఎత్తు కనీసం 152.5 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చితే చాతీ కనీసం 5 సెం.మీ. పెరగాలి. నిర్దేశిత వైద్య ప్రమాణాలు ఉండాలి.

ఎంపిక విధానం :

రెండు దశల్లో పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొదట దశలో ఆన్‌లైన్ టెస్టు నిర్వహిస్తారు.

గ్రూప్‌ఎక్స్ పోస్టులకు గంట వ్యవధితో ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ పేపర్లతో కూడిన టెస్టు ఉంటుంది. 10ం2 సీబీఎస్ఈ సిలబస్‌తో పేపర్‌ను సిద్ధం చేస్తారు.

గ్రూప్ వై ట్రేడ్ పోస్టులకు 45 నిమిషాల వ్యవధితో ఇంగ్లిష్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ సెక్షన్లతో కూడిన పేపర్ ఉంటుంది. రెండు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలడుగుతారు. పరీక్ష వ్యవధి 85 నిమిషాలు.

వెబ్‌సైట్‌లో..

అభ్యర్థులు https://airmenselection.cdac.in వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల పూర్తి సిలబస్, మోడల్ పేపర్లను చూడవచ్చు. వెబ్‌సైట్‌లో మాక్‌టెస్టు, సిలబస్, మోడల్ ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉన్నాయి.

గమనిక : రుణాత్మక మార్కులు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు, తప్పు సమాధానం గుర్తిస్తే 0.25 మార్కు కోత విధిస్తారు.

రెండో దశలో..

తొలిదశ పరీక్షకు సంబంధించిన హాల్‌టిక్కెట్‌ను మార్చిలో జారీ చేస్తారు. పరీక్ష జరిగిన 25 రోజుల తర్వాత ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఇందులో ఎంపికైన వారికి మరో హాల్‌టిక్కెట్ ఇస్తారు. అందులో పేర్కొన్న సమాచారం మేరకు నిర్దేశిత ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌కు సర్టిఫికెట్లతో వెళ్లాలి. వీటి పరిశీలన అనంతరం రెండో దశలో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్(పీఎఫ్‌టీ) ఉంటుంది. ఇందులో మొదట 1.6 కిలోమీటర్ల దూరాన్ని ఆరున్నర నిమిషాల్లో పూర్తిచేయాలి. అలాగే నిర్ణీత కాల వ్యవధిలో 10 పుషప్స్, 10 సిటప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి.

అడాప్టబిలిటీ టెస్ట్ :

పీఎఫ్‌టీలో అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్ట్ 1 నిర్వహిస్తారు. ఇది ఆబ్జెక్టివ్ తరహా రాత పరీక్ష. ఎయిర్‌ఫోర్స్‌లో చేరే అభ్యర్థులు పనిలో భాగంగా వివిధ ప్రాంతాల్లో, వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనికి అభ్యర్థులు సంసిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు అడాప్టబిలిటీ టెస్ట్ 1 నిర్వహిస్తారు. ఈ దశనూ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి అడాప్టబిలిటీ టెస్ట్ 2 నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇండియన్ ఎయిర్‌ఫోర్సు పని వాతావరణానికి అలవాటు పడగలరా, క్రమశిక్షణ గల మిలటరీ జీవన విధానానికి సర్దుకునేతత్వం ఉన్నదా? అనే విషయాన్ని పరిశీలిస్తారు. ఈ దశ దాటిన వారిని వైద్య పరీక్షల కోసం ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌లోనే మెడికల్ అపాయింట్‌మెంట్ లెటర్ జారీ చేస్తారు. తుదిగా వైద్య పరీక్షలు నిర్వహించి శిక్షణ కోసం ఎంపిక చేస్తారు.

ముఖ్య తేదీలు :

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : 2019, జనవరి 21.

దరఖాస్తు రుసుం : రూ.250.

పరీక్ష తేదీలు : 2019, మార్చి 14-17.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్స్ : https://airmenselection.cdac.in, www.careerindianairforce.cdac.in



12.53 ▲	1.75 ▲	10 ▲	బంగారం (విశాఖపట్నం)	0 ◀◀	వెండి (విశాఖపట్నం)	డాలరు
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	31,110	వెండి (విజయవాడ)	41,5 00	Vs
			ప్రొద్దుటూరు		ప్రొద్దుటూరు	రూపాయి
36,386.61	10,906.95	30,060	31,000	40,300	42,861	71.18
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
రిలయన్స్	1,184.35	4.40
విప్రో	346.15	3.21
కోటక్ మహీంద్ర	1,240.20	1.66
హిందాల్కో	209.40	1.36
హెచ్‌సీఎల్ టెక్	968.75	1.22

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
సన్‌ఫార్మా	390.75	-8.39
భారతీ ఎయిర్‌టెల్	311.15	-6.29
గెయిల్	322.15	-3.08
లార్సెన్	1,352.00	-2.09
హెచ్‌పీసీఎల్	245.35	-1.92

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.05	71.18
యూరో	81.00	81.10
పౌండ్	91.67	92.02
ఆస్ట్రేలియా డాలర్	50.93	51.18
సింగపూర్ డాలర్	52.42	52.49

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,110	33,272
చెన్నై	31,000	33,155
బెంగళూరు	30,500	32,620
ముంబై	31,820	34,032
విజయవాడ	-	33,500
విశాఖపట్నం	31,110	32,580
ప్రొద్దుటూరు	31,000	32,550
ముడి చమురు		61.18

స్వల్ప లాభాలతోనే ముగింపు



ముంబై : దలాల్ స్ట్రీట్ ఈ వారాంతాన్ని సామాన్యంగా ముగించింది. ఈరోజు ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారిపోయాయి. మళ్లీ చివరిలో కాస్త కోలుకుని స్వల్ప లాభాల్లోకి వచ్చాయి. సన్ ఫార్మా షేర్లు కుప్పకూలడం మార్కెట్లపై ప్రభావం చూపింది. ఈ కంపెనీ షేర్లు దాదాపు 11శాతం పడిపోయాయి. రిలయన్స్ షేర్లు దాదాపు నాలుగు శాతం లాభపడ్డాయి. ఉదయం సెన్సెక్స్ 60 పాయింట్లకు పైగా లాభంతో 36,400 పాయింట్ల వద్ద, నిఫ్టీ 14 పాయింట్ల లాభంతో 10,900 పాయింట్ల వద్ద ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు అన్నీ లాభాల్లోనే ఉన్నా అమ్మకాల ఒత్తిడితో ఆరంభ లాభాల నుంచి మార్కెట్లు నష్టాల్లోకి మళ్లాయి. సెన్సెక్స్ 100 పాయింట్ల నష్టంతో 36,273 వద్ద, నిఫ్టీ 31 పాయింట్లు క్షీణించి 10874 స్థాయికి చేరింది. సన్ ఫార్మా ప్రభావంతో హెల్త్‌కేర్ భారీ నష్టాలలో ఉండగా, ఐటీ, టెక్నాలజీ కౌంటర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా నిఫ్టీ 11వేల పాయింట్లకు చేరువలో ఉండడంతో వరసగా మూడు రోజుల పాటు లాభాలకు చెక్‌పడింది. చివరకు సెన్సెక్స్ 12.53 పాయింట్ల స్వల్ప లాభంతో 36,386.61 పాయింట్లకు చేరగా, నిఫ్టీ కూడా 1.80పాయింట్ల స్వల్ప లాభంతో 10,907 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ రిలయన్స్, విప్రో, కొటక్ మహీంద్రా, హిందాల్కో అదానీ పోర్ట్స్ తదితర కంపెనీల షేర్లు లాబపడ్డాయి. సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, గెయిల్, లార్సెన్, హెచ్‌పీసీఎల్ కంపెనీల షేర్లు నష్ట పోయాయి.

పెట్రోలు ధరలు పైపైకి..



ముంబై : దేశీయంగా తగ్గినట్టే తగ్గి వినియోగదారులను మురిపించిన ఇంధన ధరలు క్రమంగా పైపైకి ఎగబాకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల ప్రభావంతో జనవరి నుంచి మొదలుపెట్టి వరుసగా శుక్రవారం కూడా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర 8 పైసలు, డీజిల్ ధర 19 పెరిగింది. దీంతో ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.70.55కి.. డీజిల్ ధర రూ.64.97కి పెరిగింది. ముంబైలో పెట్రోలు ధర రూ.76.18, డీజిల్ రూ.68.02, చెన్నైలో పెట్రోల్ రూ.73.23 డీజిల్ రూ.68.62, కోలకతాలో పెట్రోల్ రూ.72.65, డీజిల్ రూ.66.74, హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.74.84, డీజిల్ ధరరూ.70.63 , విజయవాడలో పెట్రోల్ రూ.74.64 డీజిల్ రూ.70.05గా ఉంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 61.67 డాలర్ల వద్ద.. డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 52.87 డాలర్ల వద్ద ఉంది. ఈ నెలలో పెట్రోల్ ధర 9సార్లు, డీజిల్ ధర 10సార్లు పెరిగింది. దీంతో పైసా పైసా పెరుగతూ వస్తున్న ధరలు మళ్లీ పాత స్థితికి చేరుకుంటూ వుండటంతో వినియోగదారుల గుండెల్లో గుబులు మొదలైంది.

అమిత్‌షా తనయుడి ఇష్టారాజ్యం

- రెండేళ్లుగా ఆర్థిక నివేదికలు ఇవ్వని సంస్థ



న్యూఢిల్లీ: ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నివేదిక సమర్పించని కంపెనీలపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంసీఏ) కఠిన చర్యలు తీసుకునేందుకు పూనుకుంది. అయితే ఈ నిబంధన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కొడుకు జరు షా కంపెనీకి మాత్రం వర్తించకపోవడం గమనార్హం. ఎంసీఏ సమాచారం ప్రకారం.. కుసుమ్ ఫైన్‌సర్వ్ వరుసగా 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో ఆర్థిక నివేదికను అందించలేదని వెల్లడవుతున్నది. సాధా రణంగా ప్రతియేడాది అక్టోబర్ 30 కల్లా కంపెనీలు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్నర్‌షిప్(ఎల్ఎల్‌పీ)లు తమ ఫైనాన్షియల్ స్టేట్‌మెం ట్‌ను సమర్పిం చాల్సి ఉంటుంది. ఒక వేళ ఈ నివేదిక సమర్పిం చడంలో విఫలమైతే ఎల్ఎల్‌పీ యాక్ట్ కింద రూ. 5లక్షల జరిమానా కట్టాల్సి ఉంటుంది. గతేడాది జూన్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఓ ప్రకటనలో.. ఎంసీఏ పర్యవేక్షణలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్(ఆర్‌ఓసీ).. ఈ నివేదిక సమర్పించని 2.26లక్షల కంపెనీలను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి తొలగించినట్టు వెల్లడించింది. ఈ ఎంసీఏ డ్రైవ్‌లో భాగంగానే ఆర్‌ఓసీ సుమారు మూడు లక్షల మంది డైరెక్టర్లపై అనర్హత వేటువేసినట్టు తెలిపింది. అంతేకాదు రెండో దఫా డ్రైవ్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపడుతున్నట్టు ఆ ప్రకటన వివరించింది. కాగా, నివేదిక సమర్పించని కంపెనీలపై బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధం కాగా.. కుసుమ్ ఫైన్‌సర్వ్ మాత్రం కీలకమైన పత్రాలను సమర్పించకుండానే కొనసాగుతుండటం గమనార్హం. రెండేండ్లు వరుసగా ఆర్థిక నివేదిక సమర్పించలేదు. గతేడాది ఆగస్టులో ప్రచురితమైన ఓ పత్రిక కథనం ప్రకారం.. 2016కల్లా ఒక ప్రయివేటు బ్యాంక్, మరొక కో-ఆపరేటివ్ బ్యాంక్, ఒక ప్రభుత్వ సంస్థ నుంచి కుసుమ్ ఫైన్‌సర్వ్ రూ. 97.35 కోట్ల రుణ సదుపాయాన్ని పొందింది. ఇందులో అహ్మదాబాద్‌లో అమిత్ షా యాజమాన్యం కలిగిన రెండు స్థిరాస్తుల తనఖా కింద కలుపూర్ కమర్షియల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ నుంచి రూ. 25కోట్ల రుణాన్ని జరు షా కంపెనీ పొందింది. ఈ రెండు ప్లాట్ల ఓనరుగా అమిత్ షా అని కచ్చితంగా అందులో పేర్కొన్నారు. దీంతో కుసుమ్ ఫైన్‌సర్వ్‌కు అమిత్ షా ఆస్తి కాంటిజెంట్ లయబిలిటీగా ఉన్నట్టు అవగతమవుతుంది. విచిత్రంగా 2017లో రాజ్యసభ సీటు కోసం అమిత్ షా దాఖలు చేసిన ఎన్ని కల అఫిడవిట్‌లో దీని ప్రస్తావనే లేదు. ఇది రిప్రెజెంటే షన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ కింద నేరమవుతుంది. ఆయన నామినేషన్‌ను తిరస్కరించవచ్చు కూడా. గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2017లో జరు షా కంపెనీకి లీజు ఇచ్చిన 15,754.83 చదరపు మీటర్ల భూమి తనఖాపై కుసుమ్ ఫైన్‌సర్వ్ రూ. 17కోట్ల రుణాన్ని పొందింది. సనంద్ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌లోని లీజుకు ఇచ్చిన ఈ భూమిలో ప్రస్తుతం ఓ ఫ్యాక్టరీ ఉంది. బ్యాంకు దస్తావేజులు.. ఆ ఫ్యాక్టరీ పీపీ, హెచ్‌డీపీఈ, జంబో బ్యాగ్‌లను తయారు చేస్తున్నట్టుగా పేర్కొంటుండటం గమనార్హం. అయితే ప్రస్తుతం జరు షా కంపెనీ నెట్‌వర్త్, మ్యానుఫాక్చరింగ్ సదుపాయం పొందడంపైనా ఆ కంపెనీ ఆర్థిక నివేదిక సమర్పిస్తేనే పూర్తి స్పష్టత వస్తుంది. అయితే ఈ నివేదిక సమర్పించడంలో కుసుమ్ ఫైన్ సర్వ్ విఫలమైనందుకు ఏవైనా చర్యలు తీసుకున్నారా అనే విషయాన్ని ఆరా తీసేందుకు అహ్మదాబాద్ ఆర్‌ఓసీ, జరు షాలనూ సంప్రదించగా.. సమాధానం రాలేదని 'ది కారవాన్' పత్రిక తెలిపింది.

విజ్ఞానం

అంతరిస్తున్న కాఫీ జాతులు



వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, పలు జబ్బులతో ప్రపంచంలోని సగానికిపైగా అటవీ కాఫీ జాతులు ప్రమాదంలో పడినట్లు తాజా అధ్యయనంలో వెల్లడైన విషయం. ముఖ్యంగా ప్రముఖమైన 124కాఫీ స్పీసీస్‌పై యుకె ఆధారిత రాయల్ బొటానికల్ గార్డెన్స్ చేపట్టిన అధ్యయనంలో సమారు 75(60శాతం) కాఫీ జాతులు(స్పీసీస్) రిస్క్‌ను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. వీటిలో 13 స్పీసీస్ మరింత అపాయకర పరిస్థితుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ సంరక్షణకోసం ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు దీర్ఘకాలంలో కాఫీ జాతులను నిర్వీర్యం చేయకుండా కాపాడలేవని తెలుస్తోంది. కొన్ని రకాల కాఫీ జాతులు 100ఏళ్లకన్నా మించవని వెల్లడైంది. వాతావరణ కాలుష్యంతో ప్రపంచ ప్రసిద్ధమైన కప్ ఆఫ్ జో, కాఫీ అరబికా జాతుల పరిస్థితి ముప్పుగానేఉంది. ఆఫ్రికాలో అతిపెద్ద కాఫీ ఉత్పత్తిదారు అరబికా క్రాప్ 2080నాటికి 85శాతం తగ్గుతుందని తేలింది. కాఫీ సాగుకు వినియోగించే 60శాతం భూమి ఈ శతాబ్దం నాటికి ఉపయోగించడం సాధ్యంకాదు. దీనిపై సుమారు 15మిలియన్లమంది ఆధారపడిఉన్నారు.

యాప్స్ వాడకంలో మనమే ముందు



న్యూఢిల్లీ : భారత్‌లో మొబైల్ ఇంటర్నెట్ వాడకం జోరుమీద ఉంది. 2016-2018 కాలంలో భారత్‌లో యాప్‌ల డౌన్‌లోడ్ అలాగే వాడకం అగ్రదేశా లతో సమానంగా ఉందని తెలుస్తుంది. ఫుడ్ డెలివరీ, ఫైనాన్స్‌తో పాటూ అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి వీడియో స్ట్రీమింగ్ యాప్‌ల డౌన్‌లోడ్‌లు అత్యధికంగా జరుగుతున్నట్లు, యాప్ డేటా సేరకించే 'యాప్ యన్నీ' అనే సంస్థ తన సర్వేలో తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం యాప్ డౌన్‌లోడ్లు చైనాలో జరుగుతుంటాయి. అయితే చైనా ఈ రెండేళ్ల కాలంలో 70 శాతానికి చేరుకోగా తరువాత ఇండోనేషియా 55 శాతంతో ఉంది. కానీ భారత్‌లో ఫుడ్ డెలివరీ యాప్‌ల డౌన్‌లోడ్‌లు 900 శాతం పెరిగినట్లు, అన్ని దేశాలకంటే ఇది అత్యధికంగా ఉందని తెలిపింది. ఫైనాన్స్ యాప్‌లనూ భారతీయులు భారీగా డౌన్‌లోడ్ చేసినట్లు అవి 200 శాతం ఉన్నట్లు అమెరికా, జర్మనీలో అది 50 శాతమే ఉన్నట్లు తెలిపింది. ఫైనాన్స్ యాప్‌లో భాగంగా భారత్‌లో ఎక్కువగా బ్యాంక్ యాప్‌ల వాడకం పెరిగిందని తెలిపింది. ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ల వాడంకంలోనూ భారత్ అమెరికా, కొరియాలను దాటేసిందని కానీ చైనా కంటే కాస్త వెనుకబడి ఉందని తెలిపింది. వీడియో స్ట్రీమింగ్ యాప్‌ల్లో భారతీయులు గడిపే సమయం 185 శాతం పెరిగిందని దక్షిణ కొరియాలో 155 శాతం ఉండగా బ్రెజిల్‌లో 130 శాతం అని, భారతీయులు 45 బిలియన్ గంటలు వీడియో స్ట్రీమింగ్‌లో గడిపినట్లు సర్వే సంస్థ తెలిపింది. అయితే పేయిడ్ యాప్స్‌పై భారత్‌లో ఆదరణ లేదని, యాప్‌లు కొనేందుకు భారతీయులు మొగ్గు చూపడం లేదని తెలిపింది.

జొమాటోతో కలిసిన పేటీఎం



న్యూఢిల్లీ : చెల్లింపుత యాప్ పేటీఎం ద్వారా ఇక ఆహార పదార్థాలు కూడా ఆర్డర్ చేసుకోవచ్చు. ఇందుకోసం పేటీఎం ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమా టోతో చేతులు కలిపింది. ఈ విషయాన్ని పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ వెల్లడించింది. జొమాటో సహకారంతో పేటీఎం యాప్ ద్వారా ఆహార పదార్థాలు ఆర్డర్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఈ సేవలు ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఆండ్రాయిడ్ పరికరాల్లో మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలో భారతదేశ వ్యాప్తంగా తమ సేవలు ప్రారంభిస్తామని పేటీఎం వెల్లడించింది. అలాగే ఐఓఎస్ పరికరాల యాప్‌లకు కూడా ఈ సేవలు అందుబాటులోకి తెస్తామని తెలిపింది. ఈ నెలాఖరు వరకు వంద నగరాల్లోని 80వేల రెస్టారెంట్ల పరిధిలో ఫుడ్ ఆర్డర్ సర్వీసును ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేటీఎం వెల్లడించింది. పేటీఎంకు ఇప్పటికే టైర్-2, టైర్-3 నగరాల్లో చాలా మంది వినియోగదారులు ఉన్నారు. ప్రారంభ ఆఫర్‌గా పేటీఎం యాప్ నుంచి ఆర్డర్లపై రూ.100 వరకు క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది. జొమాటో గత ఏడాది నవంబరు నాటికి దాని సేవలను మరో 30 నగరాలకు విస్తరించింది. ఇప్పుడు వంద నగరాల్లో 80వేల రెస్టారెంట్లు దీని పరిధిలో ఉన్నాయి.

సన్ ఫార్మా షేర్లు పతనం



ముంబై : ఫార్మా రంగ దిగ్గజం సన్ ఫార్మా షేరు శుక్రవారం భారీగా పతనాన్ని నమోదు చేసింది. అతిపెద్ద ఔషధ తయారీ కంపెనీ కార్పొరేట్ పాలనపై సెబీకి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఇంట్రాడేలో సన్‌ఫార్మా ఏకంగా 13 శాతానికి పైగా నష్టపోయి, భారీగా నష్టాలను చవిచూసింది. దీంతో 6 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరింది. సన్ ఫార్మా షేరు విలువ పడిపోవడంతో ఫార్మా ఇండెక్స్ కూడా పతనమైంది. గురువారం నాటి సెషన్‌లో 5శాతానికి పైగా నష్టపోయిన సన్‌ఫార్మా షేర్లు.. శుక్రవారం కూడా భారీ నష్టాల్లో సాగుతున్నాయి. ఆరంభ ట్రేడింగ్‌లో కంపెనీ షేరు విలువ 12శాతానికి పైగా నష్టంతో ఆరేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. క్షణాల వ్యవధిలోనే కంపెనీ తన మార్కెట్ విలువలో రూ. 12,400కోట్లకు పైగా కోల్పోయింది. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో సన్‌ఫార్మా షేరు విలువ 9.75శాతం నష్టంతో రూ. 385.50గా, మార్కెట్‌లు ముగిసే సమయానికి సన్‌ఫార్మా 8.39 శాతం నష్టంతో 390.75 దగ్గర నమోదైంది. సెబీకి అందిన ఫిర్యాదు మేరకు సంస్థకు సంబంధించి అనేక కీలకమైన అవకతవకలు వెలుగు చూశాయి. దీంతో ఇప్పటికే ప్రమోటర్లపై నమ్మకం కోల్పోతున్న తరుణంలో మరో వార్త సన్ ఫార్మాపై కోలుకోలేని దెబ్బగా పరిణమించబోతోంది. వివరాల ప్రకారం ఆదిత్య మెడీసేల్స్ అనే సోల్ డిస్ట్రిబ్యూషన్ సంస్థను సన్ ఫార్మా ప్రమోటర్లు దిలీప్ సంఘ్వీ, సునీల్ వాడియా ఏర్పాటు చేసి దాని ద్వారా అమ్మకాలు కొనసాగిస్తున్నారని తేలింది. 2014 నుంచి 2017 మధ్యకాలంలో ఆదిత్య మెడిసేల్స్ కంపెనీ.. సన్ ఫార్మా సహ వ్యవస్థాపకుడు సుధీర్ వలియాకు నియంత్రణలోని సురక్ష రియల్టీ మధ్య రూ.5,800 కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయని, వీటికి తోడు ఆదిత్య మెడీ ద్వారా సురక్షా రియాల్టీ అనే సంస్థతో కలిసి సుమారు ఐదారువేల కోట్ల లావాదేవీలు జరిపినట్టు మనీ లైఫ్ ప్రచురించింది. సంస్థ ప్రమోటర్లుగా సన్ ఫార్మాను అడ్డం పెట్టుకుని ప్రమోటర్లు వ్యక్తిగత వ్యాపారాలను కొనసాగిస్తున్నారంటూ ఒక వ్యక్తి సెబీకి ఫిర్యాదు చేశారు. ర్యాన్‌బాక్సీ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సెబీకి ఫిర్యాదు చేసిన వ్యక్తే సన్ ఫార్మాపై తాజాగా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దిలీప్ సంఘ్వీ సహా అతని బావమరిది సుధీర్ వాలియాపై సెబీకి 172 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. ఈ వ్యవహారంలో అనేక సాక్ష్యాధారాలను అందిన నేపథ్యంలో సెబీ దర్యాప్తునకు ఆదేశించినట్టు సమాచారం.

విప్రో డిసెంబర్ క్వార్టర్ లాభం రూ.2,510 కోట్లు



బెంగళూరు : దేశీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజం విప్రో 2018 అక్టోబర్- డిసెంబర్ క్వార్టర్ లాభాలను ప్రకటిం చింది. ఈ క్వార్టర్‌లో రూ. 2,510 కోట్ల లాభాలను అర్జించినట్లు ప్రకటించింది. గత క్వార్టర్‌లో లాభాలు రూ.1,889 కోట్లు కాగా ఈ క్వార్టర్‌లో అది 33 శాతం పెరిగినట్లు తెలిపింది. కంపెనీ రెవెన్యూ 10.2 శాతం పెరగగా, ఐటీ విభాగం రెవెన్యూ 13 శాతం పెరిగినట్లు తెలిపింది. కంపెనీ బోర్డు బోనస్ ఈక్విటీ షేర్లను 1:3 నిష్పత్తిలో జారీ చేస్తున్నట్లు తెలిపింది. షేర్‌కు రూ.1 ఇన్‌టర్మ్ డివిడెంట్‌ను కూడా కంపెనీ ప్రెకటించింది. జనవరి 30ని డివిడెంట్‌కు రికార్డు తేదీగా నిర్ణయించింది. అలాగే ఫిబ్రవరి 6 లేదా అంతకంటే ముందే ఇన్‌టర్మ్ డివిడెంట్‌ను చెల్లించను న్నట్లు తెలిపింది. లాభాలు ప్రెకటించిన అనంతరం విప్రో షేరు విలువ స్టాక్ మార్కెట్‌లో 2.91 శాతం లాభంతో రూ. 346.20 దగ్గర ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభాల బాట

క్యూ3లో 9 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ, జనవరి: ఎఫ్ఎంసీజీలో అతిపెద్ద సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ యునీలీవర్(హెచ్‌యూఎల్) ఆర్థిక ఫలితాలు ఆకట్టుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసి కానికి గాను సంస్థ రూ.1,444 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి నమోదైన రూ.1,326 కోట్ల లాభంతో పోలిస్తే 9 శాతం వృద్ధి కనబరిచింది. అమ్మకాలు పెరుగడం, మార్జిన్లు అధికమవడం ఇందుకు దోహదం చేశాయి. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 12.42 శాతం ఎగబాకి రూ.9,357 కోట్లకు చేరుకున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. విలువ పరంగా చూస్తే దేశీయ అమ్మకాల్లో 13 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఎబిటా మార్జిన్లు 170 బేసిస్ పాయింట్లు అధికమయ్యాయని కంపెనీ సీఎండీ సంజీవ్ మెహతా తెలిపారు. గత త్రైమాసికంలో సంస్థ అన్ని రంగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిందని, అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదైందన్నారు. సమీక్షకాలంలో నిర్వహణ ఖర్చులు రూ.7,036 కోట్ల నుంచి రూ.7,652 కోట్లకు పెరిగాయి. రంగాల వారీగా చూస్తే హోమ్ కేర్ విభాగం నుంచి రూ.3,148 కోట్ల ఆదాయం సమకూరగా, పర్సనల్‌కేర్ ఉత్పత్తుల ద్వారా రూ.4,539 కోట్లు, ఆహార రంగాల నుంచి రూ.1,728 కోట్ల ఆదాయం లభించినట్లు వెల్లడించింది. స్వల్పకాలంపాటు డిమాండ్ నిలకడగా ఉండే అవకాశం ఉందన్న ఆయన..దేశ ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

సెంట్రల్‌లో 50 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఫ్యాషన్ బ్రాండ్ సెంట్రల్ శనివారం రెడ్ హౌట్ పేరుతో 50 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపింది. అదే విధంగా ఫ్యూచర్ పే ద్వారా లభించే వారి సెంట్రల్ వాలెట్‌లో రూ.3000 కనీస కొనుగోలుతో 50 శాతం క్యాష్ బ్యాక్ పొందవచ్చని పేర్కొంది. ఈ రెడ్ హౌట్‌తో విస్తృత శ్రేణి ఉత్పత్తులపై వినియోగ దారులు అదనపు ప్రయోజనాలు పొందవచ్చని తెలిపింది.

ఎయిర్ ఇండియా భవంతిపై మరాఠా సర్కార్ కన్ను

ముంబై, జనవరి: దక్షిణ ముంబైలోని ఎయిర్ ఇండియా చారిత్రక భవంతిని మహారాష్ట్ర సర్కార్ దక్కించుకునే అవకాశాలున్నాయి. నారిమన్ పాయింట్ వద్ద మరైన్ డ్రైవ్‌లో ఉన్న ఈ 23 అంతస్తుల భవంతి నుంచి ఎయిర్ ఇండి యా కార్యకలాపాలను 2013 నుంచి నిర్వహిస్తున్నది. 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ భవంతిని కొనుగోలు చేయడానికి ఇటీవల బిడ్డింగ్‌ను సమర్పించినట్లు ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూషణ్ గాగ్రానీ తెలిపారు.

మెటీరియల్ ఖర్చుతో డెంటల్ ఇంప్లాంటేషన్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హ్యాపీ స్మైల్ హాస్పిటల్ స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా డెంటల్ ఇంప్లాంటేషన్ చరిత్రలోనే నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టామని ఎస్వీ హ్యాపీ స్మైల్ మల్టీస్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్స్ అండ్ ఇంప్లాంట్స్ సెంటర్ అధినేత, ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ ఎ.చంద్రశేఖర్ తెలిపారు. హాస్పిటల్ 10వ వార్షికోత్సవం సందర్భంగా కేవలం మెటీరియల్ ఖర్చుతో డెంటల్ ఇంప్లాంటేషన్ చికిత్సలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హ్యాపీ స్మైల్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మొదటగా రిజిస్ట్రేషన్ చేసుకొన్న రెండు వేల మందికి ఉచిత కన్సల్టేషన్, అవసరమైనవారికి ఉచిత ఓరల్‌ఎక్స్ రే, రాయితీతో కూడిన డెంటల్ ఇంప్లాంటేషన్ చికిత్సలను నిర్వహిస్తామని చెప్పారు. ఇంప్లాంటేషన్ అవసరమైన వారికి కేవలం మెటీరియల్‌కయ్యే ఖర్చుతో ఇంప్లాంటేషన్ చేస్తామని తెలిపారు. మిగిలిన ఖర్చును హ్యాపీ స్మైల్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ భరిస్తుందని అన్నారు. దంత సంరక్షణపై అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, వివిధ పాఠశాలల్లోని చిన్నారుల కోసం ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎ.రేఖ, డాక్టర్ కె.శ్రవణ్ కుమార్, డాక్టర్ నితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ సైక్లింగ్ అలయెన్స్ ప్రారంభం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా సైక్లింగ్‌ను ప్రోత్సాహించడంలో భాగంగా అన్ని సైక్లింగ్ అసోసియేషన్‌లకు ప్రాతినిధ్యం వహిస్తూ వరల్డ్ సైక్లింగ్ అలయెన్స్ (డబ్ల్యూసీఏ) సంస్థ ఏర్పాటైంది. భారత దేశం నుంచి ఆల్ ఇండియా బైసైక్లింగ్ ఫెడరేషన్‌తో పాటు మరికొన్ని ఇతర జాతీయ సైక్లింగ్ వ్యవస్థలు కూడా ఇందులో భాగస్వామ్యం కానున్నాయని డబ్ల్యూసీఏ అధ్యక్షుడు రలుకా ఫైసర్ తెలిపారు. ప్రభుత్వేతర సంస్థలు తమ పిలుపుతో సైక్లింగ్ చేయడాన్ని ప్రజల్లో పెంపొందించడం, మెరుగుపరచడంలో సమర్థంగా కృషిచేస్తున్నటువంటి అంతర్జాతీయ అత్యుత్తమ ప్రయత్నాలను ఏకీకృతం చేయడమే వరల్డ్ సైక్లింగ్ అలయెన్స్ యొక్క లక్ష్యమన్నారు. 2030 యూఎన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలను సాధించడానికి సైక్లింగ్ సామర్థ్యాలు సహాయపడతాయని డబ్ల్యూసీఏ బలంగా నమ్ముతోందన్నారు. విద్య, ఉద్యోగిత, ఆరోగ్య సంరక్షణ, సామాజిక సంబంధాల లభ్యతను పెంపొందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా జీవితాలలో మార్పును తీసుకురావడంలో ఉపయోగపడే ఒక సమగ్రమైన విశ్వ సాధనమని తెలిపారు. డబ్ల్యూసీఏ ఉపాధ్యక్షుడు, కోశాధికారి డీపీ మనోహర్ మాట్లాడుతూ సైక్లింగ్ అనేది సమాజ పర్యావరణాన్ని సంరక్షించే ఒక పరిష్కారమన్నారు.

రూ.700 కోట్ల పెట్టుబడులకు సిద్ధం

జెట్ ఎయిర్‌వేస్ చైర్మన్ నరేష్ గోయల్

న్యూఢిల్లీ: ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న జెట్ ఎయిర్‌వేస్‌ను ఆదుకోవడానికి రూ.700 కోట్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ చైర్మన్ నరేష్ గోయల్ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తెలియచేశారు. కానీ కంపెనీలో తన వాటా 25 శాతం తగ్గకుండా ఉండేందుకోసమే ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించారు. కంపెనీలో వ్యూహాత్మక భాగస్వామి అయిన ఎతిహాద్..కంపెనీ నాయకత్వ బాధ్యతల నుంచి గోయల్ తప్పుకోవాలని షరతు విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్‌కు రాసిన లేఖలో సంస్థలో తనకున్న షేర్లను తాకట్లో పెట్టి రూ.700 కోట్ల వరకు నిధులు చొప్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కానీ ఈ మొత్తంతో కంపెనీలో తన కున్న వాటా 25 శాతం తగ్గకుండా చూడాలని షరతు విధించారు.

మీ వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ ఎవరికైనా కనిపించకుండా
దాచాలనుకుంటున్నారా...?



సోషల్ మీడియాలో ప్రముఖ ఇన్‌స్టెంట్ మెసేజింగ్ సంస్థ వాట్సప్ ఈ మధ్య కొత్తగా కొన్ని ఫీచర్లను విడుదల చేసింది. ఇప్పటికే అనేక రకాల ఫీచర్లను విడుదల చేసింది. ఇందులో వాట్సప్ గ్రూప్ వాయిస్, వీడియో కాలింగ్, స్టిక్కర్స్ ఫీచర్, ఛాటింగ్ ఫీచర్లు, ఇంకా అధునాతన ఫీచర్లను జోడించి వినియోగదారులకు అందుబాటులో ఉంచింది. అయితే వాట్సప్ వాడుతున్నవారు వారి ప్రొఫైల్ పిక్చర్‌ని పర్టికులర్ కాంటాక్ట్‌కి కనిపించకుండా customise profile picture privacy settings అనే డైరెక్ట్ ఆప్షన్ లేదు. ఉన్న ఒకేఒక ఆప్షన్ ఆ వ్యక్తిని బ్లాక్ చేయడమే .అయితే వారిని పూర్తిగా బ్లాక్ చేయకుండా కూడా మనం పెట్టే స్టేటస్ కానీ మన ప్రొఫైల్ పిక్చర్ కాని కనపడకుండా ఉండేలా చేయవచ్చు. అది ఎలాగో తెలుసుకుందాం.



స్టెప్ 1 :

కాంటాక్ట్‌ను డిలీట్ చేయండి

- మీ మొబైల్‌లో ఉన్న కాంటాక్ట్ యాప్‌ను ఓపెన్ చేయండి
- మీ ప్రొఫైల్ పిక్చర్ ఎవరికైతే కనిపించకుండా ఉండాలో వారిని సెర్చ్ చేయండి
- ఇప్పుడు మీ కాంటాక్ట్‌లో ఆ నెంబర్ ను డిలీట్ చేయండి

స్టెప్ 2 :

వాట్సాప్‌లో ప్రైవసీ సెట్టింగ్స్‌ను చేంజ్ చేయండి

- మీ మొబైల్‌లో వాట్సాప్‌ను ఓపెన్ చేయండి
- టాప్ రైట్ కార్నెర్‌లో ఉన్న మూడు ధాట్స్‌ను క్లిక్ చేయండి
- 'Settings' ను సెలెక్ట్ చేసి 'Account' అనే ఆప్షన్‌కి వెళ్ళండి
- ఇప్పుడు 'Privacy' సెట్టింగ్స్‌కు వెళ్ళండి
- 'Profile photo' అనే ఆప్షన్ ను నొక్కి 'My contact' అనే ఆప్షన్‌ను సెలెక్ట్ చేయండి

ఇతర వ్యక్తులకు...

ఇతర వ్యక్తులకు కూడా మీ ప్రొఫైల్ పిక్చర్‌ను హైడ్ చేయడానికి ఈ స్టెప్ 1, స్టెప్ 2ను రిపీట్ చేయండి

నోట్ :

- మీ కాంటాక్ట్స్‌లో ఆ వ్యక్తి నెంబర్‌ను డిలీట్ చేయకుండా కేవలం మీ ప్రొఫైల్ పిక్చర్‌ని మాత్రమే దాచాలి అనుకుంటే profile picture privacy settings లో 'Nobody' అనే ఆప్షన్‌ను క్లిక్ చేయండి. అయితే ఈ ఆప్షన్ వల్ల మీ ప్రొఫైల్ పిక్చర్ మీ వాట్సాప్‌లో ఉన్న ఇతర కాంటాక్ట్స్‌కి కూడా కనిపించదు.

డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆధార్ కార్డ్‌తో లింక్ చేసుకోండిలా..

మన జీవితంలో ఆధార్ అనేది కీలక గుర్తింపుగా మారిపోయింది. తాజా రిపోర్ట్ ప్రకారం UIDAI, కేంద్ర ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడం తప్పనిసరి చేస్తుంది. డ్రైవింగ్ లైసెన్స్‌కు అధార్ కార్డుని లింక్ చేయడం వలన నకిలీ డ్రైవింగ్ లైసెన్స్‌లకు చెక్ పెట్టడానికి, రోడ్డు ప్రమాదాల కేసులను త్వరగా విచారణ జరపడానికి సులువుగా చేస్తుంది. డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆధార్ కార్డుతో నాలుగు దశల్లో లింక్ చేసుకునే విధానం గురించి తెలుసుకుందాం.



స్టెప్ 1:

వెబ్‌సైట్ హోం పేజీలో ఎడమవైపున ఆధార్ నెంబర్ ఎంట్రీ అనే ఆప్షన్ ఉంటుంది. అందులో ఆధార్ నెంబర్ ఎంట్రీ ఆప్షన్ సెలక్ట్ చేసుకోండి.

స్టెప్ 2:

ఆధార్ డిటైల్స్ ఎంట్రీ అనే పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ సెలక్ట్ సెర్చ్ ఎలిమెంట్ బాక్సులో రిజిస్ట్రేషన్ నెంబర్ లేదా లైసెన్స్ ఆప్షన్స్‌లో ఒక దానిని ఎంచుకుని, రిజిస్ట్రేషన్ నెంబర్ బాక్సులో డ్రైవింగ్ లెసెన్స్ నెంబర్ ఎంటర్ చేసి గెట్ డిటైల్స్ మీద క్లిక్ చేయాలి.

స్టెప్ 3:

డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన డిటైల్స్‌తో పాటు కింది వైపున ఆధార్, మొబైల్ నెంబర్ కాలమ్ కనిపిస్తుంది. ఇక్కడ 12 అంకెల ఆధార్ నెంబర్ తోపాటు 10 అంకెల మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి సబ్‌మిట్ బటన్ నొక్కాలి.

స్టెప్ 4:

మొబైల్ నెంబర్‌కు వచ్చిన నాలుగు అంకెల వన్ టైమ్ పాస్‌వర్డ్ ఎంటర్ చేసి కన్‌ఫర్మ్ చేంజెస్ అనే ఆప్షన్ నొక్కగానే మీ ఆధార్ నెంబర్ డ్రైవింగ్ లైసెన్స్‌తో లింక్ అయిపోతుంది.

మీ స్మార్ట్‌ఫోన్‌లో ఫైల్స్‌ని దాచడం ఎలా ?





ఈ రోజుల్లో ఫోన్ లో డేటా అనేది చాలా సీక్రెట్ గా ఉంచుకోవాల్సిన పరిస్థితి ఉంది. మన ఫోన్లో ఎన్నో రహస్యాలు మనం దాచిపెడుతుంటాము. ఎదుటివారు మన ఫోన్ తీసుకున్నప్పుడు మన ఫోన్లో ఫోటోలు, వీడియోలు అన్నీ సెర్చ్ చేస్తుంటారు. దీని వల్ల అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశం కూడా ఉంది. ముఖ్యంగా మన ఫ్యామిలీ మెంబర్స్ మన ఫోన్ తీసుకున్నప్పుడు మన ఫోన్లోని డేటా వారికి కంటపడితే ఒక్కోసారి కొంప కొల్లేరు అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇలాంటి వాటి నుండి మనం బయట పడటం ఎలా అనే విషయాల మీద అందరూ సెర్చ్ చేస్తుంటారు. ఈ శీర్షికలో భాగంగా మీకు కొన్ని ట్రిప్స్‌ను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

ట్రిక్ 1 :

హిడెన్ ఫోల్డర్ క్రియేట్ చేసుకోండి

మీరు ముందుగా ఓ హిడెన్ ఫోల్డర్ క్రియేట్ చేసుకుని అందులోకి గ్యాలరీ, వాట్సప్, మీడియా ప్లేయర్స్, ఈమెయిల్ ఛాటింగ్, ఆఫీసు ఎడిటర్స్‌ను పంపేయండి.

ఇందుకోసం మీరు ముందుగా ఓపెన్ ఫైల్ మేనేజర్ యాప్స్‌ని మీ స్మార్ట్ ఫోన్‌లో ఓపెన్ చేయండి.

క్రియేట్ న్యూ ఫోల్డర్ ఆప్షన్ ఎంపిక చేసుకోండి

ఆ ఫోల్డర్‌కి మంచి నేమ్ సెట్ చేసుకోడి.

నేమ్‌కి ముందు ఆ ఫోల్డర్‌లో డాట్ (.)ని యాడ్ చేయాలి. అప్పుడే ఫోల్డర్ హిడెన్ అవుతుంది.

ఇప్పుడు రహస్యంగా దాచుకోవాల్సిన ఫైల్స్‌ని అందులోకి ట్రాన్స్‌ఫర్ చేయండి.

ఫోల్డర్‌ని హైడ్ చేసుకోండి

ఇక రెండో విషయానికొస్తే క్రియేట్ చేసుకున్న ఫోల్డర్‌ని హైడ్ చేయడం ఎలా అనేది తెలుసుకుందాం. దీని కోసం ఈ స్టెప్స్‌ను అనుసరించండి.

మీ స్మార్ట్ ఫోన్‌లో ఫైల్ మేనేజర్ యాప్‌ని ఓపెన్ చేయండి

మీరు హైడ్ చేయాలనుకున్న ఫోల్టర్‌ని నేవిగేట్ చేయండి.

ఆ ఫోల్డర్ ఓపెన్ చేసి క్రియేట్ న్యూ ఫైల్ సెలక్ట్ చేసుకోండి.

ఇప్పుడు . NoMEDIA అని ఫైల్ నేమ్ ఇవ్వండి

అది అయిపోయిన తరువాత మీ ఫోన్ ఫైల్ మేనేజర్ క్లోజ్ చేసిన తరువాత రీ స్టార్ట్ చేయండి.

ఇప్పుడు మీ ఫోల్డర్ హిడెన్ అవుతుంది.

Show hidden files

ఈ ప్రాసెస్ పూర్తి అయిన తరువాత హిడెన్ ఫైల్‌ను మనం ఎలా చూసుకోవాలి అనే దానిపై ఈ పద్ధతులను అనుసరించండి.

ఫైల్ మేనేజర్ యాప్ ఓపెన్ చేసి సెట్టింగ్స్‌లో కెళ్లి Show hidden filesని టర్న్ ఆన్ చేయండి. అక్కడ వ్యూ అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేయండి.

ఈ ప్రాసెస్‌లో మీరు ఆ ఫోల్డర్ ని డిలీట్ చేయాలనుకుంటే వెంటనే చేయవచ్చు.



'భారతీయుడు' తొలి ఛాయిస్ రజనీనే.. !

నాగార్జున, వెంకటేశ్, రాజశేఖర్‌లను కూడా అనుకున్నారట

విలక్షణ నటుడు కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన 'భారతీయుడు' చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. లంచగొండితనానికి వ్యతిరేకంగా 1996లో దర్శకుడు శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా మూడు జాతీయ అవార్డులు అందుకుంది. అయితే ఈ సినిమా కోసం తొలుత శంకర్.. సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను అనుకున్నారట. ఆయన ప్రాజెక్టును వద్దనుకోవడంతో కమల్‌ను తీసుకున్నట్లు 'భారతీయుడు'కు సహాయ దర్శకుడిగా పనిచేసిన వసంత బాలన్ తాజాగా గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ చేశారు. శంకర్ తొలి సినిమా 'జెంటిల్‌మేన్'తో ఇంప్రెస్ అయిన రజనీ ఆయన్ను కొత్త స్క్రిప్టు అడిగినట్లు వసంత బాలన్ చెప్పారు. తర్వాత తలైవా కోసం శంకర్ 'పెరియా మనుషన్' పేరుతో స్క్రిప్టును సిద్ధం చేశారని, రజనీకి ఈ కథ నచ్చినప్పటికీ.. అప్పటికే వేరే సినిమాలకు సంతకం చేయడంతో బిజీ అయ్యారన్నారు. ఆ తర్వాత కమల్‌ను శంకర్ కలిశారని.. కమల్ ఒప్పుకోవడంతో టైటిల్‌ను 'భారతీయుడు'గా మార్పుచేసి తీసినట్లు వసంత బాలన్ వివరించారు. అంతేకాదు సినిమాలో కుమారుడి పాత్రకు నాగార్జున లేదా వెంకటేశ్, తండ్రి పాత్రకు రాజశేఖర్‌ను తీసుకునేందుకు చర్చలు కూడా జరిగినట్లు ఆయన చెప్పారు. 'భారతీయుడు' సీక్వెల్ 'భారతీయుడు 2' షూటింగ్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. శంకర్ ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఇందులో 'సేనాపతి' (కమల్) పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటించనున్నారు. అనిరుధ్ ఈ సినిమాకు బాణీలు సమకూర్చనున్నారు.

'నేను రాజ్‌పుత్‌ను..వారిని నాశనం చేస్తాను'



బాలీవుడ్ నటి కంగనా రనౌత్.. కర్ణిసేన సంఘానికి చెందిన కార్యకర్తలను హెచ్చరించారు. కంగన ప్రధాన పాత్రలో నటించిన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రం 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ సినిమాను ఆపాలంటూ మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన సంఘ కార్యకర్తలు ఎప్పటినుంచో ఆందోళన చేస్తున్నారు. ఇప్పుడు విడుదల తేదీ దగ్గరపడుతున్న సమయంలో కర్ణిసేన చిత్రబృందాన్ని మరోసారి హెచ్చరించింది. 'మణికర్ణిక' చిత్రంలో లక్ష్మీబాయి ఓ బ్రిటిష్ వ్యక్తితో ప్రేమలో పడినట్లు చూపించారని, ఆ సన్నివేశాలను తొలగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిపై కంగన మీడియా ద్వారా స్పందిస్తూ.. 'మణికర్ణిక సినిమాకు నలుగురు చరిత్రకారులు ఆమోదం తెలిపారు. సెన్సార్ బోర్డు కూడా సర్టిఫికేట్ జారీ చేసింది. ఇప్పటికీ కర్ణిసేన ఆందోళనలు ఆపకపోతే నేను కూడా వారిలాగే ప్రవర్తించాల్సి ఉంటుంది. నేను రాజ్‌పుత్‌ను. వారందరినీ నాశనం చేస్తాను' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బాలీవుడ్ నటి దీపిక పదుకొణె నటించిన 'పద్మావత్' చిత్రాన్ని కూడా కర్ణిసేన సంఘాలు వ్యతిరేకించాయి. క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేపట్టాయి. కానీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో సినిమా విడుదలకు నోచుకుని విజయాన్ని అందుకుంది.



మరోసారి చిరుతో నయన్!



సౌత్ సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ నయనతార వరుస సినిమాలతో బిజీ అవుతోంది. సీనియర్ హీరోలకు నయనతార అయితే సరైన జోడీ అని భావిస్తున్నారు దర్శకనిర్మాతలు. ఈ నేపథ్యంలో చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందనున్న కొత్త సినిమాలో నయనతారను హీరోయిన్‌గా తీసుకుంటున్నారట. ఈ మేరకు కొరటాల శివ ఆమెతో సంప్రదింపులు కూడా జరిపారని తెలుస్తోంది. ఇప్పటికే చిరంజీవితో సైరా నరసరసింహా రెడ్డి సినిమాలో నటిస్తున్న నయన్.. ఆయనతో మరోసారి నటించేందుకు కూడా ఓకే చెప్పేసిందని సమాచారం.

స్వాతంత్య్ర సమరయోదుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రామ్ చరణ్ నిర్మాణంలో భారీ బడ్జెట్‌తో 'సైరా నరసరసింహా రెడ్డి' రూపొందుతోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం స్వాతంత్య్ర దినోత్సవ కానుకగా ఆగస్టు 15న విడుదల కానుంది.

'శ్రీదేవి బంగ్లా' పై డైరెక్టర్, ప్రియా రియాక్షన్



కన్నుగీటి కుర్రకారు మనసు దోచుకున్న మలయాళీ భామ ప్రియా వారియర్.. తాజాగా 'శ్రీదేవి బంగ్లా' ట్రైలర్‌తో మరోసారి అందరి చూపును ఆకర్షించింది. ట్రైలర్ విడుదలయ్యేంత వరకూ ప్రియా ఈ సినిమాలో చేస్తుందనే విషయం ఎవ్వరికీ తెలియదు. ఈ సినిమాలో ప్రియా పాత్ర పేరు శ్రీదేవి. అయితే ఈ ట్రైలర్ చివర్లో.. బాత్ టబ్‌లో పడిపోయి ఓ యువతి చనిపోవటం చూపించటంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ట్రైలర్, టైటిల్‌ని బట్టి చూస్తే కూడా ఇది శ్రీదేవి బయోపిక్ అనే సందేశం తలెత్తుతోంది. మరోవైపు ప్రియాకు, డైరెక్టర్ ప్రశాంత్ మాంబుల్లికి శ్రీదేవి భర్త నోటీసులు పంపటంతో.. ఈ వివాదంపై టాలీవుడ్, బాలీవుడ్‌లో జోరుగా చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా 'శ్రీదేవి బంగ్లా' సినిమాపై రియాక్ట్ అయ్యారు చిత్ర దర్శకులు ప్రశాంత్ మంబుల్లి, నటి ప్రియా వారియర్. "చిత్ర టైటిల్‌లో శ్రీదేవి పేరును మార్చడంతో పాటు కొన్ని సన్నివేశాలు మార్పులు చేయాలనే విధంగా బోనీకపూర్ మాకు నోటీసులు పంపారు. ఎవరి బయోపిక్ అయినా తెరకెక్కించాలంటే అనుమతులు తీసుకోవాలన్న విషయం మాకు తెలుసు. క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. సినిమాలోని సస్పెన్స్ గురించి ముందే చెప్పగలమా?. ఈ సినిమా గురించి ప్రశ్నిస్తున్నవారందరికీ కథ చెప్పాలంటే కుదరదు. నేను శ్రీదేవికి వీరాభిమానిని. ఆమె బాత్‌టబ్‌లో పడి చనిపోయినంత మాత్రాన ఇంకెవ్వరూ అలా చనిపోకూడదని లేదు కదా? మమ్మల్ని సినిమా విడుదల చేసుకోనివ్వండి. ఈ పాత్ర కోసం ముందుగా కంగనా రనౌత్ అనుకున్నాం.. కానీ సౌత్‌లో ప్రియాకున్న క్రేజ్ ద్ృష్ట్యా ఆమెను ఫైనల్ చేశాం" అన్నారు ప్రశాంత్ మాంబుల్లి. ఇక ప్రియా స్పందిస్తూ.. "శ్రీదేవి అనేది ఈ సినిమాలో నా పేరు మాత్రమే. దానికే ఇంత రాద్ధాంతం అవసరమా?. ప్రస్తుతం ట్రైలర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం శ్రీదేవి నేపథ్యంలో ఉందా? లేదా? అనేది విడుదలయ్యాక ప్రేక్షకులే చెప్తారు" అని చెప్పింది.

అతన్ని విలన్‌గా మార్చేస్తున్నాడా?



రొటీన్ సినిమాలకు కాలం చెల్లిపోయింది. సినిమాల్లో ఏదో వైవిధ్యం ఉంటే కానీ.. జనం థియేటర్ల వరకూ వెళ్లడం లేదు. అందుకే సినిమా సినిమాకీ సరికొత్త పంథాలో ఆలోచించడం మొదలు పెడుతున్నారు ఫిల్మ్ మేకర్స్. ఈ కోవలోనే ఓ స్టార్ కమెడియన్‌ను విలన్‌గా మార్చాలని డిసైడయ్యాడట టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్. వెండితెరపై తన డైలాగ్ పవర్‌తో ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టడంలో సిద్ధహస్తుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.

రచయిత నుంచి దర్శకుడిగా మారి సంచలనాలు సృష్టిస్తోన్న ఈ మాటల మాంత్రికుడు.. 'అ్ఞతవాసి' ఫ్లాప్ తర్వాత రూటు మార్చాడు. ఫ్యాక్షన్ కథైన 'అరవింద సమేత'ను సరికొత్త పంథాలో చెప్పి విమర్శకుల ప్రశంసలు పొందాడు. ఇక కథానాయకుడి ఇమేజ్ నుంచి బయటపడలేక పోతున్న తన మిత్రుడు సునీల్‌ని.. ఈ చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మార్చి సఫలీకృతుడయ్యాడు.

సునీల్ బాటలోనే ఇప్పుడు మరో కమెడియన్‌కి సరికొత్త ఇమేజ్‌ను అందించే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాడట త్రివిక్రమ్ శ్రీనివాస్. 'అరవింద సమేత' తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్.. అల్లు అర్జున్‌తో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. అల్లు అరవింద్-ఎస్.రాధాకృష్ణ సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం మార్చి నుంచి పట్టాలెక్కనుంది. ఇక ఈ సినిమాలో కీలకమైన ప్రతినాయకుడి పాత్రకు కమెడియన్ పృథ్వీని ఎంపిక చేశాడట త్రివిక్రమ్. నాగభూషణం, రావు గోపాలరావు వంటి వెటరన్స్ తరహాలో పృథ్వీతో ఈ చిత్రంలో కామెడీ విలనిజాన్ని పండించనున్నాడట. మరి స్టార్ కమెడియన్ పృథ్వీకి ఈ చిత్రం ఎలాంటి టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందో చూడాలి.



'ఇస్మార్ట్ శంకర్'.. ఎప్పుడంటే..

రామ్ పోతినేని హీరోగా పూరీ జగన్నాథ్ రూపొందించనున్న కొత్త సినిమా 'ఇస్మార్ట్ శంకర్'. ఇటీవలే విడుదలైన ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ విశేష ప్రేక్షకాదరణ పొందింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో రామ్ ఇంతకు ముందెన్నడూ చూడని విదంగా డిఫెరెంట్ లుక్‌లో కనిపించనున్నాడు. తాజాగా ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ తేదీలను కన్ఫర్మ్ చేసింది చిత్రయూనిట్. సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పూర్తిచేసిన పూరి జగన్నాథ్ జనవరి 23, 24 తేదీల్లో ఈ సినిమాను సెట్స్ పైకి తీసుకురానున్నారు. గత కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురు చూస్తున్న పూరి.. ఈ సినిమాతో భారీ విజయం సాధించాలని పట్టుదలగా ఉన్నారు. అందుకు తగ్గట్టు చిత్రంలో ఆసక్తికర సన్నివేశాలు ఉండేలా స్క్రిప్ట్ వర్క్ రెడీ చేసుకున్నారట పూరి. చిత్రానికి మణిశర్మ బాణీలు కడుతున్నారు. త్వరత్వరగా షూటింగ్ ఫినిష్ చేసి మే నెలలో సినిమాను విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నారు.

సుప్రీం జడ్జీలుగా దినేశ్, ఖన్నా ప్రమాణం



న్యూఢిల్లీ : సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులుగా జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నా శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. సీజేఐ రంజన్ గొగోయ్ ఆధ్వర్యంలో కోర్టు నం.1లో వీరి ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. సుప్రీంకోర్టులో మొత్తం 31 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా దినేశ్ మహేశ్వరి, సంజీవ్ ఖన్నాల చేరికతో జడ్జీల సంఖ్య 28కి చేరుకుంది. ఇంకా ముగ్గురు న్యాయమూర్తుల కొరత ఉంది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. వీరిద్దరిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్రప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం ఈనెల 10న పదోన్నతులు కల్పించే న్యాయమూర్తుల పేర్లను ప్రస్తావించింది. ఈ క్రమంలో జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్లను సిఫార్సు చేసింది. తొలుత రాజస్థాన్, ఢిల్లీ హైకోర్టుల న్యాయమూర్తులు ప్రదీప్ నంద్రజోగ్, రాజేంద్ర మెనన్ పేర్లను పరిశీలించిన కొలీజియం జస్టిస్ ఎంబీ లోకుర్ పదవీవిరమణ తర్వాత వారిద్దరి గురించి పట్టించుకోలేదు. జస్టిస్ లోకుర్ స్థానంలో జస్టిస్ అరుణ్‌మిశ్రా కొలీజియంలో చేరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులుగా సీజేఐ రంజన్ గొగోయ్, న్యాయమూర్తులు ఏకే సిక్రీ, ఎస్ఏ బాబ్డే, ఎన్‌వీ రమణ, అరుణ్ మిశ్రా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాను సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలన్న కొలీజియం సిఫార్సును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) బుధవారం వ్యతిరేకించింది. కొలీజియం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తోందని పేర్కొంది. అంతకుముందు జస్టిస్ నంద్రజోగ్, జస్టిస్ మెనన్‌ల సీనియారిటీని పట్టించుకోకపోవడాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ కొలీజియంకు లేఖ రాశారు. సీనియర్లను పక్కనబెడితే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళతాయని ఆయన పేర్కొన్నట్టు సమాచారం.

ఎల్డీఎఫ్ పోరుబాట

- కేరళ మార్చ్ నిర్వహణకు నిర్ణయం
- మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం
- దక్షిణాది ర్యాలీకి బాలకృష్ణన్ నాయకత్వం
- రాజేంద్రన్ నాయకత్వంలో ఉత్తరాది నుంచి ర్యాలీ
- మార్చి 2న త్రిసూరులో భారీ బహిరంగ సభ
- ఎల్డీఎఫ్ కన్వీనర్ విజయరాఘవన్ వెల్లడి
- యూడీఎఫ్‌లో సీట్ల లొల్లి



తిరువనంతపురం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేరళలో రాజకీయం వేడెక్కింది. ఇప్పటికే మంచి ఊపుమీదున్న పాలక ఎల్డీఎఫ్ కేరళ మార్చ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నది. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నది. మరోవైపు ప్రతిపక్ష యూడీఎఫ్ నాయకత్వం సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై తర్జనభర్జన పడుతోంది. సీపీఎం నాయకత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్డీఎఫ్) కేరళలో అధికారంలో ఉంది. ఆర్.బాలకృష్ణ పిళ్లై నాయకత్వంలోని కేరళ కాంగ్రెస్(బి) సహా నాలుగు పార్టీలు ఇందులో భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. గతేడాదే పిళ్లై పార్టీ ఎల్డీఎఫ్‌లో చేరింది. రాష్ట్రంలోని మొత్తం 140 నియోజకవర్గాలను కవర్ చేస్తూ కేరళ మార్చ్ నిర్వహించాలని ఎల్డీఎఫ్ నాయకత్వం గురువారం నిర్ణయం తీసుకున్నది. కేరళ కాంగ్రెస్(ఎం), కేరళ కాంగ్రెస్(జాకబ్) సహా యూడీఎఫ్ భాగస్వాములు అధిక సీట్లు కావాలని కాంగ్రెస్‌ను డిమాండు చేయడంతో ఈ కూటమికి తలనొప్పులు ఎక్కువయ్యాయి. కేరళలో మొత్తం 20 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో యూడీఎఫ్ 12 సీట్లు గెలుచుకోగా, ఎల్డీఎఫ్ 8 సీట్లలో విజయం సాధించింది.

రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతం నుంచి ఒకటి, ఉత్తర ప్రాంతం నుంచి ఒకటి మొత్తం ఏకకాలంలో రెండు మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఎల్డీఎఫ్ కన్వీనర్ విజయరాఘవన్ శుక్రవారం వెల్లడించారు. తిరువనంతపురం నుంచి ప్రారంభమయ్యే కేరళ మార్చ్‌కి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ నాయకత్వం వహిస్తారని, ఉత్తరప్రాంతం నుంచి చేపట్టే మార్చ్‌కి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కనమ్ రాజేంద్రన్ నాయకత్వం వహిస్తారని విజయరాఘవన్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ రెండు ర్యాలీలు మార్చ్ 2వ తేదీన త్రిసూర్ చేరుకుంటాయని వెల్లడించారు. నియంతృత్వ, ఏకపక్ష నిర్ణయాలతో దేశ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా తాము రాష్ట్రవ్యాప్త ర్యాలీలకు సమాయత్తమయ్యామని ఆయన తెలిపారు.

యూడీఎఫ్‌లోనూ సీట్ల లొల్లి ప్రారంభమైంది. భాగస్వామ్య పార్టీ కేసీ(ఎం) కొట్టాయంతో పాటు ఇడుక్కి సీటు కూడా ఇవ్వాలని పట్టుపడుతోంది. ఇడుక్కి సీటును కేసీ(జాకబ్) పార్టీ ఆశిస్తోంది. సిట్టింగ్ ఎంపీ జోస్ కె.మణిని రాజ్యసభకు నామినేట్ చేయడంతో కొట్టాయం సీటు ప్రస్తుతం ఖాళీగా ఉంది. 'ఎన్నికలకు ముందు జరిగిన మొదటి సమావేశం ఇది. డిమాండు చేసిన సీట్ల గురించి నిర్ణయం తీసుకోవడానికి ఇది సరైన సమయం కాదు' అని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) నాయకుడు, ఎంపీ పీకే కున్హలికుట్టి చెప్పారు. యూడీఎఫ్ నాయకుల సమావేశం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫ్రంట్‌లో చేరాలన్న పూంజార్ ఎమ్మెల్యే, కేరళ కాంగ్రెస్ మాజీ నాయకుడు పీసీ జార్జి లేఖపై యూడీఎఫ్ సమావేశం నిర్ణయం తీసుకోలేదని ఆయన వెల్లడించారు.

దేశ భద్రతతోనే రాజీనా..?



మోడీ ప్రభుత్వంపై చిదంబరం, ఏచూరీ ఫైర్

న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందాన్ని కుదుర్చుకునే క్రమంలో యుద్ధ విమానాల సంఖ్యను 126 నుంచి 36కు కుదించి దేశభద్రత విషయంలో కేంద్రప్రభుత్వం రాజీపడిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం ఆయన ట్విట్టర్ ద్వారా మోడీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'ది హిందూ నివేదిక ఆధారంగా కొత్త విషయాలు, వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో వైమానికదళానికి 126 రాఫెల్ విమానాల అవసరముండగా వాటి సంఖ్యను 36కు తగ్గించడంలో ఆంతర్యమేమిటి? అన్నదే ప్రధాన ప్రశ్న. తక్షణావసరమైన 7 స్క్వాడ్రాన్స్ (126 యుద్ధవిమానాలు)ను నిరాకరించి.. దేశ భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడింది' అని చిదంబరం ట్వీట్ చేశారు. ఇదే విషయమై సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా మోడీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 'తన ఆశ్రిత వాణిజ్యవేత్తకు లబ్ధి చేకూర్చేందుకు మోడీ హడావుడిగా రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందాన్ని కుదుర్చుకున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. భారతదేశ భద్రతను పణంగా పెట్టి, ఖజానా నుంచి ఖాళీచేసి ఫ్రాన్స్ వ్యాపారవేత్తకు లబ్ధి చేకూర్చారు' అంటూ ఏచూరీ ట్వీట్ చేశారు. మోడీ కుదర్చుకున్న రాఫెల్ ఒప్పందం కారణంగా యుద్ధ విమానాల ధరలు ఏకంగా 41.42శాతం పెరినట్టు ది హిందూ ఎక్స్‌క్ల్యూజివ్ న్యూస్ నేపథ్యంలో కాంగ్రెస్, సీపీఎం శుక్రవారం మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. ఈ వార్తాకథనానికి సంబంధిన ప్రతిని ఏచూరీ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'రాఫెల్ కుంభకోణంపై వాస్తవాలు బయటకు రావాలంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ తప్పనిసరంటూ డిమాండు చేస్తూనే ఉన్నాం. ఒప్పందానికి సంబంధించిన పత్రాలు, మంత్రులు, అధికారుల పరిశీలనకు ఒత్తిడి తెచ్చాం. వాస్తవాలు వెల్లడికాకుండా మోడీ ప్రభుత్వం అడ్డుకుంటోంది' అని ఏచూరి పేర్కొన్నారు.

శబరిమలను దర్శించుకున్న

51 మంది మహిళలు





- అంతా 10-50 ఏళ్లలోపు వారే
- కేరళ దేవస్థానం మంత్రి వెల్లడి
- సుప్రీంకోర్టుకు వివరాల సమర్పణ

తిరువనంతపురం : మండల-మకరవిలక్కు యాత్ర 2018-19 సందర్భంగా 10 నుంచి 50ఏళ్ల లోపు 51 మంది బాలికలు, మహిళలు శబరిమలను దర్శించుకున్నట్టు కేరళ దేవస్థానం మంత్రి కదకంపల్లి సురేంద్ర శుక్రవారం తెలిపారు. ఇటీవల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు బిందూ, కనకదుర్గకు 24గంటల పాటు భద్రతను కల్పించాలని సర్వోతన్న న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. ఈనెల 2న పోలీసుల భద్రత నడుమ ఈ ఇద్దరు ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహించడం వివాదాస్పదాం శంగా మారడం తెలిసిందే. ఆలయంలోకి ప్రవేశించిన మహిళల జాబితాను సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించినట్టు సురేంద్ర వెల్లడించారు. అయితే, ఆలయాన్ని సందర్శించుకునే మహిళా భక్తులు వయస్సును వెల్లడించడం ప్రభుత్వానికి సాధ్యం కాని విషయమని అయనన్నారు. శబరిమల యాత్ర కోసం 7,564 మంది మహిళలు రిజిస్టర్ చేసుకోగా వారిలో 51 మంది మాత్రం పోలీసు భద్రతను కోరారని తెలిపారు. తమ ఆలయ ప్రవేశం గురించి ముందస్తుగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకున్న మహిళలు మాత్రమే ఆటంకాలను ఎదుర్కొన్నారని, మిగతా వారంతా ప్రశాంతంగానే దర్శనం చేసుకున్నారని మంత్రి చెప్పారు. పోలీసుల నుంచి రక్షణ కోరిన మహిళలలో అత్యధికులు తమిళనాడు (24), ఆంధ్రప్రదేశ్, గోవా, పుదుచ్చేరికి చెందిన వారని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈమేరకు మహిళా భక్తుల ఆధార్ వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్లు వంటివి తమ వాదనకు సాక్ష్యంగా సుప్రీంకోర్టు ముందు ఉంచారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలు ప్రవేశించవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా కేరళ ప్రభుత్వం నడుచుకుంది. అయితే పలువురు భక్తులు, ఆందోళనకారులు మహిళల ఆలయ ప్రవేశాన్ని వ్యతికించారు. నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జనవరి 2న బిందు, కనకదుర్గ ఆలయంలోకి ప్రవేశించడంతో ఆందోళనలు తీవ్రతరమైన విషయం తెలిసిందే.

ఆ ఇద్దరికి 24X7 రక్షణ

కేరళ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : శబరిమల ఆలయంలోకి వెళ్లిన ఇద్దరు మహిళలు బిందు, కనకదుర్గ బెదిరింపులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి 24×7 రక్షణ కల్పించాలంటూ కేరళ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ మహిళలు గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఇద్దరు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తగు భద్రతను కల్పిస్తోందని, ఇప్పటివరకు 51 మంది మహిళలు ఆలయాన్ని సందర్శించుకున్నారని ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న సీజేఐ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎల్ఎన్ రావు, జస్టిస్ మహేశ్వరితో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ ఇద్దరికి పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని, దీనికి సంబంధించి మరో ఫిర్యాదును స్వీకరించబోమని స్పష్టంచేసింది. శబరిమలకు సంబంధించిన పెండింగ్ కేసులతో ఈ అంశాన్ని జోడించేందుకు ధర్మాసనం తిరస్కరించింది.


మా ప్రభుత్వానికి ఢోకా లేదు

కన్నడ కాంగ్రెస్ నాయకుల ధీమా



బెంగళూరు : కర్ణాటకలో తమ సంకీర్ణ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని ఆ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు శుక్రవారం చెప్పారు. కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించబోవని స్పష్టంచేశారు. కుమారస్వామి ప్రభుత్వాన్ని కూల్చడానికి కాషాయపార్టీ చేసిన కుట్ర బహిర్గతమైందని వ్యాఖ్యానించారు. 'అందరూ మాకు అందుబాటులోనే ఉన్నారు. ఎవరూ మాతో టచ్‌లో లేరని మీరు చెప్పడం సరికాదు. పార్టీ నుంచి ఎవరు బయటికి వెళ్లారో మీరే(మీడియా) జాబితా విడుదల చేయండి. ఎక్కువ మంది ఇప్పుడు మాతోనే ఉన్నారు. కొంతమంది వస్తున్నారు' అని పీసీసీ చీఫ్ దినేష్ గుండూరావు చెప్పారు. సీఎల్పీ సమావేశానికి ముందు గుండూరావు విలేకరులతో మాట్లాడారు. సీఎల్పీ భేటీకి అందరూ వస్తున్నార న్నారు. ఏది జరిగినా తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని గుండూరావు ధీమాగా చెప్పారు. కుమారస్వామి ప్రభుత్వం కచ్చితంగా ఐదేళ్లు పూర్తి చేసుకుంటుందని అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ శాయ శక్తులా ప్రయత్నిస్తోందని, దాని ప్రయత్నాలు ఫలించేది లేదని స్పష్టం చేశారు. బీజేపీకి సంబంధించిన ఎమ్మెల్యేలంతా హర్యానాలోని గురుగ్రామ్‌లో తలదాచుకున్నారని చెబుతూ ఇందుకు తాను విచారం వ్యక్తంచేస్తున్నానని గుండూరావు వ్యాఖ్యానించారు. మధ్యాహ్నం 3.30గంటలకు సీఎల్పీ సమావేశం జరిగింది. బీజేపీ ప్రయత్నాలను సాగనివ్వబోమన్న సంకేతాలు ఇచ్చేందుకు ఈ సమావేశం ద్వారా కాంగ్రెస్ తన బలాన్ని, ఐక్యతను ప్రదర్శించింది. ఎమ్మెల్యేలంతా తమకు అందుబాటులోనే ఉన్నా రని, అన్ని సమస్యలు పరిష్కారమయ్యా యని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈశ్వర్ ఖాంద్రే చెప్పారు. బీజేపీలో చేరుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమేష్ జాదవ్‌తో తాను మాట్లాడానని చెప్పారు. తాను బీజేపీ గూటికి చేరడం లేదని, కాంగ్రెస్‌లోనే ఉంటానని జాదవ్ స్పష్టం చేశారని, ఆయనపై తనకు విశ్వాసం ఉందని ఖాంద్రే చెప్పారు.

ప్రజా మద్దతు మాకే..!



- ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్డీ కలిసే పోటీ
- సీట్ల సర్దుబాటు సమస్య కాదు
- కాంగ్రెస్‌తో అవగాహన లేదు
- బీజేపీని గద్దె దించుతాం
- మా కూటమిని ప్రజలు అంగీకరిస్తున్నారు
- ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టీకరణ

లక్నో : వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్డీ మధ్య పొత్తు ఖరారైందని, సీట్ల పంపిణీ పెద్ద సమస్యే కాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టంచేశారు. కాంగ్రెస్‌తో అవగాహనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. 'బీఎస్పీ, ఆర్ఎల్డీ, నిషద్ పార్టీ వంటి చిన్న పార్టీలతో మా పొత్తు ఖరారైంది. సీట్ల పంపిణీ మాకు సమస్య కాదు. సీట్ల పంపిణీపై త్వరలోనే ప్రకటన చేస్తాం. రాష్ట్రంలో మేము బలమైన శక్తిగా ఆవిర్భవించాం. బీజేపీని గద్దె దించడమే మా లక్ష్యం. బీజేపీ అహంకారం, నియంతృత్వ పోకడలకు అడ్డుకట్ట వేస్తాం. బీజేపీ నాయకులు ఇప్పటికే మాపై అసభ్య పదజాలం ప్రయోగించడం ప్రారంభించారు' అని అఖిలేష్ యాదవ్ శుక్రవారం చెప్పారు. 'మార్పునకు ఉత్తరప్రదేశ్ ఎల్లప్పుడూ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఈసారి రాష్ట్ర ప్రజలు ప్రధాని నరేంద్రమోడీని మార్చివేస్తారు. బీజేపీ పైనే మా పోరాటం. ప్రజలు మాకు అండగా నిలిచారు' అని ఎస్పీ ప్రధాన కార్యాలయంలో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. తదుపరి ప్రధాని ఎవరన్న ప్రశ్నకు అఖిలేష్ నేరుగా సమాధానం చెప్పలేదు. సమాజ్‌వాదీ పార్టీ కేవలం ఉత్తరప్రదేశ్ పైనే దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు అవకాశాలను అఖిలేష్ కొట్టిపారేశారు. 'కాంగ్రెస్‌తో మాకు అవగాహన ఉందని మీరెలా చెబుతారు? కాంగ్రెస్ జాతీయ పార్టీ. కాంగ్రెస్‌కు మేము రాయ్‌బరేలీ, అమేథీ సీట్లు వదిలాం. ప్రస్తుతం నా దృష్టంతా యూపీపైనే ఉంది. మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌పైనా దృష్టి సారిస్తాం. బలమైన రెండు, మూడు సీట్లలో తాము అభ్యర్థులను పోటీకి దించుతాం. ఇతరులతో పొత్తు అవకాశాలు ఉంటాయేమోనని చూస్తాం' అని ఎస్పీ అధినేత వివరించారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీతో గల మిత్రుత్వం గురించి ప్రశ్నించగా ఇప్పుడు కాంగ్రెస్ గురించి మాట్లాడటం తనకు ఇష్టం లేదని చెప్పారు. రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్డీ) నేత జయంత్ చౌదరితో సమావేశం గురించి అడుగగా 'మా పొత్తు ఖరారైంది. ఖైరానాలో ఆర్ఎల్డీ నాయకుడు తబస్సుమ్ హసన్‌ను ఎస్పీ టికెట్‌పై పోటీకి దించుతాం. వారు కోరుకుంటే మథుర, భాగపట్‌లను ఆర్ఎల్డీకి ఇస్తాం. పొత్తులకు సంబంధించి ఇప్పటికి ఇబ్బందేం లేదు' అని అఖిలేష్ చెప్పారు. తన బాబాయి, ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ శివపాల్ యాదవ్‌ను బీజేపీ ఆర్థికంగా ఆదుకుంటుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి చేస్తున్న ఆరోపణలపై స్పందించడానికి అఖిలేష్ సుముఖత వ్యక్తం చేయలేదు. దీనిపై తానేమీ మాట్లాడలేనని అన్నారు. శివపాల్ యాదవ్‌కు బీజేపీ నిధులు అందజేస్తుందని అఖిలేష్‌తో ఉమ్మడి మీడియా సమావేశంలో మాయావతి ఆరోపించారు. శివపాల్‌ను అడ్డుపెట్టుకొని ఎస్పీ-బీఎస్పీ కూటమిని చీల్చాలన్న బీజేపీ ఆశలు నెరవేరబోవని తేల్చిచెప్పారు. బీజేపీ గురించి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆ పార్టీ చాలా హామీలు గుప్పించింది. అవి నెరవేరలేదు. బీజేపీ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారు. ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఎస్పీ-బీఎస్పీ పొత్తును ప్రజలు కోరుకుంటున్నారని అఖిలేష్ వివరించారు.

ఐక్యతా ర్యాలీకి మా మద్దతు

మమతా బెనర్జీకి రాహుల్ లేఖ



ముంబై : ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మమతా దీ అని సంబోధిస్తూ ఆమెకు లేఖ రాశారు. శనివారం కోల్‌కతాలో మమతా బెనర్జీ నాయకత్వంలో ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీ జరుగుతుంది. ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయని రాహుల్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఐక్యతను ప్రదర్శించే ర్యాలీకి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది. 'మమతా దీకి నేను మద్దతిస్తున్నా. యునైటెడ్ ఇండియా ర్యాలీ..పార్టీల ఐక్యతను చాటడమే కాకుండా బలమైన సందేశాన్ని పంపుతుందని ఆశిస్తున్నా' అని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకికవాదం అనే స్తంభాల పైనే అభివృద్ధి, నిజమైన జాతీయత ఉంటుందని నమ్మి ప్రతిపక్ష పార్టీలు ఏకమవుతున్నాయని తెలిపారు. బీజేపీ, మిస్టర్ మోడీ వాటిని సర్వనాశనం చేశారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం నకిలీ హామీల కారణంగా కోట్లాది మంది భారతీయులు ఆగ్రహం, నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. మమతా బెనర్జీ నిర్వహించే ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీకి సోనియా, రాహుల్ హాజరు కావడం లేదు. కాంగ్రెస్ తరపున మల్లిఖార్జున ఖర్గె, అభిషేక్ మను సింఘ్వీ హాజరవుతున్నారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి ర్యాలీకి గైర్హాజరవుతు న్నారు. ఆమె తరపున పార్టీ నేత సతీష్ మిశ్రా వెళుతున్నారు. మమతా ర్యాలీకి మాజీ ప్రధాని దేవెగౌడ, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఢిల్లీ సీఎం కేజ్రీ వాల్, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

మాకు సంబంధం లేదు : యడ్యూరప్ప

బెంగళూరు : కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణంలో నెలకొన్న గందరగోళంతో తమకు సంబంధం లేదని బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప చెప్పుకొచ్చారు. సంకీర్ణంలో ఏమి జరిగినా అందుకు కాంగ్రెస్‌దే బాధ్యతని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తాము వలవేసినట్టు జరుగుతున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వంలో గందరగోళానికి తాము కారణమని జరుగుతున్న ప్రచారం పూర్తిగా సత్యదూరమని వ్యాఖ్యానించారు. బీజేపీకి చెందిన 104 మంది ఎమ్మెల్యేలు ఒకేమాటపై ఉన్నారని, కర్ణాటకలో 20 లోక్‌సభ సీట్లు గెలుచుకోవాలన్నదే తమ లక్ష్యమని యడ్యూరప్ప శుక్రవారం విలేకరులకు చెప్పారు. బీజేపీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. సీఎల్పీ సమావేశంతో తమకేంటి సంబంధమని ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యేలను తాము కాపాడుకున్నట్టే కాంగ్రెస్ కూడా కాపాడుకుంటే మంచిదని హితవు పలికారు. బీజేపీ ఎమ్మెల్యేలను హోటల్ నుంచి గురుగ్రామ్ రిసార్టుకు తరలించడంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఇవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. ఇందులో వాస్తవం లేదన్నారు. అందరూ శనివారం ఇక్కడికి వస్తారని చెప్పారు.

మోడీ,యోగీ హోర్డింగ్‌కు నల్లరంగు

ముజఫర్‌నగర్ : ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఫొటోలతో ఉన్న హోర్డింగ్‌కు, గుర్తుతెలియని వ్యక్తులు నల్లరంగు పూసారని శుక్రవారం అధికారులు వెల్లడించారు. ఈ హోర్డింగ్ ముజఫర్‌నగర్‌లోని కట్కా గ్రామంలో ఉంది. గ్రామాలకు విద్యుత్‌ను అందించే దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకానికి సంబంధించిన ప్రకటన బోర్డుగా దానిని గుర్తించారని అదనపు జిల్లా మెజిస్ట్రేటు అమిత్ కుమార్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులను కోరామన్నారు.

కొనసాగుతున్న శీతల గాలులు

చండీగఢ్ : పంజాబ్, హర్యానాల్లో శీతల గాలులు కొనసాగుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు ఇంతకు ముందు కంటే పడిపోయాయి. బతివాడ అత్యంత శీతల ప్రదేశం కాగ, హల్వారా తర్వాతి స్థానాన్ని ఆక్రమించిందని వాతావరణ శాఖ వెల్లడించింది. పంజాబ్‌లో అమృత్‌సర్, లూథియాన, పటియాలల్లో అతిశీతల పరిస్థితులు కొనసాగుతున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతం అయిన చండీగఢ్‌లో ఉష్ణోగ్రత 5.6గా నమోదు అయ్యింది. హర్యానాలోని అంబాలా, హిస్సార్, కర్నాల్‌ల్లో చల్లటి వాతావరణం ఉంది. భీవాని, సీర్సా, నార్నౌల్‌లో ఇదే పరిస్థితి ఉంది. పంజాబ్, హర్యానాల్లోని అంబాలా, హిస్సార్, కర్నాల్, పటియాల, అమృత్‌సర్, బతివాడల్లో దట్టమైన పొగ మంచు అల్లుకుంది.

ఆప్ ఒంటరిగా పోటీ చేస్తుంది : రాయ్

న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జతకట్టబోమని, ఆప్ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆప్ సీనియర్ నాయకుడు, ఢిల్లీ యూనిట్ కన్వీనర్ గోపాల్ రాయ్ వెల్లడించారు. కురువృద్ధ పార్టీ కాంగ్రెస్‌కు అహంకారం ఎక్కువని అందువల్ల జతకట్టబోమని ఆయన వివరించారు. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్, ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షీలాదీక్షిత్‌లు ఆప్‌తోపొత్తుకు నిరాకరించిన విషయం తెలిసిందే. దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ అనే విషం తాగడానికి సిద్ధంగా ఉన్నామని అయితే ఆపార్టీకి అహంభావమని, అందువల్ల ఆప్ ఒంటరిగా బరిలోకి దిగుతుందని రాయ్ వివరించారు. పార్టీ త్వరలో అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తుందన్నారు.

నలుగురికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ : ఇసుక అక్రమ రవాణా కేసులో ఐఏఎస్ అధికారి బి.చంద్రకళతోసహా నలుగురికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసిందని ఉత్తరప్రదేశ్ అధికారిక వర్గాలు ఉటంకించాయి. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ మేరకు ఇసుక అక్రమ తరలింపులో మనీలాండరింగ్ జరిపారని నేరనమోదు జరి పారు. 2012,2016ల్లో హమీంపూరలో ఈ ఘటన జరిగిందన్నారు. ఆ సమ యంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ మైనింగ్ శాఖను కూడా నిర్వహించారన్నారు. మరో ఇద్దరు అధికారులకు సమన్లు జారీ అయ్యాయి. వారి స్థిర, చరాస్తులను పరిశీలించి మనీలాండరింగ్ చట్టం ప్రకారం ఆస్తులను అటాచ్ చేశామన్నారు. సీబీఐ ఈనెల ప్రారంభంలో 14 ప్రాంతాలను గుర్తించి 11 మందిపై కేసులు నమోదు చేసింది. వారిలో చంద్రకళ, మిశ్రా, సంజయ్ దీక్షిత్ ఉన్నారు.

'10 శాతం' పై హైకోర్టుకు డీఎంకే

చెన్నై : కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వారికోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని డీఎంకే హైకోర్టులో సవాలు చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా వ్యతిరేకమని అపార్టీ స్పష్టం చేసింది. రిజర్వేషన్లు అణచివేతకు గురయిన వార్గాల సామాజిక న్యాయం కోసం ఉద్దేశించిందన్నారు. అందువల్ల ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు సమంజసం కాదని డీఎంకే కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి వెల్లడించారు. సుప్రీంకోర్టు ఇప్పటికే 50శాతం మించి రిజర్వేషన్లు ఉండరాదని స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.అయితే తమిళనాడులో ఎస్సీ,ఎస్టీ, బీసీలకు 69శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. చట్టం1993లో 9వ షెడ్యూలులో కలుపుతూ చట్టసవరణ జరిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లతో రాష్ట్రంలో రిజర్వేషన్ల శాతం 79కు పెరుగుతుంది.

భద్రతా దళాలపై గ్రెనేడ్ దాడులు

శ్రీనగర్ : కాశ్మీర్ భద్రతాదళాలపై రెండు గ్రెనేడ్ దాడులు జరిగాయి. అందులో ఒకటి లాల్ చౌక్ ప్రాంతంలో జరిగింది. అయితే ఎలాంటి నష్టం జరిగిందన్న వార్తలు రాలేదు. శుక్రవారం మధ్యాహ్నం ఉగ్రవాదులు లాల్ చౌక్‌లో సీఆర్పీఎఫ్ దళాలపై దాడి జరిపారని పోలీసులు వెల్లడించారు. రోడ్డు ప్రక్కన ఉన్న ప్రైవేటు వాహనాల పార్కింగ్‌లోని ఒక కారు పాక్షికంగా దెబ్బతిందన్నారు. రెండో దాడి జమ్మూకాశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లోని జీరో బ్రిడ్జిపై జరిగింది. దుండగులు గురువారం గ్రెనేడ్లు విసరడంతో ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. రిపబ్లిక్ డేకు 10 రోజుల ముందు ఈ ఘటన జరిగింది.



ఏసీబీకి దొరికిన దేవరపల్లి ఏఎస్ఐ

విశాలాంధ్ర - దేవరపల్లి : ఘర్షణ కేసును నమోదు చేసేందుకు లంచం అడిగిన పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్‌స్టేషన్ అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను శుక్రవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన మిడతల నాగమణి, అదే గ్రామస్తుడు వెంకట్రావు మధ్య కొంతకాలంగా వ్యక్తిగత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరువురూ కోర్టుకెక్కారు. మూడేళ్లుగా కోర్టు వ్యవహారాలు కొనసాగుతుండగా నాగమణి, వెంకట్రావు ఇటీవల మళ్లీ ఘర్షణ పడ్డారు. ఈ విషయమై గతనెలలో నాగమణి దేవరపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పుడు స్టేషన్ రైటర్ హొదాలో ఫిర్యాదు స్వీకరించిన సత్యనారాయణ రెండు దఫాలుగా రూ.4 వేలు తీసుకున్నాడు. తర్వాత ప్రమోషన్‌తో ప్రస్తుతం ఏఎస్ఐగా కొనసాగుతున్నాడు. ఈ కేసు విషయం రోజుల తరబడి సాగదీయడంతో నాగమణి సత్యనారాయణను ప్రశ్నించింది. మరో అయిదు వేల రూపాయలు లంచం ఇస్తే కేసు రిజిస్టరు చేస్తానని తెగేసి చెప్పాడు ఏఎస్ఐ. దీంతో నాగమణి నేరుగా ఏలూరులోని అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. వారి సూచనల మేరకు శుక్రవారం ఉదయం స్టేషన్‌లో ఏఎస్ఐ సత్యనారాయణకు రూ.5 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పరీక్షల అనంతరం లంచం తీసుకున్నట్లు నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ గోపాలకృష్ణ తెలిపారు.

ఫిబ్రవరిలో జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



విశాలాంధ్రబ్యూరో - అనంతపురం : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని ఫిబ్రవరిలో నిర్వహించాలని తలపెట్టినట్లు వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరిలో జేఎన్‌టీయూ పదవ స్నాతకోత్సవం నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఇప్పటికే వర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీనివాసకుమార్ అన్ని విభాగాధిపతులకు ఆదేశాలిచ్చినట్లు ఆ వర్గాలు వివరించాయి. ఈ విషయమై ఇప్పటికే వర్సిటీ చాన్సలర్, ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు వీసీ శ్రీనివాసకుమార్ అధికారిక లేఖ కూడా పంపారు. ఫిబ్రవరి 6, 7, 8 తేదీల్లో ఏదో ఒక తేదీని ఖరారు చేయడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా ఆయన ఆ లేఖలో అభ్యర్థించారు. స్నాతకోత్సవానికి చాన్సలర్ హొదాలో గవర్నర్ హాజరు కావడానికి వీలుగా తేదీని ఎంపిక చేయాల్సిందిగా ఆయన కోరారని యూనివర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి. గవర్నర్ అనుమతితోనే తేదీని ప్రకటిస్తామని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ శ్రీనివాసకుమార్ స్పష్టం చేశారు.

ప్రొఫెసర్ యజ్ఞ నారాయణకు గౌరవ డాక్టరేట్ !

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ పదవ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గౌరవ డాక్టరేట్‌కు ప్రొఫెసర్ యజ్ఞనారాయణను ఎంపిక చేశారు. గౌరవ డాక్టరేట్‌కు ఎవరిని ఎంపిక చేయాలనే విషయమై జేఎన్‌టీయూ యూనివర్సిటీ పాలకవర్గం మూడు పేర్లతో కూడిన ఒక ఫైల్‌ను యూనివర్సిటీ చాన్సలర్, గవర్నర్ నరసింహన్‌కు పంపింది. అందులో ప్రొఫెసర్ యజ్ఞనారాయణ పేరును గవర్నర్ ఎంపిక చేశారంటున్నారు. యూనివర్సిటీ పాలకవర్గం పంపిన సంబంధిత ఫైల్‌పై ఇప్పటికే గవర్నర్ ఆమోదముద్ర వేశారని అధికార వర్గాలు ధ్రువీకరించాయి. హైదరాబాద్‌లోని ఇంటర్‌నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ యజ్ఞనారాయణ సేవలు విశిష్ట రీతిలో ఉండడంతో ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనే అనంతపురం జేఎన్‌టీయూ పదవ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. 1961లో ఆంధ్రా యూనివర్సిటీలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన ప్రొఫెసర్ యజ్ఞనారాయణ బెంగళూరులోని ఐఐఎస్‌సీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం ఐఎస్ఎస్ఏలో సీనియర్ శాస్త్రవేత్తగా కూడా వ్యవహరించారు.

శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వీసీగా రహంతుల్లా

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురము : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పదకొండవ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ ఎస్ఎం రహంతుల్లాను నియమిస్తూ ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి దమయంతి సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశారు. 2018 ఏప్రిల్ 17వ తేదీన వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజగోపాల్ పదవీ విరమణ తర్వాత పోస్టు ఖాళీగా ఉంది. పాలనా వ్యవహారాల కోసం 2018 ఏప్రిల్ 25వ తేదీ నుంచి ప్రొఫెసర్ శుభ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీ భేటీకి తీవ్ర జాప్యం ఏర్పడింది. దీంతో వర్సిటీలో సమస్యలు రాజ్యమేలుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, రాజకీయ పక్షాల నుంచి రెగ్యులర్ వీసీ నియామకానికి ప్రభుత్వం, సెర్చ్ కమిటీపై ఒత్తిడి వచ్చింది. ఎట్టకేలకు కొద్ది రోజుల క్రితం సెర్చ్ కమిటీ భేటీ అనంతరం వైస్ ఛాన్సలర్ ఎంపిక కోసం పేరును సూచించింది. ఎస్కేయూ వైస్ ఛాన్సలర్ పదవిని మైనారిటీలకు ఇవ్వాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా ఉంది. ఇదే సమయంలో ఎస్ఎం రహంతుల్లాను ఈ పదవి వరించింది. ముప్పై ఏళ్లుగా బోధనారంగంలోనే కొనసాగుతూ వివిధ హొదాల్లో పనిచేసి విశేష పాలనా అనుభవం కలిగిన రహంతుల్లా ఉపకులపతి పదవికి వన్నె తెస్తారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కడప జిల్లాకు చెందిన రహంతుల్లా ప్రస్తుతం హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ విధులు నిర్వర్తిస్తున్నారు. విశ్వవిద్యాలయానికి డీన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు.

రెండవ మైనార్టీ వైస్ చాన్సలర్...

శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఎస్ఎం రహంతుల్లా రెండవ మైనార్టీ వైస్ చాన్సలర్ కావడం విశేషం. యూనివర్సిటీ స్థాపించినప్పటి నుంచి నేటికి పది మంది వైస్‌ఛాన్సలర్ల తర్వాత రహంతుల్లా పదకొండవ వీసీ. 1981 నుంచి 1987 వరకు ఏబెల్ వైస్ చాన్సలర్‌గా పనిచేశారు. 1988 నుంచి 91 వరకు వెంకటరెడ్డి, 1991 నుంచి 94 వరకు కేశవమూర్తి, 1995 నుంచి 98 వరకు పీఆర్ నాయుడు, 1999 నుంచి 2001 వరకు సరస్వతీరావు, 2002 నుంచి 2005 వరకు ఇక్బాల్ అహమ్మద్, 2005 నుంచి 2008 వరకు రామారావు, 2008 నుంచి 2010 వరకు కుసుమకుమారి, 2011 నుంచి 2014 వరకు రామక్రిష్ణారెడ్డి, 2015 నుంచి 2018 వరకు రాజగోపాల్ వైస్ చాన్సలర్లుగా పనిచేశారు.

కాంగ్రెస్‌ను ఎదుర్కోలేకే ప్రాంతీయ పార్టీలతో బీజేపీ పొత్తు



విశాలాంధ్ర - మడకశిర టౌన్ : దేశంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యంలేక ప్రాంతీయ పార్టీలతో బీజేపీ పొత్తుకు యత్నిస్తోందని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా మడకశిరలోని నీలకంఠ కోల్డ్‌స్టోరేజీ ప్రాంగణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ బీజేపీకి సంపూర్ణ మెజార్టీ లేదన్నారు. ఈ కారణంతోనే ప్రాంతీయ పార్టీలతో పొత్తుకు సిద్ధమవుతోందన్నారు. కాంగ్రెస్‌కు 12 రాష్ట్రాల్లో స్పష్టమైన మెజార్టీ ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో 200కుపైగా ఎంపీ సీట్లతో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందన్నారు. జగన్, కేసీఆర్‌తో కలిసి పోటీ చేసినా తప్పులేదన్నారు. తెలంగాణ ప్రజలకు ఎలాంటి సెంటిమెంట్ ఉందో ఆంధ్రులకు కూడా అలాంటిదే ఉందన్న విషయం గ్రహించాలన్నారు. సమావేశంలో మాజీ శాసనసభ్యులు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంజునాథ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీఆటోను తగులబెట్టిన మావోయిస్టులు



విశాలాంధ్ర - చింతూరు : తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్ళపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేగ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం టాటా ట్రాలీ ఆటోను మావోయిస్టులు తగులబెట్టారు. డీజిల్ ట్యాంకును పగులగొట్టి నిప్పు అంటించారు. ఈ వాహనం చత్తీస్‌గడ్ రాష్ట్రం సుక్మాజిల్లా కుంట గ్రామానికి చెందిన అపరాల వ్యాపారి దేశి వెంకటేశ్వర్లుదిగా గుర్తించారు. ఏడుగురాళ్ళపల్లి సంతకు ఎప్పటిలాగానే శుక్రవారం తన ట్రాలీ ఆటోతో కుంట నుంచి బయలుదేరి పేగ గ్రామంలో అపరాల కొనుగోలుకు వెళ్ళాడు. అక్కడ సాధారణ వేషధారణలో మాటువేసిన మావోయిస్టులు ట్రాలీ ఆటో వద్దకు వచ్చి డ్రైవర్‌తో సహా అపరాల వ్యాపారిని చితకబాదారు. గిరిజన గ్రామాలకు వచ్చి అపరాలు కొనుగోలు చేస్తే చంపుతామని హెచ్చరించారు. తర్వాత వాహనానికి నిప్పు పెట్టారు. తూనికలు, కొలతల్లో మోసం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో గతంలోనూ మావోయిస్టులు హెచ్చరించినట్లు తెలుస్తోంది.

స్విట్జర్లాండ్‌లో సిక్కోలు వాసి మృతి



విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గరుడబద్ర పంచాయతీకి చెందిన ఎరువల్లి చంద్రశేఖర్ (38) స్విట్జర్లాండ్‌లో రోడ్డుప్రమాదంలో మృతి చెందినట్లు ఆయన తండ్రి అప్పలస్వామి స్థానిక విలేకరులకు శుక్రవారం తెలిపారు. చంద్రశేఖర్ ఉద్యోగ రీత్యా 14 ఏళ్ళుగా స్విట్జర్లాండ్‌లో పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య సోని, ఇద్దరు ఆడపిల్లలున్నారు. సోని ఢిల్లీకి చెందిన అమ్మాయి. వీరు కూడా స్విట్జర్లాండ్‌లోనే ఉద్యోగ రీత్యా స్థిరపడి అక్కడే నివాసం ఉంటున్నారు. మూడురోజుల క్రితం చంద్రశేఖర్ ఆన్ డ్యూటీలో ఉండగా ప్రమాదవశాత్తూ వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. చంద్రశేఖర్ మృతితో సిక్కోలు జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని గరుడబద్ర పంచాయతీలో విషాదఛాయలు అలముకున్నాయి.

వివాదాల సుడిగుండంలో 'గుండ్రేవుల'

- అంతర్రాష్ట్ర వివాదమంటూ ప్రభుత్వం వెనుకంజ
- ప్రజలకిచ్చిన హామీని నిలుపుకోని సీఎం చంద్రబాబు
- రాజకీయాలకతీతంగా పోరాటాలకు రైతన్న సమాయత్తం



సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామంలో తుంగభద్రను పరిశీలిస్తున్న రావుల వెంకయ్య, జగన్నాథం (దాచిన చిత్రం)

విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : మూడు రాష్ట్రాలతో ముడిపడిన గుండ్రేవుల జలాశయం వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. కర్నూలు, కడప జిల్లాలకు వరప్రదాయిని అయిన ఈ ప్రాజెక్టు కర్నూలు పట్టణంతోపాటు కోడుమూరు, గూడూరు, సిబెళగల్ మండల ప్రజలకు చిరకాల స్వప్నం. ఇది పూర్తయితే లక్షలాది మందికి తాగునీటితోపాటు సుమారు రెండులక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్న ఆశ. ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు కోసం కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రాంత జనం ఎదురుచూస్తూనే ఉన్నారు. 2010లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వేకు జీవోతోపాటు నిధులు మంజూరు చేసినా, తర్వాత సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర విభజన తరువాత తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గుండ్రేవుల పూర్తిచేస్తానని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఊసేలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల ఓర్వకల్లు విమానాశ్రయం ప్రారంభోత్సవ వేళ అంతర్రాష్ట్ర వివాదాల్లోని ప్రాజెక్టులు తప్ప జిల్లాలోని మిగిలిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చంద్రబాబు చెప్పడం వీరి ఆశలపై నీళ్లు చల్లినట్టు అయ్యింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు ఉపయోగకరమైన గుండ్రేవుల జలాశయం కోసం ఇరు రాష్ట్రాల జలవనరులశాఖ మంత్రులు, ఉన్నతాధికారులు చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా కసరత్తు జరగకపోవడం విశేషం.

కర్నూలు జిల్లాకు శాశ్వత కరవు నివారణ చర్యల్లో అత్యంత కీలకమైన గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు హంద్రీనీవా పరీవాహక ప్రాంత మండలాల్లోని 108 చెరువుల ద్వారా సాగునీరు అందించడం. 1863-1867 మధ్యలో నాటి డచ్ కంపెనీ తుంగభద్ర నదిపై రిజర్వాయర్ నిర్మించింది. దీనికి అనుసంధానంగా కర్నూలు-కడప (కేసీ) కాల్వ నిర్మించారు. ఈ మార్గాన్ని డచ్ కంపెనీ ఇంగ్లాండ్‌కు అమ్మివేసింది. 1919లో బ్రిటిష్ ప్రభుత్వం 19,465 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంది. 1944లో ఆయకట్టును 44 వేల ఎకరాలకు విస్తరించారు. స్వాతంత్ర్యం అనంతరం 1974లో ప్రభుత్వం కృష్ణా బేసిన్‌కు జస్టిస్ బచావత్ కమిటీ 39.9 టీఎంసీల నీరు కేటాయించింది. 10 టీఎంసీల నీటిని తుంగభద్ర జలాశయం నుంచి తీసుకుంటే, మిగిలిన 29.9 టీఎంసీలు సుంకేసుల నుంచి తుంగభద్ర నదీ ప్రవాహం ఉన్నప్పుడు తీసుకుంటూ కర్నూలు- కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, కడప, కర్నూలు నగరాలతోపాటు రెండు జిల్లాల్లోని పలు గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం ఉంటే తప్ప కేసీకి నీరు తీసుకోలేని పరిస్థితి ఉంది. కళ్ళెదుటే వందల టీఎంసీలు కృష్ణాలో కలిసి సముద్రం పాలవుతున్నా కరవు రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. కొన్నేళ్లుగా తుంగభద్ర నదికి అనుకున్న స్థాయిలో నీరు చేరడం లేదు. తుంగభద్ర డ్యాంలోని కేసీ వాటలో సగానికి పైగా అనంతపురము జిల్లాకు మళ్ళిస్తే మిగిలిన నీరు కర్ణాటక సరిహద్దుదాటి సగం కూడా రాలేని పరిస్థితి. ఫలితంగా కీలకదశలో నీటి తడులు అందక కర్నూలు, కడప జిల్లాల్లో ఏటా వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పెట్టుబడులు కూడా రాక రైతులు నష్టపోతున్నారు. ఈ కష్టాల నుంచి గట్టెక్కడానికి ఈ రెండు జిల్లాల రైతులకు ఎంతో ఉపయోగపడుతుందనే ఆలోచనలో పుట్టిందే గుండ్రేవుల ప్రాజెక్టు. దీంతో ప్రాజెక్టు సర్వేకు ప్రభుత్వం జీవో నంబరు 100ను జారీ చేసింది. సుంకేసుల జలాశయం ఉపరితలంలో సి బెళగల్ మండల పరిధిలో గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే కీలక దశలో సాగునీరు ఇచ్చి కేసీ కాల్వ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించడంతోపాటు 15 నుం 20 టీఎంసీల నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా నిల్వచేయవచ్చని అంచనా వేశారు. సి బెళగల్, గూడూరు, కర్నూలు, కోడుమూరు మండలాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు స్థిరీకరణతో కరవు నివారణ, కర్నూలు నగరంలోని సుమారు 6 లక్షల మంది జనాభా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని నీటిపారుదలశాఖ నిపుణులు సుబ్బరాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గతంలో నివేదిక అందజేశారు. 2013లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గుండ్రేవుల ప్రాజెక్టు సర్వేకు జీవో జారీతోపాటు 54.95 లక్షలను విడుదల చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్వీ కన్‌స్ట్రక్షన్ సంస్థ సర్వే పూర్తి చేసి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2,500 కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం గమనార్హం.

సర్వేను అడ్డుకున్న తెలంగాణ రైతు

మూడు రాష్ట్రాలతో ముడిపడిన గుండ్రేవుల జలాశయంపై కర్ణాటక రాష్ట్రం అభ్యంతరాలు తెలుపకపోయినా, తెలంగాణ ప్రాంత రైతులు సర్వేను అడ్డుకున్నారు. రెండు రాష్ట్రాల రైతులకు ప్రయోజనం చేకూరే ప్రాజెక్టు అయినా అవగాహన లేకపోవడంతో అడ్డుకుంటున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కర్నూలు, కడప జిల్లాల ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు నిర్వహిస్తే ప్రాజెక్టు స్వప్నం సాకారం అవుతుందని ఈ ప్రాంత రైతులు బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ ప్రభుత్వం జూరాల- శ్రీశైలం ప్రాజెక్టు మధ్య రెండు ప్రాజెక్టుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. భవిష్యత్‌లో భారీ వరదలు వస్తే తప్ప శ్రీశైలానికి నీరు చేరే అవకాశం లేదు. వరదలు వస్తే సబ్‌బేసిన్ అయిన తుంగభద్ర ద్వారానే శ్రీశైలానికి 100 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉంది. కృష్ణానదికి వరద వస్తే ఎగువన గుండ్రేవుల ప్రాజెక్టు ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. కేసీ రైతులకు అత్యవసరమైతే శ్రీశైలంలో 798 అడుగుల నీరు ఉన్నప్పటికీ దీని ద్వారా నీరు తరలించే అవకాశాలు ముచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా లభిస్తున్నాయి. గుండ్రేవుల ద్వారా కోడుమూరు, సిబెళగల్, గూడూరు మండలాల్లో మరింత ఆయకట్టుకు నీరు ఇవ్వడమే కాకుండా కర్నూలు నగరానికి తాగునీటి కష్టాలు తీర్చేందుకు శాశ్వత పరిష్కా రం లభిస్తుంది. గుండ్రేవుల నిర్మాణం కోసం రాజకీయ పార్టీలకతీతంగా పోరాటానికి రైతులు సహాయత్తమవుతున్నారు.

సీఎం కాలయాపన చేయడం తగదు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలైనా గుండ్రేవుల సమస్యను చంద్రబాబు పక్కన పెట్టారు. ఇది మంచిదికాదు. నేటికీ తెలంగాణ రాష్ట్రంతో ఎటువంటి చర్చలు నిర్వహించలేదు. గుండ్రేవులను పూర్తిచేస్తానని జనం సాక్షిగా మాటిచ్చి నేడు అంతర్రాష్ట్ర వివాదం ఉందని చెప్పడం దారుణం. కర్నూలు జిల్లాకు రావాల్సిన నీటి వాటాను ఎగువన కర్ణాటక రైతులు జలచౌర్యం చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గుండ్రేవుల కోసం పార్టీలకతీతంగా పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది.

కె. జగన్నాథం, కర్నూలు జిల్లా కార్యదర్శి, ఏపీ రైతుసంఘం

నాల్గవ తరగతి ఉద్యోగులకు 30 రోజులు ఆర్జిత సెలవులివ్వాలి



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలోని నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఏడాదికి 30 రోజుల ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల నాల్గవ తరగతి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం (అమరావతి) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగు జాన్ కోరారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం 13 జిల్లాల సంఘ సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తమను హీనంగా చూస్తున్నారన్నారు. కొందరు అధికారులు మరుగుదొడ్లను శుభ్రం చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నాల్గవ తరగతి సిబ్బంది ఎవరూ ఆ పనులు చేయాల్సిన అవసరం లేదన్నారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి సిబ్బందిని నియమించాలన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల్లో బీఏ, బీఈడీ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు 20 ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెండు కళాశాల హాస్టల్స్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో వాటిని ఏజెన్సీలకు కాకుండా తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శి కె.క్రిష్టప్ప, కోశాధికారి పి.లక్ష్మీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డుల పంపిణీ ఏజెన్సీ మోసం

- 41 కార్డులతో రూ.7 లక్షలు చోరీ
- బాధిత ఖాతాదారులంతా అబ్దుల్లాపురం గ్రామస్తులు

విశాలాంధ్ర - వెలుగోడు : కర్నూలు జిల్లా వెలుగోడులోని కర్నూలు జిల్లా సహకార బ్యాంకు ఏటీఎం ద్వారా నకిలీ ఏటీఎం కార్డులతో సుమారు రూ.7లక్షల వరకు డబ్బు డ్రా చేసిన ఘటన వెలుగుచూసింది. బాధితులంతా వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం గ్రామస్తులేనని బ్యాంకు మేనేజర్ భూమా నారాయణరెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బ్యాంకు ఖాతాదారులకు ఏటీఎం కార్డులను పంపిణీచేసే బాధ్యతను జయా ఇన్ఫోసిస్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఏజెన్సీ ప్రతినిధి మధు ఆత్మకూరుకు చెందిన మరో వ్యక్తి మహేంద్రకు ఏటీఎం కార్డుల పంపిణీని సబ్ కాంట్రాక్టు ఇచ్చారు. ఈ ఏజెన్సీ ద్వారా కర్నూలు జిల్లా సహకార బ్యాంకు పరిధిలో 626 ఏటీఎం కార్డులను పంపిణీ చేశారు. వీటిలో 295 కార్డులను అబ్దుల్లాపురం గ్రామంలో పంపిణీచేశారు. 15 ఖాతాదారుల కార్డులను ఎంచుకున్న నిందితుడు డబ్బు డ్రా చేసినట్టు అధికారులు గుర్తించారు. అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన బాధితుడు పి. సత్యనారాయణరెడ్డి అకౌంట్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.39 వేలు డ్రా చేసినట్లు గుర్తించి బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని పరిశీలించిన అధికారులు సుమారు 41 అకౌంట్ల నుండి ఏటీఎం ద్వారా డబ్బు దారిమళ్ళినట్టు గుర్తించారు. అదే గ్రామస్తురాలు వరలక్ష్మమ్మ అకౌంట్ నుంచి రూ.17,500, సరస్వతమ్మ అకౌంట్ నుంచి రూ.20 వేలు డ్రా చేసినట్టు గుర్తించారు. మిగతా అకౌంట్లలో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు లాగేశారు. గుర్తుతెలియని వ్యక్తి బ్యాంకు సెలవుదినాలు అయిన 13వ తేదీ నుంచి 16వ తేదీ మధ్య వెలుగోడు ఇండికా ఏటీఎం ద్వారా, హైదరాబాద్‌లోని శంషాబాద్ ఏటీఎం నుంచి డబ్బు డ్రా చేసినట్లు బ్యాంకు మేనేజర్ తెలిపారు. వెలుగోడు ఏటీఎంలోని సీసీ ఫుటేజ్ పరిశీలించగా నింది తుడు మాస్క్‌వేసుకొని డబ్బు డ్రా చేసినట్లు తెలిసింద న్నారు. ఏజెన్సీ పంపిణీచేసిన 626 కార్డులను బ్లాక్ చేశామని. బాధితులకు ఎలాంటి నష్టం లేకుండా రెండు రోజుల్లో పూర్తి వివరాలు సేకరించి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ వంగాల వెంకట్రామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భూముల వేలం రద్దు

- ఆరు గ్రామాల రైతుల ఆందోళన
- దిగివచ్చిన మాన్సాస్ ట్రస్ట్



విశాలాంధ్రబ్యూరో - విజయనగరం : ఏళ్ల తరబడి భూముల సాగుతో బతుకుతున్న రైతుల పొట్టకొట్టేందుకు మాన్సాస్ ట్రస్టు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. రైతులంతా మూకుమ్మడిగా వ్యతిరేకించడంతో మాన్సాస్ దిగివచ్చింది. వేలం పాట రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రామవరం గ్రామంలో 5.06 ఎకరాలు, వేపాడ మండలం దబ్బిరాజుపేట గ్రామంలో 8.09 ఎకరాలు, బొండపల్లి మండలం రయాంద్రంలో 7.35 ఎకరాలు, చీపురుపల్లి మండలం పోతయ్యవలసలో 7.80 ఎకరాలు, దత్తిరాజేరు మండలం దత్తివెంకటాపురంలో 32.61 ఎకరాలు, భూపాలపురంలో 24.42 ఎకరాల మాన్సాస్ భూమిని బహిరంగ వేలం ద్వారా విక్రయించేం దుకు ఇటీవలే దేవదాయశాఖ ప్రకటన జారీ చేసింది. ఈ నెల 18, 19 తేదీల్లో తమ కార్యాలయం వద్ద వేలం ఉంటుందని ప్రకటనలో పేర్కొనడంతో, ఆయా భూముల సాగుదారులు శుక్రవారం పెద్దసంఖ్యలో విజయనగరం చేరుకున్నారు. కోటలోని మాన్సాస్ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. మరోవైపు టెండరు దారులు కూడా కార్యాలయానికి చేరుకున్నారు. ఆ భూములను నమ్ముకొని కొన్నేళ్లుగా కుటుంబాలను పోషించుకుంటున్నామని, వేలాన్ని రద్దు చేయడంతోపాటు తమకు హక్కు కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో మాన్సాస్ అధికారులు రైతులతో చర్చలు జరిపారు. జాయింట్ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, మాన్సాస్ వ్యవహారాలు చూస్తున్న ట్రస్టు ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితీ కూడా పాల్గొన్నారు. లీజు సొమ్ము చెల్లించేందుకు రైతులు హామీ ఇచ్చారు. దీంతో వేలాన్ని నిలిపివేసున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే టెండర్లు వేసిన వారికి ధరావతును తిరిగి చెల్లిస్తామని ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది.

బందరు పోర్టు ఎన్ని'కల' అస్త్రమే

- శంకుస్థాపన ముహూర్తానికి వాయిదాల పర్వం
- ఫిబ్రవరి మొదటివారమంటూ కొత్త తేదీ
- పురోగతి లేని పట్టాభూమి కొనుగోళ్లు
- రుణం ఇచ్చేందుకు బ్యాంకుల వెనుకంజ



విశాలాంధ్ర - మచిలీపట్నం : మచిలీపట్నం పోర్టు పనుల శంకుస్థాపన ముహూర్తం వాయిదాల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వ పెద్దల ప్రకటనలను గమనిస్తున్న ఈ ప్రాంత జనం కొత్త పునాది రాయి మళ్లీ ఎన్నికల అస్త్రంగా మిగిలిపోతుందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జన్మభూమి కొనసాగిన పది రోజుల వ్యవధిలో సాక్షాత్తు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర రోజుకో తేదీ ప్రకటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోర్టు పనులకు శంకుస్థాపనకు వస్తున్నారని ప్రచారం చేశారు. చివరకు ముగింపురోజైన ఈ నెల 11వ తేదీన రిమోట్ ద్వారా చేస్తారని ప్రకటిస్తారన్న మంత్రి మళ్లీ ఈ నెల 27వ తేదీన సీఎం వస్తారని చెప్పారు. తాజాగా సంక్రాంతి వేడుకల్లో మంత్రి రవీంద్ర ఫిబ్రవరి మొదటివారంలో పోర్టు పనులకు చంద్రబాబు శంకుస్థాపన చేస్తారని ప్రకటన చేయగా, ఇదే వేడుకల్లో మరో రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు త్వరలో పోర్టు డ్రెడ్జింగ్ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పోర్టు పనుల సమాచారాన్ని ముఖ్యమంత్రికి చెప్పకుండానే ప్రజలను మభ్యపెట్టేందుకు రకరకాల తేదీలు ప్రకటించారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అధికారులు, పాలకులకు శంకుస్థాపనపై స్పష్టత లేకపోవడం గమనార్హం. ముఖ్యమంత్రి శంకుస్థాపనకు వచ్చేలోపు నవయుగ సంస్థ భారీ యంత్రాలను ఇక్కడకు తీసుకువస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర పలుమార్లు చెప్పినా ఒక్కటి కూడా తీసుకువచ్చిన దాఖలాలు లేవు.

పట్టాభూమి కొనుగోలు అంతంత మాత్రమే

పోర్టు నిర్మాణానికి 4,800 ఎకరాల భూమి అవసరమని నిర్ణయించారు. దీనిలో 3,010 ఎకరాలను 2016 మార్చి నెలలోనే సమీకరించి కాకినాడ పోర్టు డైరెక్టర్‌కు అప్పగించారు. మిగిలినది పట్టాభూమి కావడంతో రైతుల నుంచి కొనుగోలుకు ఇటీవల ఎంయూడీఏకు రూ.200 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నగదుతో 1,585 ఎకరాలను ఎకరం రూ.25 లక్షల చొప్పున కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. భూమి పత్రాలు సక్రమంగా లేకపోవడంతో విక్రయించిన రైతులకు నగదు చెల్లింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ముడా అధికారులు చెబుతున్నారు. నేటికీ కేవలం 450 ఎకరాలను మాత్రమే రైతులు కొనుగోలు చేశారు. భూమి కొనుగోలు, ఇతర పనుల కోసం మొత్తం రూ.1,380 కోట్లను వివిధ బ్యాంకుల నుంచి రుణంగా తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెబుతూ వస్తున్నారు. ఇంత పెద్దమొత్తం రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాకపోవడంతో పోర్టు పనుల ప్రారంభంపై సర్వత్రా చర్చ సాగుతోంది.

పొత్తుల్లేకుండానే వైసీపీ పోటీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రత్యేక హోదా కోసం పొరుగు రాష్ట్రం సహాయం చేయడమంటే కలిసి పోటీచేయడం కాదని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఏ రాజకీయ పార్టీతో పొత్తుల్లేకుండానే ముందుకు సాగుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమన్నారు. దీనికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి ఫలిస్తే ఏడాదిలోపే హోదా వస్తుందన్నారు. నాలుగేళ్ళపాటు కాలయాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీపై నిందలు మోపుతున్నారన్నారు. వైసీపీ తొలినుంచి ప్రత్యేకహోదా కోసమే నిరంతరం పోరాడుతుంటే చంద్రబాబు మాత్రం ప్రత్యేక హోదా కన్నా ప్యాకేజీ ముద్దు అని, ఇప్పుడు బీజేపీపై నింద మోపడం సరికాదన్నారు.

యూపీలో కొనసాగుతున్న పేర్ల మార్పు ప్రక్రియ

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం పేర్ల మార్పు ప్రక్రియను కొనసాగిస్తోంది. చందౌలీ జిల్లాలోని మొఘల్‌సరాయ్ తెహిసిల్ పేరును పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ తెహిసిల్‌గా మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి శుక్రవారం రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆరెస్సెస్ సిద్ధాంతకర్త, భారతీయ జనసంఘ్ సహ వ్యవస్థాపకులుగా వ్యవహరించారు. గత ఏడాది ఆగస్ట్‌లో మొఘల్‌సరాయ్ జంక్షన్‌ను పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జంక్షన్‌గా మార్చిన సంగతి తెలిసిందే. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద జనసమ్మర్ద రైల్వేస్టేషన్‌గా పేరొందిన మొఘల్‌సరాయ్ రైల్వే స్టేషన్‌ను ఇటీవల బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్, సీఎం యోగి ఆదిత్యానాథ్‌లు ప్రారంభించారు. కాగా ప్రముఖ నగరాలు, స్టేషన్లు, ఇతర సంస్థల పేర్లను యూపీ ప్రభుత్వం మార్చడం పట్ల రాష్ట్ర మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. స్టేషన్‌ల పేర్లను మార్చినంత మాత్రాన రైళ్లు సకాలంలో రావని, రైల్వేల పనితీరును ప్రభుత్వం మెరుగుపరచాలని ఆయన చురకలు వేశారు. కాగా ఇటీవల యూపీ ప్రభుత్వం చారిత్రక పట్టణం అలహాబాద్ పేరును ప్రయాగరాజ్‌గా మార్చిన సంగతి తెలిసిందే. అలహాబాద్‌కు ఆ పేరును 1575లో మొఘల్ చక్రవర్తి అక్బర్ ప్రతిపాదించారు.

హోదాకు జగన్ వెన్నుపోటు : తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదాతో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, అలాంటి హోదాకు వైసీపీ అధినేత జగన్ వెన్నుపోటు పొడవడం దారుణమని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.తులసిరెడ్డి దుయ్యబట్టారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందీ, అమలు చేయాల్సిందీ కేంద్ర ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వానికి హోదా అమలు చేసే సత్తా లేదని తేలిపోయిందని పేర్కొన్నారు. కేంద్రంలో ఫెడరల్‌ఫ్రంట్ ఏర్పాటు ఒక నాటకమని, రాష్ట్రానికి హోదా దక్కకుండా కేసీఆర్ సైంధవునిలా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఆంధ్రులపై చులకనగా మాట్లాడుతున్న కేసీఆర్‌తో జగన్ లాలూచీ పడి, ఫెడరల్ ఫ్రంట్‌లో చేరడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే..రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.



ఆందోళనకు సిద్ధం కండి

మున్సిపల్ కార్మికులకు ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని, దీనికి నిరసనగా కార్మికులు ఆందోళనకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. శుక్రవారం గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ జీవో 279 రద్దు, వేతనాల పెంపు, క్రమబద్ధీకరణ, సీపీఎస్ విధానం రద్దు, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని, జీవో 151 అమలు కోసం గతేడాది అక్టోబరులో 30వేల మంది ఒప్పంద మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే ప్రభుత్వం మూడు మాసాల లోపు సమస్యను పరిష్కరిస్తామని హామీలతో కూడిన అగ్రిమెంట్ ఇచ్చిందన్నారు. కానీ మూడు నెలలు కావస్తున్నా ఆ హామీలు అమలు చేయడంలో అలసత్వం వహిస్తుందని విచారం వ్యక్తం చేశారు. అరియర్స్‌ను ఇన్సెంటివ్ పేరుతో ఇస్తామని చెప్పిన ప్రభుత్వం..అందుకు భిన్నంగా ఆర్టీఎంఎస్ పర్సంటేజీల ప్రాతిపదికన కార్మికులకు ఇన్సెంటీవ్ ఇవ్వాలని సర్క్యులర్స్ పంపిందన్నారు. ఇది పూర్తిగా చట్ట వ్యతిరేకమన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిర్ల కృష్ణారావు, పోరుమామిళ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 29న ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు, 30న మున్సిపల్ కార్యాలయాల వద్ద మానవహారాలు చేపట్టి..ఫిబ్రవరి 2న గుంటూరులోని డీయంఏ కార్యాలయం వద్ద కార్మికులతో సామూహిక దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసుల రంగనాయకులు, ఉపాధ్యక్షులు బజంతి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు కరపాటి సత్యనారాయణ, పులగం మద్దిలేటి, కోశాధికారి కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

స్పీకర్‌గా పోచారం బాధ్యతల స్వీకరణ


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ శాసనసభ సభాపతిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం శాసనసభ సమావేశాలు ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రకటించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డిని సభాపతి పీఠాన్ని అధీష్టించాల్సిందిగా కోరారు. స్పీకర్‌గా ఎన్నికైనందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్, మాజీమంత్రి ఈటల రాజేందర్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా ఆయనను స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. తెలంగాణ శాసనసభాపతిగా ఎన్నుకున్నందుకు సీఎం కేసీఆర్‌కు, సభ్యులకు పోచారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి అత్యంత కీలకమని.. సభ నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సభకు అంతరాయం కలిగించడం గౌరవప్రదం కాదన్నారు. తెలంగాణ శాసనసభను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని, సభ గౌరవాన్ని ఇనుమడింపజేసేందుకు అంతా కలిసి పనిచేయాలని సభ్యులకు పోచారం పిలుపునిచ్చారు. అనంతరం సభను శనివారానికి వాయిదా వేశారు.

పోచారం లక్ష్మీపుత్రుడు: కేసీఆర్

'పోచారం శ్రీనివాసరెడ్డి లక్ష్మీపుత్రుడు. బాన్సువాడ ఉప ఎన్నికలో అఖండ మెజార్టీతో గెలిచిన ఆయనను ముద్దుగా లక్ష్మీపుత్రుడని పిలుస్తారు. వ్యవసాయ మంత్రిగా రైతు బంధు, రైతు బీమా పథకాల ద్వారా దేశానికి ఆదర్శంగా తెలంగాణను నిలిపారు. ఐక్యరాజ్య సమితి కూడా ప్రశంసించింది' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. సభా నాయకుడి హోదాలో ఆయన ప్రసంగిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కావాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో చర్చించామన్న కేసీఆర్ సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో గొప్ప సేవలు అందించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో పోచారం గ్రామస్థులు సంబురాలు చేసుకున్నారన్నారు. వివిధ దినపత్రికలలో '.స్పీకర్‌గా పోచారం' అని రాశారని, అది ఆయన ఇంటిపేరు పరిగె అని కేసీఆర్ చెప్పారు. స్వగ్రామం పేరును ఇంటిపేరుగా పెట్టుకోవడం గొప్పతనమన్నారు.

హోటళ్ల రాకతో రాజధానికి కళ

- ఏడు 5స్టార్ హోటళ్లకు భూ కేటాయింపు
- సీఆర్‌డీఏ సమీక్షలో చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎన్ని హోటల్ గదులు వస్తే రాజధానిలో అంత త్వరగా ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని సీఎం చంద్రబాబు అన్నారు. విమానయాన సేవలు, కళాశాలలు, విద్యాసంస్థలు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లే కొత్త నగరాల భవితవ్యాన్ని నిర్దేశించే వనరులని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశంలో ఏడు ప్రముఖ 5 స్టార్ హోటళ్లకు భూ కేటాయింపు ధృవీకరణ లేఖలు అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాలతో అమరావతికి పూర్తిస్థాయి రాజధాని కళ వస్తుందన్నారు. ఏడు హోటళ్లలో జీవీ ఎస్టేట్ అండ్ హోటల్స్ (వివెంటా), ఓంశ్రీ భావనసాయి ఎల్‌ఎల్‌పీ (వెస్ట్ ఇన్), నరరస్ ట్రావెల్స్ (మ్యారియెట్), కాంధారి హోటల్స్ (ఫార్చ్యూన్), అంబికా అగరబత్తీస్ అరోమా (రెజెంటా ఇన్), స్పెండర్ ల్యాండ్ బేస్ (జింజర్), స్వాగత్ మోటల్స్ (కీన్ సెలెక్ట్) ఏర్పాటు కానున్నాయని తెలిపారు. వీటితో కలిపి రాజధానిలో నిర్మాణమయ్యే హోటళ్ల సంఖ్య 16కు చేరుతుందన్నారు. రాజధానిలో కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థ (డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్)ను గ్యాస్, వాటర్, విద్యుత్, రోడ్, ఫైబర్ గ్రిడ్ తరహాలో ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు అంశంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఒక ఉన్నత స్థాయి బృందం కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చి పరిశీలించి వెళ్లిందని సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఉన్న దుబాయ్ మెట్రోలోనూ, అబుదాబిలోని ఇథిహాద్ టవర్స్‌లోనూ ఈ వ్యవస్థను ఇప్పటికే వీరు విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అమరావతిలో 40 వేల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటుచేస్తున్న డి.సి.ఎస్. ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థగా నిలుస్తుందన్నారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను స్వయంగా చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున ఇక్కడికి వస్తున్నారని పురపాలక మంత్రి పి.నారాయణ సీఎంకు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులలో వస్తున్న వారి సంఖ్య రోజుకు 4వేల వరకు ఉందని, నిత్యం 10 వేల మంది రాజధాని సందర్శించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని సీఆర్‌డీఏ కమిషనర్ తెలిపారు. సందర్శకుల కోసం ఉద్దండరాయపాలెంలో బేస్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రూ.23.15 కోట్లతో అడ్వకేట్ బ్లాక్

రాజధానిలో సిద్ధమవుతున్న జ్యుడిషియల్ కాంప్లెక్స్‌కు అనుబంధంగా 71,506 చదరపు అడుగుల విస్తీర్ణంలో అడ్వకేట్ బ్లాక్‌ను నిర్మించాలని సమావేశం నిర్ణయించింది. వెంకటపాలెం సమీపంలో రూ.448 కోట్లతో ఐటీ పార్కు నిర్మాణాన్ని చేపట్టాలన్న ప్రతిపాదనకు ఈ సమావేశం ఆమోదం తెలిపింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ కోసం ఫోస్టర్ ప్లస్ పార్ట్‌నర్స్ ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కు కూడా ఆమోదముద్ర వేసింది. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) సీఎండీ లక్ష్మీ పార్థసారధి పాల్గొన్నారు.

ఐపీఎస్‌ల బదిలీలు, పదోన్నతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పలువురు ఐపీఎస్ అధికారులకు బదిలీలు, పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ శుక్రవారం జీవో నంబరు-142 ద్వారా ఉత్తర్వులు జారీచేశారు. రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యానికి అడిషనల్‌డీజీగా, కృపానంద్ త్రిపాఠి ఉజాలకు హోమ్ గార్డ్స్ అడిషనల్ డీజీగా పదోన్నతి కల్పించారు. లాజిస్టిక్స్ అడిషనల్‌డీజీగా హరీష్‌కుమార్ గుప్తాను, గ్రేహౌండ్స్‌ఐజీగా వినీత్ బ్రిజ్‌లాల్, ఏలూరురేంజ్ డీఐజీగా త్రివిక్రమ్‌వర్మ, విశాఖరేంజ్ డీఐజీగా పాలరాజ్, టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా సిహెచ్.శ్రీకాంత్‌ను నియమించారు.

రేపు 'సామాజిక అసమానతలు-మీడియాపాత్ర'పై సెమినార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కంఠంనేని రవీంద్రరావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన విజయవాడ పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10.30గంటకు నుంచి 'సామాజిక అసమానతలు-మీడియాపాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. దీనికి ముఖ్య ఉపన్యాసకులుగా రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ విచ్చేస్తారు. ప్రత్యేక అతిథులుగా ఆంధ్రా వర్సిటీ బీఆర్ అంబేద్కర్ లా కళాశాల ప్రొఫెసర్ ఎస్.నిర్మల, బౌర్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. ప్రతిఏటా నిర్వహిస్తున్న కంఠంనేని రవీంద్రరావు స్మారకోపన్యాసంలో భాగంగా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నారు.

అవసరమైతే డ్యాన్స్ బార్లపై ఆర్డినెన్స్

ముంబై: మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లపై అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రభుత్వం శుక్రవారం స్పష్టం చేసింది. రాష్ట్రంలో డ్యాన్స్ బార్లను నియంత్రించేందుకు తగిన నిబంధనలను అమలు చేసేందుకు అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని తెలిపింది. మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లకు షరతులతో కూడిన అనుమతి ఇస్తూ గురువారం సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ బార్ల లైసెన్స్‌లు, నిర్వహణపై విధించిన నిబంధనలు సరికాదని, నియంత్రణ ఉండొచ్చు కానీ అవి పూర్తి స్థాయి నిషేధానికి చేరుకోకూడదని సుప్రీంకోర్టు వెల్లడించింది. 2005 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం డ్యాన్స్ బార్ల ఏర్పాటుకు ఒక్కరికి కూడా లైసెన్స్ మంజూరు చేయని విషయాన్ని ప్రస్తా వించింది. 'సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ విభాగం అధికారులతో చర్చించిన అనంతరం అవసరమైతే డ్యాన్స్ బార్లను నిషేధిం చేందుకు ఆర్డినెన్స్ తీసుకొస్తాం' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివర్ వెల్లడించినట్లు ఓ మీడియా పేర్కొంది.

తొలితరం కమ్యూనిస్టు నరసింహయ్య కన్నుమూత



విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్ : తొలితరం కమ్యూనిస్టు, సీపీఎం సీనియర్ నాయకుడు తెలకపల్లి నరసింహయ్య కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో కుమారుడు, ప్రజాశక్తి విశ్రాంత ఎడిటర్ తెలకపల్లి రవి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. 1928, జూన్ 8న సరస్వతమ్మ, రామయ్య దంపతులకు నరసింహయ్య జన్మించారు. వారి స్వగ్రామం కర్నూలు మండలం గర్గేయపురం. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఆయన కర్నూలు జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి పునాది వేశారు. 1943లో గుంటూరులోని ఏసీ కాలేజీలో డిగ్రీ చదివారు. 1945లో ఆయనకు తన మేనమామ కుమార్తె టీసీ లక్ష్మమ్మతో వివాహమైంది. 1947లో జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో చిరుఉద్యోగం లో చేరారు. గార్గేయపురంలో భూస్వాములకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాడారు. 1952లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని పొంది కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లారు. ఆ క్రమంలో గ్రామాల్లో యువజన సంఘాలను ఏర్పాటు చేశారు. భూస్వాములు, పెత్తందారుల అరాచకాలను అరికట్టేందుకు పోరుబాట పట్టారు. ప్రధానంగా రైతాంగ సమస్యలు, కరవు, తాగు, సాగునీరు కోసం అనేక ఉద్యమాలు చేపట్టారు. జిల్లావాసుల వలసలను నివారించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. కరవు గ్రామాల్లో గంజి కేంద్రాలు పెట్టి ప్రజలను ఆదుకునే ప్రయత్నం చేశారు. రాయలసీమ పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై పోరాడేలా యువకులను ప్రోత్సహించి కార్మికుల ఐక్యత కోసం కృషి చేశారు. 1977లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు చాలా కాలం అజ్ఞాత జీవితాన్ని గడిపారు. నెలల తరబడి జైల్లో ఉన్నారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి, కామ్రేడ్ నీలం రామచంద్రయ్య, కామ్రేడ్ ఎస్ సుంకన్న, కర్నూలు సీఐటీయూ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పి.సూర్యనారాయణ, పత్తికొండ మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ కె.ఈశ్వరరెడ్డితో కలిసి ఎన్నో పోరాటాలు చేపట్టిన ఆయన నేటితరానికి ఆదర్శంగా నిలిచారు. కొత్తవారికి మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని బోధించే క్రమంలో మంచి ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందాడు. తన భార్యను మహిళా ఉద్యమకారిణిగా తయారుచేశారు. వీరిద్దరు ఆదర్శ దంపతులుగా, కమ్యూనిస్టు ఉద్యమానికి మార్గదర్శకులుగా నిలిచారు. నరసింహయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన భార్య గత ఏడాదిలో అనారోగ్యంతో మరణించారు. దీంతో నరసింహయ్య హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దనే తన శేషజీవితాన్ని గడిపారు.

సీపీఐ, సీపీఎం సంతాపం

నరసింహయ్య మృతికి సీపీఐ, సీపీఎం సంతాపాన్ని ప్రకటించాయి. కర్నూలు జిల్లా సీపీఎం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన నరసింహయ్య రాయలసీమ ప్రాంత వెనకబాటు సమస్యలపై, కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని సీపీఐ రాష్ట్ర సమితి శ్లాఘించింది. ఆయన కుమారుడు తెలకపల్లి రవి, ఇతర కుటుంబ సభ్యులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమం కాలం నుంచి నర్సింహయ్య సైద్ధాంతిక నిబద్ధతకు మారుపేరుగా నిలబడి, అనేక ఆటుపోట్లను తట్టుకొని కర్నూలు జిల్లాలో ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ముఖ్యపాత్ర పోషించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు కొనియాడారు. జిల్లాలో అనేకమంది నాయకుల్ని, కార్యకర్తల్ని రాజకీయంగా ప్రభావితం చేసి తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారన్నారు. తనతోపాటు తన కుటుంబాన్ని కూడా సిద్ధాంతం కోసం అంకితమయ్యేలా చేశారని తెలిపారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. నరసింహయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఐద్వా కథల పోటీలు

ఫిబ్రవరి 5లోగా రచనలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కందుకూరి వీరేశలింగం శతజయంతి సందర్భంగా నవంబరు 25 డిసెంబరు15 వరకూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఇతర సంఘాలతో కలిసి మహిళలపై హింసను ప్రతిఘటిద్దాం, మద్యాన్ని నియంత్రిద్దాం అనే నినాదంతో కార్యక్రమాలు చేపట్టింది. అలాగే వీరేశలింగం స్ఫూర్తితో కథల పోటీ నిర్వహిస్తోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరి స్త్రీ జన పక్షపాతిగా రచనలు చేశారు. స్త్రీలకు చదువు నేర్పించేందుకు కృషి చేశారు. సమాజ వెలివేతను అధిగమించి, వితంతు వివాహాలు జరిపించి మహోన్నత సంఘ సంస్కర్తగా నిలిచారు. జ్యోతిష్యం లాంటి మూఢాచారాలను తుదకంటా వ్యతిరేకించారు. స్త్రీల సమానత కోసం పరితపించారు. వారి శత వర్ధంతి నేపథ్యంలో సమకాలీన అంశాల ప్రాతిపదికగా కథల పోటీ జరపతల పెట్టామని రమాదేవి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల రచయితలందరూ మహిళా కోణం నుంచి కథలు పంపాలని కోరారు. వాటిలో ఎంపిక చేసిన ఉత్తమ కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5000, రూ.3000, రూ.2000, నగదు బహుమతులతోపాటు, వాటిని మానవి పత్రికలోనూ, ఐద్వా సావనీర్‌లోనూ ప్రచురిస్తామని తెలిపారు. కథ ఏ4 సైజ్ కాగితంపై చేతిరాతతో 9 పేజీలు ఉండాలని, డీటీపీలో అయితే 4 పేజీలు ఉండాలి. రచనలపై రచయిత, రచయిత్రులు పేర్లు రాయకూడదు. హామీపత్రంలో మాత్రమే పేరు, చిరునామా, ఫోన్ నెం, ఈ మెయిల్ వివరాలు రాయాలి. ఈమెయిల్ ద్వారా కూడా పంపించవచ్చు. డీటీపీ చేసిన వాటిని పీడిఎఫ్, ఓపెన్‌ఫైల్ పంపించాలి. ఇతర వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను 9490098620, 6309719616 సంప్రదించాలని కోరారు. ఫిబ్రవరి 5వ తేదీలోగా రచనలను కథల పోటీ, ఐద్వా, డోర్ నెం:31-5-6,ప్రకాశరావు వీధి, మారుతీనగర్, ఏలూరు రోడ్డు, విజయవాడ-4 అడ్రస్‌కు పంపాలని తెలిపారు.

శాసన సభలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శాసనసభలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని మంత్రిమండలి ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆ రాష్ట్ర సీఎం అశోక్ గహ్లోత్ శుక్రవారం వెల్లడించారు. మహిళల రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాహుల్ గాంధీ ఆదేశించారని తెలిపారు.

ప్రజారోగ్యంలో హ్యాపీనెస్ లక్ష్యం

- వచ్చే ఐదేళ్లలో దేశంలో నెంబర్ వన్‌గా స్విమ్స్
- వచ్చే ఏడాది నుంచి శాలరీ గ్రాంట్ బడ్జెట్
- స్విమ్స్ పాలకమండలి సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతున్న తమ కృషికి సహకారం అందజేయాలని , ప్రజారోగ్యంలో హ్యాపీనెస్ తీసుకురావాలని సీఎం చంద్రబాబు కోరారు. వచ్చే ఐదేళ్లలో స్విమ్స్ దేశంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న నెంబర్-1 సంస్థగా రూపొందాలని ఆకాంక్షించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) పాలకమండలి 18వ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ వైద్యసేవలపై ప్రజల్లో పూర్తి సంతృప్తి తేవాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకుని ప్రజారోగ్య పరిరక్షణకు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఫలితాల సాధనకు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్ప కాలిక లక్ష్యాలతో పనిచేయాలని సీఎం సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి శాలరీ గ్రాంట్‌కు బడ్జెట్ ఇస్తామని, అందుకు అనుగుణంగా తదుపరి ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యకు ముఖ్యమంత్రి ఆదేశించారు. టీటీడీ, స్విమ్స్ సమన్వ యంతో పనిచేయాలని, సేవా పథకాల అమలులో మరింత సహకారం తీసుకోవాలని స్విమ్స్‌కు సీఎం సూచించారు. స్విమ్స్ లాంటి ఇతర సంస్థలకు ఎంత బడ్జెట్ కేటాయిస్తున్నారో తెలుసుకున్న ముఖ్యమంత్రి.. స్విమ్స్ స్వయం పోషకత్వం సాధించేందుకు కృషిచేయాలన్నారు. అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఉత్తమ ప్రమాణాలు తేవాలని ఆదేశించారు. అన్నదానం ట్రస్టు తరహాలో అన్నక్యాంటీన్లకు విరాళాలిచ్చే దాతలను ప్రోత్సహించాలని, ఈ దిశగా తమకు కొన్ని సూచనలు చేయాలని సమావేశంలో పాల్గొన్న టీటీడీ ఈవో అనిల్ సింఘాల్‌ను ముఖ్యమంత్రి కోరారు. స్విమ్స్‌లో సేవాభావంతో చేపట్టిన పథకాలు ఎలా నడుస్తున్నాయో తెలుసు కున్నారు. స్విమ్స్ అభివృద్ధి కార్యక్రమాలపై స్విమ్స్ డైరెక్టర్-వైస్ చాన్సలర్ డా. టి.ఎస్. రవికుమార్ నివేదిక సమర్పిస్తూ నారావారిపల్లె పీహెచ్‌సీని స్విమ్స్‌కు అనుబంధ కేంద్రంగా చేయాలన్న ఆదేశాలకు సంబం ధించి ఉత్తర్వుల కోసం వేచిచూస్తున్నట్లు తెలిపారు. 2018-19లో స్విమ్స్‌కు రూ.50 కోట్ల శాలరీ గ్రాంట్ ఇవ్వాలని వైస్-ఛాన్సలర్ కోరగా వచ్చే ఏడాది నుంచి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని, ఇందుకు తదుపరి చర్య తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. స్విమ్స్‌లో అమలు చేస్తున్న ఆదిత్య హృదయం, ప్రివెంటివ్ కార్డియాలజీ కార్యక్రమ వివరాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్, నోటి కేన్సర్, సర్విక్స్ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించే పింక్ బస్ స్ట్రాటజీని రూపొందించి అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రికి వైస్ ఛాన్సలర్ రవికుమార్ వివరించారు. ముందుగానే వ్యాధిని పసిగట్టి నిరోధించే దశలోనే నిరోధించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ మరణాలను 63%కు తగ్గించగలిగినట్లు చెప్పారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎస్.ఎం.డి ఫరూక్, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, స్విమ్స్ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పే-కమిటీ చర్చలు వాయిదా:ఈయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణపై శుక్రవారం ఆర్టీసీహౌస్‌లో జరిగిన చర్చలు ఈనెల 22వ తేదీకి వాయిదా పడ్డాయి. ఈమేరకు ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు ప్రకటన చేశారు. యాజమాన్యం 20 శాతం ఫిట్‌మెంట్‌ను చెల్లించే ప్రతిపాదనను తాము తిరస్కరించినట్లు తెలిపారు. శ్రమకు తగిన ఫలితాన్ని లెక్కించి 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. సానుకూలంగా స్పందన రానిపక్షంలో సమ్మెకు వెనుకాడబోమని స్పష్టం చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ జరిగిన చర్చల ద్వారా అంగీకరించిన కారుణ్య నియామకాల ప్రక్రియను జనవరి నెలాఖరు నుంచి ప్రారంభించేందుకు యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ వెంటనే చేపడతామని, ఎంగేజ్‌లో ఉన్న వారితో వివిధ ఖాళీలను భర్తీ చేస్తామని అంగీకరించిందన్నారు. అలాగే 2016 సంవత్సరానికి సంబంధించిన లీవు ఎన్‌క్యాష్‌మెంట్‌ను ఈనెల 24వ తేదీన చెల్లిస్తామని సంస్థ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్.వి.సురేంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కోటేశ్వరరావు, జయరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రాఘవరెడ్డి పాల్గొనగా, ఈయూ తరపున తమతోపాటు రాష్ట్ర నాయకులు ఎం.హనుమంతరావు, సుబ్రహ్మణ్యరాజు, అవుల ప్రభాకర్, జి.వి.నరసయ్య, సిద్ధిక్, ఎం.డి.ప్రసాద్, ఎస్.వి.రావు తదితరులు హాజరైనట్లు తెలిపారు.

ప్రైవేటు సిబ్బంది నియామకాలు ఉపసంహరించుకోవాలి

ఆర్టీసీ వాహనాలకు డ్రైవర్లుగా ప్రైవేటు సిబ్బంది నియమించే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఈయూ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంస్థ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్.వి.సురేంద్రబాబుకు శుక్రవారం వినతి పత్రాన్ని అందచేశారు. ప్రస్తుతం సూచిక-2లో తెలిపిన లేఖను వెనక్కు తీసుకోవాలన్నారు. యాజమాన్యం సిబ్బందిని కుదించాలనే ధ్యేయంతో గత ఐదేళ్ల కాలంలో 12వేల మంది పదవీ విరమణ చేస్తే ఆ ఖాళీలను ఇంతవరకూ భర్తీ చేయలేదన్నారు. ఎన్నడూ లేని విధంగా, సంప్రదాయాలకు భిన్నంగా ఆర్టీసీ సొంత వాహనాలు, స్కూల్ బస్సులకు, లైట్ వెహికల్స్‌కు రిటైర్ అయిన వారిని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని యాజమాన్యం నిర్ణయించడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో జరగబోవు పారిశ్రామిక అశాంతికి యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

కర్ణాటకలో రిసార్ట్ రాజకీయం

బెంగళూర్ : కర్ణాటక రాజకీయ పరిణామాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్ శుక్రవారం నిర్వహించిన శాసనసభాపక్ష సమావేశానికి నలుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యేలందరినీ బెంగళూర్‌లోని రిసార్ట్స్‌కు తరలించారు. సీఎల్పీ భేటీకి పార్టీ ఎమ్మెల్యేలు రమేష్ జర్కోలి, బీ నాగేంద్ర, మహేష్ కే, ఉమేష్ జాదవ్‌లు హాజరు కాలేదు. తాను అనారోగ్య కారణాలతో సమావేశానికి హాజరు కాలేనని జాదవ్ పార్టీ నేత సిద్ధరామయ్యకు లేఖ రాశారు. సీఎల్పీ భేటీకి 80 మంది ఎమ్మెల్యేలకు గాను 76 మంది హాజరయ్యారని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. గైర్హాజరైన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి హైకమాండ్ సూచలనకు అనుగుణంగా చర్యలు చేపడతామని చెప్పారు. సీఎల్పీ భేటీ అనంతరం సమావేశానికి హాజరైన 76 మందిని ప్రత్యేక బస్సుల్లో నగర శివార్లలోని ఈగల్టన్ గోల్ఫ్ రిసార్ట్స్‌కు తరలించారు.

రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

రౌడీ షీట్ కూడా తెరిచారు...ఆ సంఘటన పూర్తిగా మరవకముందే... గ్రామంలో గురువారం రాత్రి గ్రామస్తులు, పోలీసులు మధ్య మరో ఘర్షణ జరిగింది. మామిడిపాలెంలో గురువారం గ్రామదేవతా పండగ జరిగింది. పండగ సందర్భంగా గ్రామంలో రికార్డింగ్ డాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే రూరల్ పోలీసులు అనుమతి తీసుకొని కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 9,10 గంటల మధ్యలో ముగిసిపోయింది.. కార్యక్రమం అనంతరం మైక్‌సెట్, లైట్లు తొలగించడానికి వాటికి సంబంధించిన వ్యక్తులు సిద్ధపడుతుండగా రూరల్ ఎస్సై ఆదినారాయణరెడ్డి, కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు జీపులో అక్కడకు చేరుకొని మైక్‌సెట్, లైట్లను లాఠీలతో పగలగొట్టారని గ్రామస్తులు తెలిపారు. నిలదీసిన మైక్‌సెట్ బాయ్‌ను సైతం పోలీసులు చితకబాదారని, దీంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు కరణం శ్రీనివాసరావు(చెక్కలన్న) కలుగజేసుకొని మీ అనుమతి తీసుకొని ప్రోగ్రాం ఏర్పాటు చేసుకున్నాం కదా.. అంటూ నిలదీశాడు. దీంతో ఆగ్రహించిన ఎస్సై కరణం శ్రీనివాసరావు చొక్కా పట్టుకొని జీపు ఎక్కించబోగా ఆగ్రహించిన గ్రామస్తులు పోలీసుల జీపుపై దాడి చేశారు. అడ్డుకున్న పోలీసులను గ్రామస్తులు కొట్టడంతో ఎస్సైతో సహా కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులకు, గ్రామస్తులకు గాయాలయ్యాయి.

ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన మరోవర్గం నాయకుడు పండగలో అశ్లీల నృత్యాలు జరుగుతున్నా రూరల్ పోలీసులు స్పందించకపోవడంతో ఎస్పీకి ఫోన్‌చేశాడని తెలిసింది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రామచంద్రారావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో అశ్లీల నృత్యాలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు అక్కడకే చేరుకొని అడ్డుకున్నారని దీంతో గ్రామస్తులు తిరగబడి పోలీసులపైదాడి చేశారని ఆయన తెలిపారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎటువంటి అనుమతులు లేకుండా కార్యక్రమం ఏర్పాటుచేశారన్నారు.దీనిపై విచారణ జరుగుతోందని, జీపు ధ్వంసం చేసి, పోలీసులపై దాడి చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్టీఆర్ ఆసుపత్రిలో శ్రీనివాసరావుకు చికిత్స

తెలుగుదేశం పార్టీ నాయకుడు కరణం శ్రీనివాసరావు ఇంటిచుట్టూ పోలీసులు మోహరించి, బయటకువచ్చిన శ్రీనివాసరావును లాక్కుంటూ పోతుండగా ఆయన స్పృహతప్పి పడిపోయారు. వెంటనే ఆయన్ని స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు.

మహీ మ్యాజిక్



- ఆసీస్‌పై వన్డే సిరీస్ కైవసం
- చరిత్ర తిరగరాసిన టీమిండియా
- ధోనీకి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు
- వరుసగా మూడు అర్ధశతకాలు



మెల్‌బోర్న్: అస్ట్రేలియాపై పరిపూర్ణ విజయం. తొలుత 1-1తో టీ20 సిరీస్ సమం. తర్వాత 2-1తో టెస్టు సిరీస్ కైవసం. ఇప్పుడు 2-1తో వన్డే సిరీస్ భారత్ సొంతం. ఓ పటిష్ఠ జట్టుపై విదేశాల్లో టీమిండియా అన్ని సిరీస్‌లను కోహ్లి నాయకత్వంలోనే అందుకోవడం అద్భుతం. నిర్ణయాత్మక చివరి వన్డే సాదా సీదాగా ఏమీ సాగలేదు. పిచ్ మందకొడిగా ఉండటంతో పరుగులు చేయడం కష్టమైంది. తొలుత మణికట్టు మాంత్రికుడు యుజువేంద్ర చాహల్ 6/42 చెలరేగడంతో ఆసీస్48.4 ఓవర్లకు 230 పరుగులు చేసింది. ఛేదనలో మహేంద్రసింగ్ ధోనీ (87, 114 బంతుల్లో 6×4), కేదార్ జాదవ్ (61, 57 బంతుల్లో 7×4) అజేయంగా నిలిచారు. నాలుగో వికెట్‌కు 116 బంతుల్లో 121 పరుగుల భాగస్వామ్యం అందించారు. విరాట్ కోహ్లి (46, 62 బంతుల్లో 3×4) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

సమయోచితంగా కోహ్లి

మందకొడి పిచ్‌పై టీమిండియా ఛేదనలో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ రోహిత్ శర్మ (9, 17 బంతుల్లో 1×4) జట్టు స్కోరు 15 వద్దే వెనుదిరిగాడు. సిడిల్ వేసిన 5.6వ బంతికి షాన్ మార్ష్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పుడు క్రీజులోకి వచ్చిన భారత సారథి విరాట్ కోహ్లి అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. ఆచితూచి ఆడాడు. ఆసీస్ పేసర్లు రిచర్డ్‌సన్, స్టాన్‌లేక్ బంతుల్ని చక్కగా అడ్డుకున్నాడు. వారికి తోడైన స్పిన్నర్ జంపా బౌలింగ్‌లోనూ ఒక్కో పరుగు సాధించాడు. జట్టు స్కోరు 59 వద్ద ధావన్ (23, 46 బంతుల్లో)ను స్టాయినిస్ ఔట్ చేయడంతో ధోనీ క్రీజులోకి వచ్చాడు. ధోనీ, కోహ్లి మూడో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం అందించారు. అర్ధశతకానికి చేరువైన విరాట్‌ను 30 ఓవర్ చివరి బంతికి రిచర్డ్‌సన్ పెవిలియన్ పంపించాడు. అప్పటి జట్టు స్కోరు 113.

ధోనీ అండగా 'కేదార్ జాదూ'

విరాట్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన కేదార్ జాదవ్ తొలుత పరుగులు చేసేందుకు కష్టపడ్డాడు. ఒక్కో పరుగు సాధించాడు. నిలదొక్కుకున్న తర్వాత బౌండరీలు బాదేశాడు. అప్పటికే క్రీజులో పాతుకుపోయిన ధోనీ అర్ధశతకానికి చేరువయ్యాడు. చేయాల్సిన పరుగులు ఎక్కువ లేకపోవడంతో కఠినంగా వస్తున్న బంతుల్ని డిఫెండ్ చేశాడు. అనవసర షాట్లకు ప్రయత్నించలేదు. ఈ క్రమంలో జాదవ్, ధోనీ చెత్త బంతుల్ని వేటాడి బౌండరీకి తరలించారు. డ్రింక్స్ బ్రేక్ తర్వాత మహీ అర్ధశతకం సాధించాడు. చివరి ఐదు ఓవర్లలో భారత్ 44 పరుగులు చేయాల్సి ఉండగా కేదార్ జాదవ్ సమయోచితంగా వరుస బౌండరీలు సాధించి అర్ధశతకం అందుకున్నాడు. సమీకరణం చివరి 12 బంతుల్లో 14 పరుగులుగా మారడంతో భారత్ విజయం ఖాయమైంది. స్టాయినిస్ వేసిన 49 ఓవర్‌లో 13 పరుగులు వచ్చాయి. 49.2వ బంతికి జాదవ్ బౌండరీ సాధించి విజయం అందించాడు. చాహల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ధోనీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందుకున్నారు.

కఠిన చర్యలు తప్పవు : ఐసీసీ

ముంబై : ఇంగ్లండ్ వేదికగా ఈ ఏడాది మే 30 నుంచి ఐసీసీ వన్డే వరల్డ్ కప్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ వరల్డ్ కప్ కోసం అమ్మకానికి పెట్టిన టికెట్లన్నీ ఇప్పటికే అమ్ముడుపోయాయి. ఈ టోర్నీ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం ఐసీసీ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో థర్డ్ పార్టీ టికెట్ అమ్మేవాళ్లపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ఐసీసీ సిద్ధమైంది. వన్డే వరల్డ్‌కప్‌కి సంబంధించి ఇష్టమొచ్చినంత రీతిలో టికెట్ ధరలు పెంచి విక్రయించే వారిపై నిఘా పెట్టిన ఐసీసీ టికెట్ అమ్మకాలకు కచ్చితమైన రేటును నిర్ధారించే ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. "అక్రమంగా టికెట్లు అమ్మేవాళ్లపై ద ృష్టిసారించాం. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటాం. టికెట్లు అమ్మే థర్డ్ పార్టీ వ్యక్తుల నుంచి దూరంగా ఉండాలని అభిమానులను కోరుతున్నాం. అటువంటి వ్యక్తుల నుంచి టికెట్లు కొనుగోలు చేస్తే.. మీకు చాలా నష్టం జరుగుతుంది. అవి నిజమైన టికెట్లు కాకుంటే.. మీకు స్టేడియంలో ప్రవేశం ఉండదు" ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. టికెట్ కొనుగోలు చేసిన అభిమానులు మ్యాచ్‌కు వెళ్లలేక, వాటిని తిరిగి విక్రయించాలనుకుంటే.. దానిని ఐసీసీ ప్లాట్‌ఫాం ద్వారానే చేయాలని ఐసీసీ స్పష్టం చేసింది. ఇందుకోసం టికెట్ మాస్టర్ అనే సంస్థ ఈ ప్లాట్‌ఫాంని రూపొందించిందని ఐసీసీ తెలిపింది. దీనిని త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

జహీర్ నన్ను మార్చేశాడు : కౌల్



ముంబై : టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ తన బౌలింగ్‌ను పూర్తిగా మార్చేశాడని పంజాబ్ పేసర్ సిద్ధార్థ్ కౌల్ అన్నాడు. ఆయన మార్గదర్శనంలోనే తన బౌలింగ్ రాటుదేలిందని పేర్కొన్నాడు. 28 ఏళ్ల ఈ పంజాబ్ స్పీడ్‌స్టర్ న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపికయ్యాడు. పంజాబ్ తరపున రంజీల్లో రాణించాడు. భారత్-ఏ తరపున అదరగొట్టాడు. కౌల్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. 'నా తొలి ప్రాధాన్యం దేశవాళీ క్రికెట్‌కే. పంజాబ్ తరపున చేసిన ప్రదర్శనలే జాతీయ జట్టులో అవకాశం ఇప్పించాయి. న్యూజిలాండ్‌లో భారత్-ఏ తరపున బౌలింగ్ చేశా. అక్కడి పిచ్‌లపై పూర్తి అవగాహన ఉంది. ఎప్పుడూ జట్టు గెలుపు కోసమే కష్టపడతా. నా మార్గనిర్దేశకుడు జహీర్ ఖాన్ నేతృత్వంలో నా బౌలింగ్ ప్రాథమిక అంశాలను మరింత పటిష్ఠం చేసుకున్నా. ఆయన చక్కని సలహాలు ఇస్తారు. బంతులు విసిరేటప్పుడు సింపుల్‌గా ఉండాలని సూచిస్తారు. ఆయన నాతో చాలా సమయం గడిపారు. నా బౌలింగ్ గురించి నోట్స్ రాసుకున్నారు. బంతులు విసిరేటప్పుడు ఏ కండరాలు ఉపయోగించాలి, ఏ ప్రాంతాల్లో బంతులు వేయాలో చెప్పారు. భారత్-ఏ తరపున న్యూజిలాండ్ వెళ్లేటప్పుడూ ఆయనతో మాట్లాడాను. ఆ సలహాలు అద్భుతంగా ఉపయోగపడ్డాయి. భారత్-ఏ కోచ్ రాహుల్ సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన జ్ఞానానికి వెలకట్టలేం. ఆయన సలహాలు నాకెంతగానో ఉపయోగపడ్డాయి' అని కౌల్ పేర్కొన్నాడు.

షరపోవా అదుర్స్

- డిఫెండింగ్ చాంపియన్‌కి షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌లోకి
- నాదల్, ఫెదరర్, కెర్బర్, స్టీఫెన్స్ ముందంజ



మెల్‌బోర్న్ : మాజీ నెంబర్ వన్ షరపోవా ఆస్ట్రేలియా ఓపెన్ ప్రీక్వార్టర్స్ చేరింది. డిఫెండింగ్ చాంపియన్ మూడో సీడ్ వోజ్నియాకీకి షాక్ ఇచ్చింది. క్విటోవా, కెర్బర్, స్టీఫెన్స్ ప్రీక్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో ఫెదరర్, నాదల్, సిలిచ్ ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో 30 సీడ్ షరపోవా 6-4, 4-6, 6-3 తేడాతో వోజ్నియాకీని ఓడించింది. తొలి సెట్‌ను షరపోవా ప్రత్యర్థి సర్వ్‌ను బ్రేక్ చేసి గెలిచినా, రెండో సెట్‌లో ఓడింది. మూడో సెట్‌లో వోజ్నియాకీ సర్వ్‌ను రెండు సార్లు బ్రేక్ చేసి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం షరపోవా 15 సీడ్ బర్టీతో తలపడనుంది. మరో మహిళల సింగిల్స్ మ్యాచుల్లో రెండో సీడ్ కెర్బర్ ఆస్ట్రేలియాకు చెందిన బిరెల్‌ను 6-1, 6-0తో ఓడించింది. అమెరికాకు చెందిన 5వ సీడ్ స్టీఫెన్స్ మార్టిక్‌పై 7-6, 7-6 తేడాతో విజయం సాధించగా 8వ సీడ్ క్విటోవా బెన్‌సిక్‌పై గెలిచింది. 11వ సీడ్ సెబలెంకా ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ నాదల్ ఆస్ట్రేలియాకు చెందిన డిమినార్‌పై 6-1, 6-2, 6-4 తేడాతో గెలవగా, మూడో సీడ్ ఫెదరర్ ఫ్రిట్జ్‌పై 6-2, 7-5, 6-2 తేడాతో గెలిచి ప్రీక్వార్టర్స్‌లో చేరారు. మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ సిలిచ్ ఐదు సెట్ల పోరులో వెర్డాస్కోను ఓడించాడు. నాలుగో రౌండ్‌లో నాదల్ బెర్డిచ్‌ను, ఫెదరర్ 14వ సీడ్ సిసిపస్‌ను ఎదుర్కోనున్నారు.

సెమీస్‌లో సైనా .. శ్రీకాంత్ ఓటమి



కౌలాలంపూర్ : భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేషియా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నీ సెమీస్‌లో అడుగుపెట్టింది. అయితే పురుషుల క్వార్టర్స్ మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. సైనా క్వార్టర్స్‌లో రెండో సీడ్ నజోమీ ఒకుహారాను 21-18, 23-21 తేడాతో ఓడించింది. రెండు గేమ్‌ల్లోనూ సైనా విజయం కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. తొలి సెట్‌ను ప్రథమార్థంలో ఇద్దరూ చెరో పాయింటు గెలుచుకుంటూ 9-9 తో సమానంగా ఉండగా ఒకుహరా వరుసగా ఆరు పాయింట్లు సాధించింది. అయతే సైనా ఒక్కో పాయింటు సాధిస్తూ 17-16 ఆధిక్యంలోకి వచ్చి ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా సెట్‌ను 21-18తేడాతో గెలుచుకుని ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో సెట్‌లోనూ సైనాకు గట్టి పోటీ ఎదురైంది. సెట్ తొలి భాగం పూర్తయే సరికి ఒకుహర 18-14 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే సైనా వరుస పాయింట్లు సాధిస్తూ 19-19తో స్కోరును సమం చేసింది. చివరికి సైనా 23-21తో సెట్‌నూ మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది. మరో క్వార్టర్స్‌లో శ్రీకాంత్ కొరియాకు చెందిన నాలుగో సీడ్ సన్ వాన్ హో చేతిలో 21-23, 21-16, 21-17 తేడాతో ఓడిపోయాడు. సైనా సెమీస్‌లో కరోలినా మారిన్‌ను ఎదుర్కోనుంది.

ప్రజాస్వామ్య రక్షణకు

బీజేపీ వ్యతిరేక శక్తుల ఐక్యత

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పిలుపు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు న్యాయమూర్తులు, మేధావులు ప్రజలను అర్థించే పరిస్థితి నెలకొనడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పెను ప్రమాదంలో చిక్కుకున్న ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రముఖ మేధావి ఆనంద్ తేల్తుంబ్డే ప్రజల మద్దతు కోరుతూ రాసిన లేఖపై శుక్రవారం ట్విట్టర్ ద్వారా నారాయణ స్పందించారు. కేంద్ర ప్రభుత్వ అరాచకాల నుంచి కాపాడాలని, తనకు ప్రాణహాని ఉందని ఆనంద్ తేల్తుంబ్డే ప్రజలకు విజ్ఞప్తి చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో అనుమానా స్పదంగా మరణించినవారు అనేకమంది ఉన్నారని తెలిపారు. గోవింద్ పన్సారే, గౌరీ లంకేష్ తదితరులు హత్యకు గురయ్యారన్నారు. ఈ మరణాలకు కారకులైనవారిపై ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడంపై సీబీఐ తీరును న్యాయవ్యవస్థ ఇటీవలే తప్పుబట్టిందని గుర్తు చేశారు. సంఘ్‌పరివార్ శక్తులు సాగిస్తున్న హత్యాకాండను ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వం.. అనుమానంతో మేధావులను అరెస్ట్ చేస్తోంద న్నారు. ఇందుకు వరవరరావు, సాయిబాబాల అరెస్టులే నిదర్శనమన్నారు. జేఎన్‌టీయూ మాజీ నేత కన్హయకుమార్ రాబోయే ఎన్నికల్లో పోటీచేయకుండా ఉండేందుకు కల్పిత కథను సృష్టించి, తద్వారా చార్జిషీట్‌ను దాఖలు చేయించి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా రేపోమాపో అరెస్ట్ చేయించేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. బీజేపీ, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులన్నీ ఏకమై ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం నిజాయతీగా వ్యవహరించే మేధావులను హతమారుస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యం కోసం పోరాటాలు సాగించేవారు, మేధావులు, స్వాతంత్ర్య సమర యోధులు భయపడే వాతావరణాన్ని కేంద్రం కల్పించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

బీజేపీ పాలనకు అడ్డుకట్ట వేయాలి : రామకృష్ణ

కేంద్రంలో బీజేపీ పాలనకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మేధావి ఆనంద్ తేల్తుంబ్డే విషయంలో దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజల నుంచి విశేష రీతితో మద్దతు లభిస్తోందన్నారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆయన చేస్తున్న పర్యటనలు, రాస్తున్న పుస్తకాలు చూసి... మోడీ ప్రభుత్వానికి కన్ను కుట్టిందన్నారు. వామపక్ష మేధావులు, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని వ్యతిరేకించే వారిపై ఏదో ఒక రూపంలో అణచివేతకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోం దన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక రకాల ఆంక్షల ద్వారా భావప్రకటన స్వేచ్ఛను అణగదొక్కాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలలోనూ విద్యార్థులు, అధ్యాపకులపై ఆంక్షలు విధించిందన్నారు. కన్హయకుమార్ తదితరులపై చార్జిషీట్ పెట్టడం ద్వారా విద్యార్థి లోకాన్ని భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని వర్గాలకు సంబంధించిన ప్రజలు, ప్రజా సంఘాలు, మేధావులు, రాజకీయపార్టీలు ప్రభుత్వ హత్యారాజకీయాలను ముక్తకంఠంతో ఖండించాల న్నారు. ఇంత జరుగుతున్నా మోడీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమని రామకృష్ణ పేర్కొన్నారు.

'విదేశీ' జోక్యం ప్రమాదం

- రక్షణ రంగ పరిరక్షణ అవసరం
- కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు : సురవరం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రక్షణశాఖ పరికరాలను ప్రైవేటుపరం చేసే యోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రక్షణరంగంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23 నుంచి 25 వరకూ నాలుగు సంఘాలకు చెందిన 4 లక్షల మంది కార్మికులు నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ రక్షణ సంస్థల్లో విదేశీ సంస్థలు జోక్యం చేసుకునే పరిస్థితి అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అలోక్‌వర్మను బదిలీ చేయడం దారుణమని, ఇది మోడీ ప్రభుత్వ తొందరపాటు చర్య అని పేర్కొన్నారు. మోడీ కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని అన్నారు. ఇప్పటికీ ఆయనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు రుజువు కాలేదన్నారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు, సీబీఐ విచారణకు సంబంధించిన మొత్తం వ్యవహారం ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. కేరళలో కమ్యూనిస్టులపై మోడీ చేసిన ఆరోపణలను సురవరం తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మతోన్మాదులు చేస్తున్న ఆందోళనలను ప్రధాని ప్రత్యక్షంగా బలపర్చడం సిగ్గుచేటని, ఇది అతని స్థాయికి తగదన్నారు. కన్హయ, ఇతరులపై తప్పుడు కేసులు బనాయించి 1200 పేజీల చార్జిషీటును ఇప్పుడు కోర్టుకు సమర్పించారని, జేఎన్‌యూ విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులు, చార్జిషీట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సురవరం డిమాండు చేశారు. కార్పొరేటీకరణకు అనుకూలంగా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం కూటములు కడితే తప్పేమిటని సురవరం ప్రశ్నించారు. 32 పార్టీలతో బీజేపీ కూటమిగా ఏర్పడితే తప్పులేనప్పుడు...10, 12 పార్టీలతో ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం కూటములు కడితే తప్పేమిటని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ కలిస్తే మోడీ కాళ్ల కింద భూమి కదిలిపోయిందని విమర్శించారు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో దేశంలో బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని సురవరం తెలిపారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ నుంచి ఫిరాయిస్తే ఒకరకంగా.. టీఆర్ఎస్‌లోకి వెళ్తే మరోరకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలం గాణ అసెంబ్లీ నూతన స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్‌గా నిష్పక్షపాతంగా, శాసనసభ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేలా నడుపుతారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పాస్‌వర్డ్ ఇవ్వనందుకు భర్తకు నిప్పు

జకార్తా: మొబైల్ పాస్‌వర్డ్ ఇవ్వనందుకు ఓ మహిళ దారుణానికి ఒడిగట్టింది. కట్టుకున్న భర్తకే నిప్పుపెట్టి సజీవదహనం చేసింది. ఈ ఘటన ఇండోనేసియాలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. దేడి పూర్ణమ అనే వ్యక్తి తన ఇంట్లో ఏదో పని చేసుకుంటూ ఉండగా అతని భార్య ఇల్హామ్ ఫోన్ పాస్‌వర్డ్ అడిగింది. పాస్‌వర్డ్ చెప్పడానికి దేడి ఒప్పుకోలేదు. దాంతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తురాలైన ఇల్హామ్ తన భర్త ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. అరుపులు విని చుట్టుపక్కల వారు అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇల్హామ్‌ను అరెస్ట్ చేశారు. గతంలోనూ చిన్న చిన్న విషయాలపై కోపగించుకుని ఇల్హామ్ తన భర్తను హింసించేదని పెట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

శనిగ్రహం ఏర్పడి 450 కోట్ల ఏళ్లు

నాసా పంపిన కశిని వాహక నౌక అధ్యయంలో వెల్లడి

వాషింగ్టన్ : సౌరవ్యవస్థలో శనిగ్రహం చుట్టూ ఉండే వలయాలు చాలా ఆలస్యంగా ఏర్పడినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) పంపిన వాహక నౌక కశిని ద్వారా వెల్లడైంది. 1997 నుంచి 2017 వరకు శనిగ్రహం పరిధిలో సంచరించిన అమెరికా-యూరప్ సంయుక్త వాహక నౌక ద్వారా ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. మిగతా గ్రహాలతో పాటు శనిగ్రహం సుమారు 450 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తుండగా.. దాని చుట్టూ ఏర్పడిన వలయాలు మాత్రం కోటి నుంచి పదికోట్ల సంవత్సరాల మధ్యలో ఏర్పడినట్లు తాజాగా గుర్తించారు. ఫలితంగా శనిగ్రహం ఏర్పడిన తర్వాత సుమారు 350 కోట్ల సంవత్సరాల పాటు స్వాభావిక వలయాలు లేకుండానే ఉనికి సాగించినట్లు కశిని అనే వాహక నౌక ద్వారా తెలిసింది. ఈ వలయాలు శనిగ్రహం పరిధిలో ఉండే ఉపగ్రహాలు ఢీకొనడం లేదా తోక చుక్కల కారణంగా ఏర్పడి ఉండవచ్చని ఖగోళ శాస్త్రవేత్తలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.